తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం




సంపుటి : 02 సంచిక 323 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి ఆదివారం 2-3-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur



## ఇసుక అక్రమ రవాణాపై..
# ఉక్కుపాదం
### ప్రభుత్వం చేపట్టే పనులకు అందుబాటులో ఇసుక
### అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి1:** ఇసుక, ఖనిజాల అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టే పనులకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నుంచే ఇసుక సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఖనిజాభివృద్ధి శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు. 'నిర్మాణరంగ సంస్థలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేయాలి. సరైన ధరలకు సరఫరా చేస్తే అక్రమాలకు ఆస్కారం ఉండదు. హైదరాబాద్ నగరానికి మూడు వైపులా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. క్వారీలకు జరిమానాలపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. మైనర్ ఖనిజాల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలి' అని సీఎం ఆదేశించారు. ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమన్నారు. తొలుత గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిన విధానాన్ని, పెరిగిన ఆదాయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. ప్రభుత్వంలోని నీటి పారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేప్టటే పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా చేసేలా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో నిర్మాణాలు చేపట్టే నిర్మాణ రంగ సంస్థలకు అవసరమైన ఇసుకను టీజీ ఎండీసీ ద్వారానే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. సరైన ధరలకు ప్రభుత్వమే ఇసుక సరఫరా చేస్తే అక్రమంగా సరఫరా చేసే వారిపై వినియోగదారులు ఆధారపడరన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక ఎక్కువగా వినియోగం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా సీఎం అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయం త్వరగా తీసుకొని సమస్యను పరిష్కరించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు.

## రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్
# రాజకీయాలు
### హామీలు అమలు చేయలేక తనపై విమర్శలు
### అబద్ధాలు ప్రచారం చేస్తే ప్రజలను నమ్మరు
### సీఎం రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు



**హైదరాబాద్,మార్చి1:** ఇచ్చిన హామీలు అమలు చేయలేక చతికిల పడ్డ సీఎం రేవంత్ రెడ్డి తనపై పడి ఏడుస్తున్నాడని, వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని, అబద్దాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత వారం రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై.. వ్యక్తిగతంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలకు విరుద్ధంగా బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు.. అవగాహన, అనుభవ రాహిత్యంతో, అసహంతో మాట్లాడుతు న్నారని ఆరోపించారు. తాను కేంద్ర మంత్రిగా చేసిన పనులు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియ చేస్తున్నానని.. కేంద్ర పథకాల్ని తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడంలో ఒక విధానం ఉంటుంది. తెలంగాణలో కేంద్రం చేపట్టిన రూ. 10లక్షల కోట్ల విలువైన పనులను ఇప్పటికే వివరించాం. నేను ఇతర కేంద్ర మంత్రులను బెదిరించానని దిగజారుడు మాటలు మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థంగా అమలు చేయాలని సీఎంలకు ఎన్నో లేఖలు రాశాను. సీఎంలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తిని. దేశంలో నిర్మించే 7 టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చాను.

## ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో 8మంది
# సజీవసమాధి
### భౌతిక కాయాల వెలికితీతకు తీవ్రంగా కృషి
### సహాయక చర్యల్లో ఎక్కడా పొరపాట్లు లేవన్న మంత్రి జూపల్లి



**దోమలపెంట,మార్చి1:** ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకుపోయిన ఎనిమిది మంది మృతి చెందినట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఈ మేరకు ప్రమాదంపై కీలక ప్రకటన చేశారు. ఉదయం టన్నెల్ ప్రమాదస్థల ప్రాంతానికి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి చేరుకుని అక్కడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. టన్నెల్‌లో సహాయక చర్యల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని తెలిపారు. ఆదివారం రాత్రి వరకు నలుగురి ఆచూకీ దొరుకుతుందన్నారు. మిగిలిన వారి ఆచూకీకి మరింత సమయం పడుతుందని తెలిపారు. టన్నెల్ బోరు మిషన్ కట్ చేసి ఆపరేషన్ చేస్తున్నారని చెప్పారు. టన్నెల్ సహాయక చర్యలపై ప్రతిపక్షాలు ఘటనపై ఇష్టానుసారంగా మాట్లాడుతు న్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది చనిపోవడం అత్యంత విచారకరమని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. రాడార్ ద్వారా నలుగురి మృతదేహాలు ఒకచోట.. మరో ఇద్దరివి మరోచోట.. మరో ఇద్దరివి మరోచోట గుర్తించారని తెలిపారు. అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయని.. రేపు మధ్యాహ్నానికల్లా మృతదేహాలు బయటపడే అవకాశం ఉందని ఎమ్మెల్యే వంశీ కృష్ణ పేర్కొన్నారు.

# త్వరలో ఉప ఎన్నికలు
### మంచి చెప్పడానికి రేవంత్ చేసిందేమీ లేదు
### తెలంగాణ భవన్‌లో కెటిఆర్ వ్యాఖ్యలు



**హైదరాబాద్,మార్చి1:** త్వరలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోమారు అన్నారు. కాంగ్రెస్ మీటింగ్ లో మూడు ఆణిముత్యాల మాటలు చెప్పారు.. మంచి మైక్‌లో చెప్పాలి చెడు చెవిలో చెప్పాలి అన్నారు.. మంచి చెప్పడానికి నువ్వు చేసిన ఒక్క మంచి పని లేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి చేసిన చెడు చెబితే.. చెవిలో రక్తాలు కారుతాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పలువురు కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కార్తీక్ రెడ్డి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా వస్తారని తెలిపారు. కేసీఆర్ దళం గులాబీ వనంలోకి వస్తున్న అందరికీ స్వాగతం అని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన ఇంచార్జి మీనాక్షి తన బ్యాగ్ మోయొద్దు అని చెప్పింది.. నీ పక్కన కూర్చున్న రేవంత్ రెడ్డినే బ్యాగ్‌లు మోసి పైకి వచ్చాడని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ చూసినా రేవంత్ రెడ్డిని బండ బూతులు తిడుతున్నారు.. రైతు బంధు ఎవరికీ పడడం లేదు అని తిడుతున్నారని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు టింగ్ టింగ్ మని పడేవి అని చెబుతున్నారు.. అందుకే రేవంత్ రెడ్డికి టింగ్ టింగ్ అనే పదం పడదని విమర్శించారు. అందుకే టకీ టకీ మని రైతు భరోసా పడుతుంది అంటున్నాడు.. ఎక్కడ చూసినా రైతు భరోసా పడట్లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఫాం హౌస్‌లు ఎవరికీ లేవు లోకం మీద.. నాకు ఒక్కడికే ఉన్నట్లు చెబుతున్నారు.. జెన్వాడలో ఉన్న తన కోసమే హైడ్రా ఏర్పాటు చేశారని కేటీఆర్ ఆరోపించారు. మరోవైపు.. ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేటీఆర్ మండిపడ్డారు. వేగంగా కమీషన్ల కోసం పనులు స్టార్ట్ చేశారు.. ఎస్ఎల్‌బీసీ వద్ద ఒక మంత్రి చేపలు తిందాం అంటాడు.. ఇంకో మంత్రి నీళ్లు వాటర్ కలవడం వల్ల జరిగింది అంటున్నాడు.. ఇలాంటి మంత్రులు ఉన్నారని దుయ్యబట్టారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి కారణం కేసీఆర్ అని అంటున్నారు.. అధికారం కోల్పోయి ఇన్ని నెలలు అయినా కేసీఆర్ అనే అంటున్నారని పేర్కొన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికలు అయినా.. పార్లమెంట్ ఎన్నికలు అయినా గులాబీ జెండానే ఎగురుతుందని తెలిపారు.

## కాంగ్రెస్ నుంచి మల్లన్న
# సస్పెండ్
### ఆదేశాలు జారీ చేసిన కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి



**హైదరాబాద్,మార్చి1:** కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశారు. ఈమేరకు ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడమే కాకుండా బీసీ కులగణన ప్రతులు చించడంపై ఆ పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ మల్లన్నకు ఫిబ్రవరి 5న షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరినా.. మల్లన్న నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు మల్లన్నను సస్పెండ్ చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదన్నారు.



# అజేయశక్తిగా ఎదుగుతున్న భారత్
### ఎన్ఎక్స్‌టీ కాంక్లేవ్ 2025 లో ప్రధానమంత్రి మోడీ

**న్యూఢిల్లీ,మార్చి1:** ఇన్నేళ్లు శ్రామిక శక్తిగా పేరుపొందిన భారతదేశం ప్రస్తుతం ప్రపంచ శక్తిగా రూపొందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇటీవల పెద్దఎత్తున మహాకుంభ మేళా నిర్వహించి నిర్వహణా నైపుణ్యాన్ని చాటుకుందని, రోజుకో రికార్డును భారతదేశం సృష్టిస్తోందని చెప్పారు. భారతదేశ నిర్వహణా నైపుణ్యం, ఆవిష్కరణల సామర్థ్యాన్ని ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని అన్నారు. దేశ రాజధానిలో శనివారంనాడు నిర్వహించిన ఎన్ఎక్స్‌టీ కాంక్లేవ్ 2025 లో ప్రధానమంత్రి మాట్లాడుతూ, భారత్ గురించి ప్రతిరోజూ సానుకూల సమాచారం వస్తుండటంతో ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తూ, భారత్‌కు రావాలని తహతహలాడుతున్నాయని చెప్పారు. ఫిబ్రవరి 26వ తేదీతో ప్రయాగ్‌రాజ్‌లో ముగిసిన మహాకుంభ్-2025 గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఒక టెంపరరీ సిటీలో నదీతీరాల వెంబడి కోట్లాది మంది ప్రజలు పవిత్రస్నానాలు చేయడంపై యావత్ ప్రపంచం ఆశ్చర్యంతో చూసిందని, మహాకుంభ మేళా నిర్వహణ భారతదేశం పాటించే నిర్వహణా నైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పిందని అన్నారు.

### ఈ ఎండాకాలంలో మండుటెండలు
# తప్పవు
### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



**హైదరాబాద్,మార్చి1:**
ఈ ఎండాకాలం మండుటెండలు తప్పవని, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటుందని.. వడగాలులు కూడా తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఏప్రిల్, మే నెల వచ్చేసరికి 44 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 1901 నుంచి 2025 వరకు సరాసరి సగటు తీసుకుంటే ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ప్రధానంగా దక్షిణ, మధ్య తెలంగాణతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వెల్లడించింది. దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే రెండు డిగ్రీలు పెరిగే సూచనలున్నాయని తెలిపింది. 125 సంవత్సరాల సరాసరి సగటు తీసుకుంటే గాలిలో తేమ చాలా తగ్గిందని పేర్కొంది.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి : జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి






**సంగారెడ్డి జిల్లా ప్రతినిధిః**

**నిర్వహణపై జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్.**

మార్చి 5వ తేదీ నుండి మార్చ్ 25 వరకు జరగనున్న ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శనివారం జిల్లా అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఆయా మండలాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలు పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవోలు తమ పరిధిలోని సెంటర్లను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. పరీక్షకు హాజరయ్యేవిద్యార్థుల ఫోన్లోభద్రపరిచేందుకుప్రత్యేకచర్యలు కోవాలన్నారు. జిల్లాలో 54పరీక్షకేంద్రాలలోఇంటర్పరీక్షలు లిపారుఇంటర్మీడియట్ ధికారులు,పోలీస్, రెవెన్యూ అధికారులతో నూ, సంబంధిత ాె అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ఇన్విజిలేటర్ లకు కూడా సెల్ఫోన్ అనుమతి లేదన్నారు. చీఫ్ సూపర్డెంట్, డిపార్ట్మెంటల్ అధికారులు ఈ విషయంలో గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ వినియోగించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాలలో మహిళా విద్యార్థులను తనిఖీ చేయడానికి ప్రత్యేక ఎంట్రీ ఏర్పాటు చేయాలన్నారు. సిసి కెమెరాలు నీడలో పరీక్షలు నిర్వహించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలకు,విద్యుత్, సానిటేషన్ ఇతర మౌలిక వస్తువులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు జరిగేలా ఇంటర్మీడియట్ విద్యాధికారులు, ఆయా డివిజన్ ల ఆర్డీవోలు ఇతర జిల్లా స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు సమస్యలు ఎదుర్కాకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు జరిగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

# ప్రజల ఆకాంక్షలకి అనుగుణంగా బడ్జెట్ఎమ్మెల్యే నల్లమిల్లి

**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి)::** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా ఉందని అంతేకాక ప్రజల ఆకాంక్షలకి అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ గత వైసిపి పాలకులు చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థల్ని పునరుద్ధరింప చేసే దిశగా అనేక సవాళ్లను సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి పునర్ నిర్మించే దిశగా ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కి ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే నల్లమిల్లి అన్నారు.ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం కోసం ఎటువంటి నిధులు కేటాయించని పరిస్థితి నుంచి ఇవాళ ప్రతి వర్గానికి వారి వారి అభ్యున్నతి కోసం నిధులు కేటాయించే పరిస్థితి చూస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఏదైతే సూపర్ సిక్స్,మేనిఫెస్టోలో ఉన్న కార్యక్రమాలు అమలులో పెట్టడం జరిగిందని బడ్జెట్లో అన్నదాత సుఖీభవ కోసం నిధులు కేటాయించడం జరిగిందని చెప్పారు. దీపం 2 పథకానికి 2,601 కోట్లు, అన్నదాత సుఖీభవ, 6,300 కోట్లు,తల్లికి వందనం కోసం 9407 కోట్లు కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు.సూపర్ సిక్స్ అమలులో భాగంగా ఎన్టీఆర్ భరోసా ఫింఛన్ల కార్యక్రమం ఇప్పటికే పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని దీనికోసం 27,518 కోట్ల కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి చెప్పారు.గత వైసిపి ప్రభుత్వం నవరత్నాల కోసం ఎప్పుడైనా ఈ విధంగా కేటాయింపులు బడ్జెట్లో చేశారా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ కోసం ఒక ప్రాతిపదికన బడ్జెట్లో నిధులను కేటాయిస్తూ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని అదేవిధంగా మిగిలిన కార్యక్రమాలు కూడా తొందర్లోనే చేపట్టడం జరుగుతుందని వాటికి కూడా ప్రొవిజన్స్ పెట్టడం జరిగిందన్నారు.అన్ని వర్గాల ప్రజల్ని ముఖ్యంగా



వ్యవసాయ రంగం ఆదుకునే దిశగా ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని దాదాపు 48 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్ ని కూడా ప్రవేశ పెట్టడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరసపల్లినాగేశ్వరరావు,కర్రివెంకటరామారెడ్డి,మామిడిశెట్టు శ్రీను తదితరులు ఉన్నారు.

# చందానగర్ పై ఓవర్ బ్రిడ్జికి పీవీ నరసింహారావు, లేదా జయశంకర్ సార్ పేరును పెట్టండి

## టిఆర్ఎస్ నేత వాళ్ళ హరీష్ రావు డిమాండ్

**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లిః**శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని చందానగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కి తెలంగాణ నుంచి తొలి ప్రధాని అయినా పీవీ నరసింహారావు పేరును పెట్టాలని టిఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు వాల హరీష్ రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. లేదా తెలంగాణ ఉద్యమ నేత సిద్ధాంత కర్త జయశంకర్ సార్ పేరు ఖరారు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వీరి ఇరువురు తెలంగాణ రాష్ట్రం



కోసం ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు . భారతదేశం కోసం పి.వి ఎంతో కృషి చేశారని ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత పివి నరసింహారావు అని గుర్తు చేశారు. పీవీ నరసింహారావు పేరు పెట్టి కాంగ్రెస్ పార్టీ నిజాయితీని చాటుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి మహానుభావుల పేర్లు పెట్టడం వల్ల ఎంతో పేరు సంపాదించుకున్న వారు అవుతారని విజ్ఞప్తి చేశారు. జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన చేసిన కృషి తెలంగాణ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న వ్యక్తిని కాబట్టి ఇద్దరి పేర్లలో ఎవరి పేరు పెట్టిన పరవాలేదని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# ఉత్సాహంగా పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ

**ఘనంగా నిర్వహించిన సెయింట్ జూడ్స్ హై స్కూల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సిఐ**

**అలరించిన విద్యార్థిని విద్యార్థుల నృత్య ప్రదర్శనలు శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది**

**విజయం మీదే: దిగులు బాధ లక్ష్యానికి శత్రువులే! మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శివచంద్ర**



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 1 తెలుగు వెలుగు :** పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభను 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా ఘనంగా శనివారం నాడు సెయింట్ జూడ్స్ హై స్కూల్ ప్రిన్సిపల్ పద్మ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ జిల్లా మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శివచంద్ర పాల్గొన్నారు. అతిథులుగా ఫాదర్ డెన్నిస్ భాస్కర్, టీ.రాజారెడ్డి ఇన్యాసమ్మ రిటైర్డ్ టీచర్స్ సెయింట్ జూడ్స్ వికారాబాద్. స్పెషల్ గెస్ట్ లుగా ఉషారాణి సెయింట్ జూడ్స్ ప్రైమరీ పాఠశాల వికారాబాద్, జెస్సి జోసెఫ్ ఇంచార్జ్ బీఈడీ బీఈడీ సెయింట్ జూడ్స్ పాఠశాల వికారాబాద్. బి అన్నమ్మ, కరస్పాండెంట్, లు పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ పద్మ ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. తర్వాత సాంప్రదాయపద్ధంగా జ్యోతి ప్రజ్వలనచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శివచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించాలని ప్రతి విద్యార్థి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు. శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుందని శివచంద్ర అన్నారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక లక్ష్యం ఉండనే ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ఒక్క ప్రయత్నంలోనే అద్భుతం జరగాలంటే అత్యాశ అవుతుందన్నారు. మహానుభావులు సైతం లక్ష్యాన్ని చేదించడానికి ఎన్నో తిప్పలు పడుతుంటారన్నారు. విద్యార్థులు అన్నిటిని అధిగమిస్తూ కష్టాన్ని ఇష్టంగా ఆహ్వానిస్తూ ధైర్యంగా ముందుకు సాగి మీ ప్రయాణాన్ని చివరి వరకు కొనసాగించగలరో వారే విజయాన్ని అందుకోగలరన్నారు. పరీక్షల ముందట ఏవైనా సమస్యలు వస్తే దిగులుతో కూర్చోకుండా సమస్య పరిష్కారం కోసం పరిష్కార మార్గం వెతుక్కోవాలన్నారు. సమస్య ఉన్నదని దిగులుతో కూర్చుంటే పరిష్కారం కాదని గుర్తు చేశారు. మనమేదైనా మంచి కార్యం తలపెడితే ఏదో ఒక సమస్య ముందుంటుందన్నారు. అదే మన విజయాన్ని ఆపే అడ్డుగోడగా ఉంటుందన్నారు. దిగులు మన భవిష్యత్తును శూన్యం చేస్తుందని శివచంద్రన్నారు. ఏదైనా సమస్య వస్తే మనసుని దృఢంగా సంకల్ప బలంతో ముందుకు నడవాలన్నారు. మనపై మనకు నమ్మకం చాలా ముఖ్యమని గుర్తు చేశారు. నమ్మకం లేకపోతే ఎంత కష్టపడ్డ ప్రయోజనం ఉండదన్నారు. ఏదైనా సాధించగలను ఎంతవరకైనా పోరాడగలను అని మనల్ని మనం నమ్ముకొని అడుగు వేస్తే విజయం నీ వెంట నడుస్తుందన్నారు. మీరు నూటికి నూరు శాతం విజయం సాధిస్తామని ప్రాణంగా పెట్టుకొని శ్రద్ధగా చదువుతే మీరు కచ్చితంగా ఈ స్కూల్ నుండి ప్రతి ఒక్కరు జీపీఏ సాధించి బయటికి వస్తారన్నారు. జరిగిపోయిన వాటిని గురించి ఆలోచిస్తూ సమయాన్ని వృధా చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు ఎదుగుతామనే గోల్ ను ఎంచుకొని ముందుకు నడవండి విజయం నీ వెనుక పరుగులు తీస్తుందన్నారు. విద్యార్థి జీవితంలో కష్టపడి చదువుతే ఏదైనా సాధించాలనే పట్టుదల నీలో ఉంటే కచ్చితంగా ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని మీరందరూ సమాజంలో అందరికీ ఆదర్శంగా కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని శివ చంద్ర అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# భారత ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా గట్టి బందోబస్తు

## జిల్లా ఎస్పి చెన్నూరు రూపేష్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధిః**భారత ఉపరాష్ట్రపతి శ్రీ జగ్దీప్ ధన్కర్ ఐఐటి–హైదరాబాద్ పర్యటన సందర్భంగా సుమారు 550 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు..: జిల్లా ఎస్పీ శ్రీ చెన్నూరి రూపేష్ ఐపియస్.ఈ సందర్భంగా ఐఐటి–హైదరాబాద్ నందు బందోబస్తుకు వచ్చిన అధికారులతో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమంలో ఎస్పీ గారు మాట్లాడుతూ.. రేపు ఆదివారం తేది: 02.03.2025, నాడు భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ గారి ఐఐటి–హైదరాబాద్ పర్యటన సందర్భంగా సంగారెడ్డి జిల్లా సివిల్, సాయుధ బలగాలు మరియు బాంబ్ డిస్పోజల్ టీమ్స్ మొత్తం సుమారు 550 మంది పోలీసులతో మూడంచెల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ గారు వివరించారు. ఉపరాష్ట్రపతి భద్రత దృష్ట్యా పాస్ లు లేనిది ఎవ్వరిని ఐఐటి కాంపస్ లోనికి అనుమతించడం జరగదని అన్నారు. అధికారులు సిబ్బంది, తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి, ఎలాంటి భద్రత పరమైన సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరితోనూ మర్యాదగా మాట్లాడాలని సూచించారు. కాంపస్ విద్యార్థులు తప్పనిసరిగా ఐడి తీసుకొనిరావాలని సూచించారు. ఐఐటి కాంపస్ నుండి 5 కి,మీ వరకు డ్రోన్ లను ఎగురవేయడం నిషేధించడం జరిగిందని, ఎవరైన డ్రోన్ లను ఎగురవేసినట్లైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు: రేపు హైదరాబాద్ వెళ్ళే భారీ వాహనాలు కంది నుండి శంకర్ పల్లి మీదుగా హైదరాబాద్ వెళ్లవలసిందిగా, రేపు సాయంత్రం వరకు క్రషర్, మొరంతో వాహనాలు సంగారెడ్డి లోని అనుమతి లేదు అన్నారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ ఎ. సంజీవ రావ్, డియస్పీ లు సత్యయ్య గౌడ్, రవీందర్ రెడ్డి రామ్ మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి మరియు జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్–ఇన్స్పెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం



**తెలుగు వెలుగు పెబ్బేరుః**

పెబ్బేరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో ప్రాథమిక పాఠశాల చెంచువాడలో శనివారం విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో10మంది విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలతో తోటి విద్యార్థులకు బోధన చేశారు,జిల్లా విద్యాశాఖ అధికారిగా జగదీశ్వర్,మండల విద్యాశాఖ అధికారిగా రజిని, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులుగా శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులుగా హిమబిందు,మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి వారి అనుభవాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు,చిన్న రాముడు,మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులను, సమాజాన్ని సరైన మార్గంలో ముందుకు తీసుకువెళ్ళటంలో ఉపాధ్యాయ కృషి అనిర్వచనియమైందని తెలిపారు.

# ఘనంగా కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు



**శంకర్పల్లి తెలుగు వెలుగు మార్చ్ 1**

మండలం బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గండు చర్ల గోవర్ధన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ బుద్ధం శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేందర్ నగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి జన్మదినం సందర్భంగా శంకరపల్లి ప్రధాన చౌరస్తాలో మండల పార్టీ అధ్యక్షులు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి, శంకర్పల్లి మాజీ మార్కెట్ చైర్మన్ లు సభావత్ రాజు నాయక్, మాజీ జెడ్పిటిసి నారాయణ శంకరపల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫారిద్,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పార్సి రాధ బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ మహేందర్ రెడ్డి, మాణిక్ రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు, మాజీ కౌన్సిలర్లు, ఇంద్రన్న అభిమానులు పాల్గొన్నారు

# ఘనంగా విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం

**తెలుగు వెలుగు పెబ్బేరు**



పెబ్బేరు మండలంలోని మండల ప్రాథమిక ఠశాలలో శనివారం విద్యార్థుల పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈక్రమ ంలో 27మంది విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలతో తోటి విద్యార్థులకు బోధన చేశారు, జిల్లా కలెక్టర్హారిక,జిల్లావిద్యాశాఖ అధికారిగా హరీష్,మండల విద్యాశాఖ అధికారిగా శ్రీకాంత్,ప్రధాన ఉపాధ్యా యు లుగా జయశ్రీ, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వహరించిారి అనుభవా లను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, చంద్రయ్య, మాట్లాడుతూ సమాజంలోవిద్యార్థులను,సమాజాన్నిసరైన తీసుకువెళ్ళటంలో ఉపాధ్యా య కృషి అనిర్వచనియమైందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈశ్వర్ గౌడ్,కృష్ణయ్య గౌడ్,శాంతయ్య, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయం

### శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని, ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి నల్లగండ్ల లోని సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో పాపిరెడ్డి నగర్ లోని జిహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్పొరేటర్ తో పాటుగా సుమిత్ గొయల్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జెసీఐ ఇండియా, చతుర్వేది జోన్ ప్రెసిడెంట్ జెసీఐ ఇండియా జోన్ 12, వేణు గోపాల్ జోన్ వైస్ ప్రెసిడెంట్ రీజియన్ సీ జెసీఐ ఇండియా జోన్ 12, హెచ్ జి ఎఫ్ ప్రెసిడెంట్ సుమతి, సెక్రటరీ క్రాంతి హెల్త్ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం రాగం మాట్లాడుతూ పేదరికం కారణంగా ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే సంకల్పంతో సిటిజన్స్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి తగిన సేవలు అందించాలని సూచించారు. సమాజ శ్రేయస్సులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవల కోసం తనవంతు తోడ్పాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. వైద్య సేవలు అందించడానికి ముందుకు రావాలని



కోరారు. అనంతరం జిహెచ్ఎంసీ శానిటేషన్ ఎస్ఆర్పి, ఎస్ఎఫ్ఏ, వర్కర్స్ ను కార్పొరేటర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బద్దం కొండల్ రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు రాగం అభిషేక్ యాదవ్, వార్డ్ మెంబర్ శ్రీకళ వెంకటేశ్వర్లు, కుమారి, లక్ష్మి, జయ, అరుణశ్రీ, సాయి, రవి, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ అండ... బండి రమేష్

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి** ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండ దండగా ఉంటుందని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మసీదుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరుతూ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం, సోదరులు పెద్ద ఎత్తున శనివారం బాలనగర్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ ని కలిశారు. ఈ



సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో మసీదుల వద్ద అవసరమైన విద్యుత్తు,తాగునీరు రహదారులు, పారిశుద్ధ్యం వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడ ఎలాంటి అసౌకర్య%శీ% కలగనివ్వబోమన్నారు. ప్రభుత్వ సహాయంతో పూర్తిస్థాయిలో అన్నిసౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు ,డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పాండురంగ నగర్ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని పాండురంగ నగర్ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై కమిటీ చైర్మన్ బుచ్చయ్యని కమిటీ సభ్యులు రామకృష్ణారావు ,నరసింహులు, అనుపమ, జనార్దన్, మల్లికార్జున్ రెడ్డి నరసింహారావు సభ్యులకు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. దేవాలయాల్లో కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని ఎలాంటి రాజకీయాలకు తావివ్వరాదని ఈ సందర్భంగా రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.బి. బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గోపిశెట్టి రాఘవేందర్ ,తూము సంతోష్, డివిజన్ అధ్యక్షులు సతీష్ గౌడ్ ,ప్రవీణ్ కుమార్, మరియు యూత్ నాయకులు, మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



# మల్కాపూర్ గ్రామంలో ఘనంగా సైన్స్ ఫేర్ వేడుకలు

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ శివారులో నీ సంయుక్త స్కూల్ లో ఘనంగా సైన్స్ ఫెయిర్ వేడుకలు సైన్స్ ఫెయిర్ ప్రోగ్రాం లో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ మాధురి.. బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయికుమార్ సైన్స్ ఫెయిర్ ప్రోగ్రాం లో అలరించిన విద్యార్థిని విద్యార్థుల ప్రాజెక్ట్ ప్రోగ్రామ్స్డిప్యూటీ కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల చేసిన ప్రాజెక్టులు కనువిందు చేశాయని విద్యార్థుల టాలెంట్ ని బయటికి తీయడానికి ఇట్లాంటి సైన్స్ ఫెయిర్ ప్రోగ్రాములు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు సైన్స్ ఫెయిర్ నిర్వహించిన సంయుక్త స్కూల్ మేనేజ్మెంట్ కి శుభాకాంక్షలు తెలిపారు..




# ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

### కంది ఐఐటీలో హెలిపాడ్, సమావేశ స్థలం పరిశీలన.

### అధికారులు సమన్వయంతో పనిచేసి ఉపరాష్ట్రపతి పర్యటన విజయవంతం చేయాలి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ , ఆదివారం కంది శివారులోని ఐఐటి హైదరాబాద్ కు రానున్న నేపథ్యంలో జిల్లాకలెక్టర్క్రాంతివల్లూరుఉపరాష్ట్రపతిపర్యటనఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ బివిఎస్ మూర్తితో కలిసి కంది ఐఐటీ లోని హెలిపాడ్, సమావేశస్థలంను చారు. ఉపరాష్ట్రపతిపర్యటనలోఎలాంటి ొటుపాట్లు జరగకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసిఉపరాష్ట్రపతి పర్యటనను విజయవంతంచేయాలనికలెక్టర్సూచించారు. ొనిబంధనల ప్రకారంఏర్పాట్లు లన్నారు. ముఖ్యంగా వీఐపీ పార్కింగ్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, హెలిపాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, ఐడీ కార్డుల పంపిణీ తదితర అంశాల్లోఎలాంటి ొరపాట్లు రగకుండాముందస్తుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశ ప్రాంతంలోనిరంతర ద్యుత్ సరఫరాజరిగేలా చూడాలని అగ్నిమాపక యంత్రాలు



అందుబాటులో ఉంచాలని అంబులెన్స్ లో అత్యవసర వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచాలనిఅగ్నిమాపక ,వైద్యఆరోగ్యశాఖధికారులకుకలెక్టర్ శించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి ,అదనపు ఎస్పీ సంజీవ్ రావు ,డీస్పీ సత్తియ్య గౌడ్ ,ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి , డి పి ఓ సాయిబాబా, సంబంధిత అధికారులు ఉన్నారు.

# విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి..

### మహిళా సమాఖ్య అధ్యక్షురాలు. అలురే మహానంద






**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి కంగ్టి మర్చి 01:**
నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం పరిధిలోని నాగూర్ (బి) మరియు నాగూర్ (కె ) పాఠశాలలో చదువుతున్నా విద్యార్థులకు బడికి వచ్చి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కంగ్టి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆలూరే మహానంద అన్నారు. శనివారం రోజున కంగ్టి మండలంలోని నాగుర్ బి, నాగుర్ కే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను ఆమె సందర్శించారు పిల్లలకు పరిశుభ్రత పట్ల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి భోజనం అందిస్తున్నారని వంట మనిషిని అడిగి తెలుసుకున్నారు. బడిలో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంగ్టి మండల మహిళా సంఘం నాయకురాలు అలురే మహానంద,మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మరులకు నివాళులు




**సంగారెడ్డి జిల్లాప్రతినిధి**
మండల కేంద్రమైన సదాశివపేటలో శనివారం నాడు ఎమ్ఆర్పిఎస్ మండల అధ్యక్షులు కోలకుంద మోహన్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించడం జరిగింది. ఇందులో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పెద్ద గీత మాదిగ ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు, బుచ్చంద్ర మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఉపాధ్యక్షులు కాశీపురం ఆంజనేయులు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాల్గొని వారు మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ పోరులో భాగంగా అసువులు బాసిన అమరులకు నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎమ్ఐఎమ్ టౌన్ ప్రెసిడెంట్ గౌస్, జున్ను బాయ్, వసీం, జనార్ధన్ మాదిగ, రమేష్ మాదిగ, ప్రసాద్ మాదిగ, నరసింహులు మాదిగ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# సుమిత్ర జూనియర్ కళాశాలలో signature ఆఫ్ వేడుకలు



**చేర్యాల :(తెలుగు-వెలుగు ప్రతినిధి)**
సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో ఉన్న సుమిత్ర జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు అత్యంత ఉత్సాహం తో signatureఆఫ్ జరుపుకొని రెండు సంవత్సరాల కళాశాల స్మృతులను గుర్తు తెచ్చుకొని కేక్ కట్ చేసి ఉత్సాహం గా వార్షిక పరీక్షలకు వెళుతున్న ట్లు తెలిపినారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ బేజాడి రాంరెడ్డి,డైరెక్టర్ లు గోపు ఆరోగ్యరెడ్డి, కరుక తిరుపతి రెడ్డి, శ్రీరామ్ రమేష్ మరియు అధ్యాపకులు కె. శ్రీనివాస్, ఆజిమోద్దీన్, యాదగిరి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు రాందేవ్ రావు ఆసుపత్రిలో జరిగే డెర్మాటలజీ ఈఎన్టీ

# ఉచిత వైద్య శిబిరంను సద్వినియోగపరచుకోండి

### రాందేవ్ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ యోబు



**తెలుగువెలుగుప్రతినిధికూకట్పల్లి:** కూకట్ పల్లి రాందేవ్ రావు అస్పత్రి లో ఆదివారం ఉచిత డెర్మాటలజీ ఈ ఎన్ టీ ఉచిత వైద్య శిబిరం జరుగుతోందని ప్రతిఒక్కరుసద్వినియోగ పరచుకోవాలని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు ఓ ప్రకటనలోతెలిపారు. ఆదివారం దయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు క్యాంప్ జరుగుతుందన్నారు. ఈ క్యాంప్ లో చెవి నొప్పి, వినికిడి నష్టం, చెవి నుంచిద్రవం విడుదల, తల తిరగడం, ముక్కు ముసుకుపోవడం, ముక్కు నుండి రక్తం కారుట, ముక్కు నొప్పి, గొంతు నొప్పి, దగ్గు, చేదు శ్వస, అలర్జీలకువైద్య పరీక్షలు చేశారనన్నారు. ఈఎన్ టి సర్జన్స్ డాక్టర్. ఏస్ . శ్వేత డాక్టర్ డి లావణ్య లు ఏ వైద్య శిభిరాన్ని పర్యవేక్షణచేస్తారన్నారు. డాక్టర్ల హమేరకు అవసరమైన వారికు సి టి స్కాన్ రూ. 1000, ఎం ఆర్ ఐ 2000 లకే చేస్తామన్నారు. అదేవిధంగా మొటిమలు, బొల్లి మచ్చలు, మంగు మచ్చలు, గజ్జి, తామర, ఇతర మచ్చలు, దురదలు, దద్దుర్లు, అలర్జీలు, జుట్టు రాలడం, బట్ట తల, చుండ్రు, పెను కొరకడం, గోరు చుట్లు ఇన్ఫెక్షన్ లకు కు కూడా పరీక్షలు చేయనున్నామన్నారు. వీటిని డాక్టర్ సి. స్వాతి డాక్టర్. కె. శ్రీహర్ష లు పర్యవేక్షిస్థారన్నారు. డాక్టర్ల సలహమేరకు సిబిపి, ఏఈసి, ఐజిఈ, ఎనిమియా ప్రొఫైల్, పి టీ ఏ, ఐ ఎం పి, ఓఏఈ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. వినికిడి పరికరాలు మీద ప్రత్యేక డిఎం క్యాంప్ ఉంటుందని డాక్టర్ యోబు తెలియజేశారు. ఈ ఉచిత క్యాంప్ డాక్టర్ కమలాకర్ డైరెక్టర్ .విక్రందేవ్ రావు, మీరా రావు, ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావు ఆధ్వర్యంలో జరుగుతుందని డాక్టర్ యోబు తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి :**
ఆల్విన్ కాలనీ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్థానికులు శనివారం వాటర్ బాటిల్స్ అందజేశారు. అల్విన్ కాలనీ నివాసి సంతోష్ తన కుమారుని పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిల్స్ ఇచ్చారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని బాటిల్స్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ రెడ్డి, వెంకట్, సురేందర్ పాల్గొన్నారు.

# బడ్జెట్ అంచనాల్లో కోతలే తప్ప నిధులు ఏవీ

**- లబ్ధిదారులు, సంక్షేమ పథకాల్లో కోతపెట్టే ప్రమాదం - ప్రజా ప్రాధాన్యతతో అంచనాలు మార్చాలి**

**- పోలవరం నిర్వాసితులకు తక్కువ కేటాయింపు - సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు**



**విజయవాడ,మార్చి1:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్లో మాటల కోతలు, నిధుల కోతలు తప్ప ప్రజలకు ప్రాధాన్యత లేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. శనివారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. బడ్జెట్ అంచనాల్లో ప్రజలను పట్టించుకోలేదని, నిజాయితీ లేదని తెలిపారు. ఆదాయం పెరుగుతుందని చెప్పిన లెక్కలన్నీ మోసపూరితమని అన్నారు. అంచనాలు ఎక్కువచేసి చూపించి సవరణ అంచనాల్లో తగ్గించేస్తున్నారని, ప్రతిసారీ ఇదే జరుగుతోందని, ఇలాంటి లెక్కలు ప్రజలను మోసం చేయడానికి తప్ప మరొకటికాదని విమర్శించారు. రూ.15 వేల కోట్ల సొంత పన్నులు పెరుగుతాయంటే ప్రజలపై భారం వేయడమేనని అన్నారు. పన్నేతర ఆదాయం రూ.7 వేల కోట్ల నుండి రూ.19 వేల కోట్లకు పెంచారని, వాటికోసం భూములు అమ్ముతారా ఎర్రచందనం అమ్ముతారా ? సారా తాగించి తెస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని రాఘవులు నిలదీశారు. మొత్తం పన్నుల్లో కేంద్రం వాటా రూ.52 వేల కోట్ల నుండి రూ. 57 వేల కోట్లకు పెరుగుతుందని తెలిపారని, 15 ఏళ్లలో ఐదువేల కోట్ల రూపాయలు ఎప్పుడూ పెరగలేదని వివరించారు.

గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ.10 వేల కోట్లు పెరుగుతున్నట్లు లెక్కల్లో చూపించారని గతంలోనూ ఇలా పెంచి చూపించడం సంవత్సరాంతంలో తగ్గించడం ప్రజలను మభ్యపెట్టడానికి కాదా ? అని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ పథకంలో బ్జడెట్ ప్రారంభంలోనే మూడు ఎగిరిపోయాయని, మిగిలిన మూడు పథకాలు సగం నిధులకే పరిమితం అయ్యాయని విమర్శించారు. అంటే లబ్దిదారుల్లో కోత పెట్టడం, సంక్షేమ పథకాలు కుదించడం, లేదా బకాయిలు పెట్టడం వంటి చర్యలకు దిగుతారని అన్నారు. మహిళల నిధులు లేవని, యువతకు ఉపాధి లేదని అన్నారు. మొదటి సంతకం పెట్టిన డిఎస్‌సి ని మళ్లీ వాయిదా వేసిన ప్రభుత్వం వర్గీకరణను సాకుగా చూపడం సరికాదన్నారు. మొత్తం ఉద్యోగాలు ఎగ్గొంటేందుకు సాకుగా దీన్ని ఉపయోగించుకుంటున్నారని రాఘవులు ఆరోపించారు. రూ.48 వేల కోట్లు వ్యవసాయ బ్జడెట్ చూపించి 22 శాతం గ్రోత్‌రేట్ ఉంటుందని చెప్పడం ద్వారా కడుపునింపే మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులో పోలవరానికి ఆరు వేల కోట్ల రూపాయలు చూపించారని, అది పూర్తవ్వాలంటే రూ.60 వేల కోట్లు అవసరం ఉంటుందని తెలిపారు. నిర్వాసితులకు రూ.30 వేల కోట్లపై బడి ఇవ్వాలని, అంచనాల పెరుగుదల ఉందని దానికి తగిన విధంగా కేటాయింపులు లేవని వివరించారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే వెలిగొండ, హంద్రీనీవా కూడా కేటాయింపులు సరిగా లేవని అన్నారు. రూ.1400 కోట్లు ఖర్చు పెడితే వెలిగొండ టన్నెల్ పూర్తవుతుందని, అలా చేయకుండా కాంట్రాక్టర్లకు కట్టబెట్టే కేటాయింపులు చేశారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మార్చి నుండి మే నెల వరకూ పొయ్యిమీద పెనంలా ఉంటుందని వార్తలు వస్తున్నాయని, ఇప్పటికే 54 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని, అంతేకాదని కోస్తా సహా తీవ్రపరిస్థితిని ఎదుర్కోబోతోందని?. అయినా బ్జడెట్లో ఎక్కడా ప్రజలను ఆదుకునే లెక్కలు కనిపించడం లేదని రాఘవులు ధ్వజమెత్తారు. ఐదేళ్లు వాళ్లు దోచుకున్నారు, ఇప్పుడు మేము దోచుకుంటామనే విధంగా ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేశారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కేంద్రం నుండి రాష్ట్రాలకు రావాల్సిన నిధుల్లో వాటాను పెంచాలని బ్జడెట్లో ఎక్కడా కేంద్రాన్ని కోరలేదని అన్నారు. ప్రస్తుతం కేంద్రం రాష్ట్రాలకు 32 శాతం వాటా ఇస్తోందని, దీన్ని 50 శాతానికి పెంచాలని అలా చేయకుండా రాష్ట్రాలను మోసం చేస్తుంటే నిధులు ఇవ్వాలని బ్జడెట్లో ప్రస్తావించకపోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కేంద్రం 50 శాతం వాటా రాష్ట్రాలకు ఇస్తే ఎపిలో చాలా వరకూ సమస్యలు తీరుతాయని చెప్పారు. అయినా రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తున్నా దాని గురించి మాట్లాడకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలకు ఉపయోగపడే పద్ధతిలో బ్జడెట్‌ను సవరించి నిధులు కేటాయింపులు చేయాలని రాఘవులు కోరారు. మూలధన వ్యయాన్ని తగ్గించుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, గత ప్రభుత్వంలోనూ ఇదే పద్ధతి అనుసరించారని రాఘవులు అన్నారు. పి 4 పేరుతో పేదవాళ్లను ధనవంతులు దత్తత తీసుకునే కార్యక్రమం పెట్టారని, అక్కడ ఒక 'పి' ఎగిరిపోయిందని తెలిపారు. రూ.20 వేల కోట్లు వయబులిటీగ్యాప్ ఫండిరగ్ పేరుతో మరో 'పి'ని ఎత్తేశారని అన్నారు. మొత్తంగా పి4 పేరుతో ప్రభుత్వం ప్రజల బాధ్యత నుండి తప్పుకునే కార్యక్రమం చేస్తోందన్నారు. పైగా వయబులిటీ గ్యాప్ ఫండిరగ్‌కు రూ.20 వేల కోట్లు కేటాయించారని, ఇవి ఉద్దేశపూర్వకంగా పెట్టుబడిదారులకు అప్పగించడమేనని స్పష్టం చేశారు. ఇది క్రోనీ క్యాపిటలిజానికి నిదర్శనమని రాఘవులు విమర్శించారు.

# బిజెపికి కులగణనపై మాట్లాడే హకకు లేదు

**రీసర్వేలో పెద్దగా స్పందన రాలేదన్న మంత్రి పొన్నం**



**హైదరాబాద్,మార్చి1:** బీజేపీకి కుల గణన మీద మాట్లాడే హక్కే లేదు.. సుప్రీం కోర్టులో బీసీ కుల గణనకు వ్యతిరేకం అని బీజేపీ అఫిడవిట్ ఇచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు.తెలంగాణలో 13 రోజుల పాటు కులగణన రీ సర్వేలో కూడా ఆశించిన సంఖ్యలో కుటుంబాలు తమ వివరాలు నమోదు చేసుకోలేదు.

మొదటిసారి నిర్వహించిన కుల గణన సర్వేలో 3.56 లక్షల కుటుంబాలు వివరాలు నమోదుచేసుకోకుండా మిగిలిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వం రీ సర్వే చేపట్టింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రెండో విడత కుల గణనకు తక్కువ స్పందన వచ్చిందని తెలిపారు. ఇది మమ్మల్ని తక్కువ చేసి చూపారు అనే వాళ్లకు సమాధానమని పేర్కొన్నారు. సర్వే రిజెక్ట్ చేసిన వాళ్ళ కోసం అవకాశం ఇచ్చామని మంత్రి చెప్పారు. బీసీ మేధావులు, సంఘాలు కోరిక మేరకు మళ్ళీ అవకాశం ఇచ్చామన్నారు. మరోవైపు.. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లకు పోస్టులో దరఖాస్తు ఫారం పంపినా దరఖాస్తు చేసుకోలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వాళ్ళు జనాభా లెక్కల్లో లేనట్టే.. సర్వేలో పాల్గొనని వాళ్లకు మాట్లాడే హక్కు లేదని దుయ్యబట్టారు.

సాయంత్రం వరకు సర్వే పూర్తి వివరాలు వస్తాయన్నారు. కొందరు అధికారులు ఇండ్లలోకి రానివ్వలేదు.. వారిపై కుక్కలు కూడా వదిలారు.. వీడియోలు బయట పెడతామని పేర్కొన్నారు. బీజేపీ పొత్తున్న ఏపిలో కూడా మైనార్టీ రిజర్వేషన్ అమలులో ఉంది.. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. త్వరలోనే 42 శాతం రిజర్వేషన్ చట్టం.. కేంద్రంలో బాధ్యత తీసుకుని బీజేపీ నేతలు సహకరించాలని తెలిపారు. 18 జిల్లాలో వంద శాతం సర్వే పూర్తి అయిందని.. సర్వేని తప్పు పట్టిన వాళ్ళు కూడా సర్వేలో పాల్గొనలేదని చెప్పారు. నమోదు చేసుకొని వారు జనాభా లెక్కల్లో లేరు.. వాళ్లకు అడిగే హక్కు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## గురు వైభవోత్సవాల్లో పాల్గొన్న లోకేశ్

**ఆనందంగా ఉందని తెలిపిన మంత్రి**

**కర్నూలు,మార్చి1:**



మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రస్వామి గురు వైభవ ఉత్సవాల్లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకోగా.. మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం, లోకేష్ మాట్లాడుతూ.. రాఘవేంద్రస్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాఘవేంద్రస్వామిని దర్శించుకోవడంపై పలువురు పలు రకాలుగా చెప్పారు.. మా అమ్మకి ఫోన్ చేసి అభిప్రాయం అడిగా.. నీ మనసులో ఏముందో అదే మనస్ఫూర్తిగా ఆచరించు అని చెప్పిందని పేర్కొన్నారు. నా తల్లి కోరిక మేరకు శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నాను అని మంత్రి లోకేష్ చెప్పారు. ఇక, రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, వర్షాలు బాగా కురిసి పాడి పంటలు బాగా పాండాలని ఆ రాఘవేంద్ర స్వామి వారిని కోరుకున్నాను అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ ప్రాంతంలో వలసలు ఎక్కువగా ఉన్నాయి.. వలసలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దుతాను అని హామీ ఇచ్చారు. త్వరలో వలసలు నియంత్రణ కోసం తగిన కార్యచరణ రూపొందిస్తామన్నారు.

## అంగరంగ వైభవంగా గంగమ్మ తల్లి జాతర ప్రారంభం

**అనంతపురం,మార్చి1:**

భక్తుల పాలిట కొంగు బంగారమైన అనంతపురం గంగమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం గ్రామంలో గంగమ్మ తల్లి జాతర కొనసాగుతోంది. చాగలగుట్టపల్లిలోని పుట్టింటి నుంచి భారీ ఊరేగింపుతో గంగమ్మ తల్లి జాతరకు చేర్చారు. అడుగడుగునా అమ్మవారికి బోనాలు, మంగళహారతులు పట్టి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సంతానం కోసం అమ్మవారి ఆలయం ఎదుట మహిళలు వరపడారు. సంతానం ప్రసాదించమని గంగమ్మతల్లిని వేడుకున్నారు. తమ కష్టాలను తొలగించి సుఖశాంతులు ప్రసాదించమని కోరుతూ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడుతోంది. జాతర వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఒక డీఎస్పీ, 24 మంది ఎస్ఐలు, 7 మంది సీఐలు, 300 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాయలసీమలోని వివిధ ప్రాంతాల నుంచి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. జాతర ఇవాళ, రేపు జరుగనున్నది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## అమల్లోకి కొత్త వాహన చట్టం

**తనిఖీలు మొదలు పెట్టిన పోలీసులు**

**విజయవాడ,మార్చి1:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శనివారం నుంచి కొత్త మోటర్ వెహికిల్ యాక్ట్ అమల్లోకి వచ్చింది. ఇక, నూతన మోటార్ వాహన చట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై విజయవాడ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి గల్లీలో స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసి.. రూల్స్ పాటించని వారికి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. ఈక్రమంలోనే బెజవాడ పోలీసులకు వింత అనుభవం ఎదురైంది. ఓ వాహనదారుడు ట్రాఫిక్ సీఐ రామారావుతో వితండ వాదానికి దిగాడు. పోలీసులు తమ ఐడీ చూపించాలంటూ అతడు హల్‌చల్ చేశాడు.. నకిలీ పోలీసులు తిరుగుతున్నారంటూ నానా హంగామా సృష్టించాడు. దీంతో చివరకు తన ఐడీ కార్డు చూపించిన సీఐ రామారావు సదరు వాహనదారుడికి హెల్మెట్ లేకపోవడంతో ఫైన్ వేశాడు. అయితే, బెజవాడ ఘటనపై పోలీసులు సీరియస్ అయ్యారు. ఫేక్ పోలీసులు ఎవరూ ఉండరు.. ఐడీ కార్డు చూపించేందుకు పోలీసులు రెడీ అని తెలిపారు. అంతేకానీ, అనవసర వాగ్వాదానికి దిగొద్దు అని హెచ్చరించారు. పోలీసు యూనిఫామ్‌పై.. ఎవరూ ఏంటి అన్నది క్లియర్‌గా కనిపిస్తుంది అని పేర్కొన్నారు. పోలీసులకు వాహనదారులు అందరూ సహరించాలి అని సూచించారు. ఐడీ కార్డు చూపించేందుకు అభ్యంతరం లేదు.. కానీ, విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదం వద్దు అని ఏపీ పోలీస్ అధికారులు వెల్లడించారు. ఇక, ప్రస్తుతం 75 శాతం ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తున్నారని, మిగిలిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుని, నిబంధనలను పాటించేలా చేస్తామని ట్రాఫిక్ అడిషనల్ ఏసీపీ ప్రసన్న తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఔట్ పోస్ట్ ఏర్పాటు

**హైదరాబాద్,మార్చి1:**

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్‌పోర్ట్ ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్ ఔట్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఔట్ పోస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీ అవినాష్ మహంతి, ఎయిర్‌పోర్ట్ సీఈఓ ప్రదీప్ ఫనికర్, సీఐఎస్‌ఎఫ్‌డీజి మొహంక్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పరిధిలోని ప్రయాణికుల కోసం నూతనంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్.. శంషాబాద్ గ్రామంలో ఉండడంతో ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులు ఫిర్యాదు చేయడానికి ఇబ్బందిగా మారిందని.. జీఎంఆర్ వారి సహకారంతో నూతన ఔట్ పోస్ట్ ప్రారంభించినట్లు సీపీ అవినాష్ మహంతి తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కూడా జనాభా పెరిగిందని వారికోసం శంషాబాద్ గ్రామంలో ఉన్న శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పనిచేస్తుందని.. కేవలం ఎయిర్ పోర్ట్ ప్రయాణికుల కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని సీపీ తెలిపారు.

## పోసానికి స్వల్ప అస్వస్థత

**కడప రిమ్స్‌కు తరలింపు**



**అన్నమయ్య,మార్చి1:** సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణ మురళి శనివారం స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. ఆయన అస్వస్థతకు గురవడంతో వెంటనే రాజంపేట సబ్ జైలు నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుండెనొప్పి వచ్చినట్లు జైలు అధికారులకు పోసాని కృష్ణ మురళి చెప్పారు. రాజంపేట ప్రభుత్వ ఆస్పతికి జైలు అధికారులు తరలించారు. రాజంపేట ప్రభుత్వాస్పత్రిలో పోసాని కృష్ణ మురళికి వైద్యులు చికిత్స అందించారు. పోసానిని మెరుగైన వైద్యం కోసం రాజంపేట ప్రభుత్వాస్పత్రి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. కాగా.. అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో పోసాని కృష్ణ మురళిని అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని మైహోం భూజా అపార్ట్‌మెంట్‌లో ఉన్న పోసాని కృష్ణ మురళి నివాసానికి వెళ్లి... నోటీసులు అందించి, అరెస్ట్ చేశారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో నలుగురు పోలీసులు హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీసులను కలిసి... పోసాని కృష్ణ మురళిపై నమోదైన కేసు వివరాలను అందించారు. వైసీపీ అధికారంలోకి రాకముందు నుంచే పోసాని కృష్ణ మురళి టీడీపీ, జనసేన అగ్రనేతలపై అడ్డగోలుగా మాట్లాడారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై శ్రుతిమించి వ్యక్తిగత విమర్శలు చేశారు. ఇక... వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన మరింత రెచ్చిపోయారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను అసభ్యంగా తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. పోసాని వ్యాఖ్యలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు అప్పట్లో ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోసాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరు, విజయవాడ, నర్సారావుపేట, అన్నమయ్య, అనంతపురం, బాపట్ల, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. పోసాని కృష్ణ మురళిపై ఏపీవ్యాప్తంగా పదికిపైగా కేసులు నమోదయ్యాయి.

## తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా గుర్తించాలి

**రామ్మోహన్ నాయుడుకు ఛైర్మన్ లేఖ**

**తిరుమల,మార్చి1:** తిరుమలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు లేఖ రాశారు. తిరుమల క్షేత్రాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని కోరారు. ఆగమశాస్త్రం, ఆలయ పవిత్రత, భద్రతతో పాటు భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రకటన చేయాలని అభ్యర్థించారు. 'తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు.. ముఖ్యంగా హెలికాప్టర్లు, ఇతర వైమానిక కదలికలతో ఆలయం చుట్టూ ఉన్న పవిత్రమైన వాతావరణానికి భంగం కలుగుతోంది. తిరుమల సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడటానికి నోలజోన్ ప్రకటన ముఖ్యమైన అడుగు అవుతుంది' అని తితిదే ఛైర్మన్ పేర్కొన్నారు. ఈ లేఖపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించారు.

# ముదిరాజ్ జెండా కింద పడ్డందుకు బీజేపీ పార్టీ తరపున విచారణ వ్యక్తం

**మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్ చిగురుమామిడి మండల ముదిరాజులకు క్షమాపణ చెప్పాలని పొన్నం శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్**



**చిగురుమామిడి, మార్చి 01**
చిగురుమామిడి మండల కేంద్రంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో పొన్నం శ్రీనివాస్ ముదిరాజు మాట్లాడుతూ 27 తేదీన జరిగినటువంటి ఎమ్మెల్సీ ఎలక్షన్లో స్థానిక కాంగ్రెస్ నాయకుడికి సంబంధించిన నంబర్ ప్లేట్ లేని కారులో కాంగ్రెస్ నాయకులు డబ్బులు పంచుతుండగా బీజేపీ కార్యకర్తలు నాయకులు గుర్తించి పోలీసులకు పట్టించే క్రమంలో అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు పారిపోవడం జరిగింది. కారు డిక్కీ ఓపెన్ చేయగా, కాంగ్రెస్ సంబంధించిన కరపత్రాలు 3-4 వేరు వేరు నంబర్ ప్లేట్లను గుర్తించి మీడియా మిత్రులకు చూపించే క్రమంలో ముదిరాజ్ కండువాలు కింద కింద పడిన విషయం వాస్తవం, దానికి భారతీయ జనతా పార్టీ చిగురుమామిడి మండల పక్షాన విచారణ వ్యక్తం చేస్తూ చింతిస్తున్నాం. చిగురుమామిడి మండలంలో ఉన్నటువంటి ముదిరాజు సంఘం పెద్దలు పెద్ద మనసుతో అర్థం చేసుకుంటారని విజ్ఞప్తి చేయడం జరుగుతుంది. ఎమ్మెల్సీ ఎలక్షన్ టైంలో, ఎలక్షన్ కోడ్ ను ఉల్లంఘిస్తూ, గతంలో రాజ్యాంగబద్ధంగా ప్రజాప్రతినిధులుగా గెలుపొంది, రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతూ ఉద్దేశపూర్వకంగా, ముదిరాజ్ కండవాలను నంబర్ ప్లేట్ లేని కార్లో పెట్టి ముదిరాజుల ఆత్మ గౌరవాన్ని మంట కలిపే విధంగా వ్యవహరించినటువంటి, ఆ వ్యక్తి ముందుగా చిగురుమామిడి ముదిరాజ్ జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. అతనికి వ్యక్తిగత సమస్యను కూడా ముదిరాజు కులంకు ఆపాదిస్తూ వారిని రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నటువంటి ఆ కులద్రోహి మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసారు. మత్స్యశాఖ చేపల పంపక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి 250 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అంతేకాకుండా ముదిరాజ్ కులానికి పెద్ద పీఠ వేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని తెలియజేయడం జరుగుతుంది. చిగురుమామిడి మండలంలోని ముదిరాజులను ముదిరాజు విజ్ఞానవంతులను ఆలోచించవలసింది గా చిగురుమామిడి భారతీయ జనతా పార్టీ నుండి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పోలోజు సంతోష్, చెరుకు రాజయ్య ముదిరాజ్, మల్లం సతీష్ ముదిరాజ్, గుళ్ళ సాయికృష్ణ ముదిరాజ్, పెసరి హరీష్ ముదిరాజ్, గందె చిరంజీవి ముదిరాజ్ ,బొల్లి సాయి ముదిరాజ్, గర్ధాసు సతీష్, బుధార్థి మహేందర్, సందేవేని బాలయ్య, దొంత కరుణాకర్, ముదిగిరి రాజు, సిద్దెంకి అనిల్, కోయాడ నాగార్జున, పైడిపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను

# వెలికి తీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

**- పాఠశాల కరస్పాండెంట్ కంది సంధ్య - విద్యార్థులను ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు**







**చిగురుమామిడి, మార్చి 01**
విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు విస్డం హై స్కూల్ కరస్పాండెంట్ కంది సంధ్య తెలిపారు. శనివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలోని విస్డం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులను,వారి తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకుంది. సైన్స్‌డే ను ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కంది సంధ్య మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల అభిలాషను పెంచుతూ,వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

విద్యార్థులు ఏ రంగంలో రాణిస్తారో ఆయా రంగంలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు,మానవుని జీర్ణవ్యవస్థ,రక్త ప్రసరణ వ్యవస్థ,కణంకి సంబంధించిన ప్రాజెక్టులను,పర్యావరణ కాలుష్యం జరగడానికి గల కారణాలను ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించగా వారిని కరస్పాండెంట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలి శ్రీనివాస్,సైన్స్ సబ్జెక్టు టీచర్ సౌమ్య,తోట రమేష్,కంభం శ్రీనివాస్,అప్పాల రమేష్,పోలు కుమారస్వామి, ఎంద్ర రాజ్ కుమార్,బొలిశెట్టు సురేష్,మేరీ ప్రవీణ,శ్వేత,సౌజన్య ఇతర ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఛత్తీస్గఢ్ లో ఎన్కౌంటర్..

**- ఇద్దరు మావోయిస్టులు మృతి - మృతి చెందిన మావోయిస్టులలో ఒక మహిళ, ఒక పురుషుడు**



**చర్ల, మార్చి 01**
తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ సుక్మా జిల్లాలోని కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్రాజ్‌గూడెం అటవీ ప్రాంతంలో, డిఆర్‌జి సైనికులకు మావోయిస్టుల మధ్య అడపాదడపా ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్కౌంటర్ లో ఇద్దరు యూనిఫామ్ ధరించిన మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన వారిలో ఒక మహిళ, ఒక పురుషుడు కాగా వారి మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి . చనిపోయిన మావోయిస్టులను గుర్తిస్తున్నారు. సంఘటనా స్థలం నుండి భద్రతా బలగాలు పెద్ద మొత్తంలో ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో రక్తపు మరకలు, కారణంగా ఇంకా చాలా మంది మావోయిస్టులు చనిపోయి లేదా గాయపడే అవకాశం ఉందని, పరిసర ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు.

**బస్తర్‌లో 60 రోజుల్లో 67 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యం**

2024లో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా బలగాలు ఆధిక్యాన్ని కొనసాగించారు 2025 సంవత్సరంలో కూడా, నిషేధిత చట్టవిరుద్ధమైన సి పీ ఐ మావోయిస్టు సంస్థకు వ్యతిరేకంగా బస్తర్ డివిజన్ కింద భద్రతా దళాలు నిర్వహించిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ ఫలితంగా, గత 60 రోజుల్లో బస్తర్ రేంజ్‌లో మొత్తం 67 హార్డ్‌కోర్ మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పి. తెలియజేశారు. పోలీసు ప్రధాన కార్యాలయాల మార్గదర్శకత్వంలో, బస్తర్ రేంజ్‌లో మోహరించబడిన డి ఆర్ జి /ఎస్ టి ఎఫ్ /కోబ్రా /సి ఆర్ పీ ఎఫ్ /బి ఎస్ ఎఫ్ /ఐ టి బి పీ /సి ఏ ఎఫ్ / బస్తర్ ఫైటర్లు ఇతర భద్రతా దళ సభ్యులు బస్తర్ ప్రాంతం యొక్క శాంతి భద్రత అభివృద్ధి కోసం బలమైన అంకితభావంతో పనిచేస్తున్నారు. నిషేధించబడిన చట్టవిరుద్ధమైన సి పీ ఐ మావోయిస్టు సంస్థ ఇప్పుడు హింసను వదులుకుని లొంగిపోవడం తప్ప వేరే మార్గం లేదు అని అందువల్ల, మావోయిస్టు సంస్థ వెంటనే హింసాత్మక కార్యకలాపాలను విడిచిపెట్టి జన జీవన స్రవంతిలో చేరాలని, లేకుంటే పరిణామాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేసారు.

# రాష్ట్రం నెత్తిన పదిలక్షల కోట్ల అప్పు

**- రాష్ట్రాన్ని గత ఐదేళ్లలో వైకాపా నేతలు లూటీ - అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం**

**- సంపద సృష్టిపై ప్రత్యేక దృష్టి పెట్టాం - జిడి నెల్లూరులో సిఎం చంద్రబాబు నాయుడు**

**చిత్తూరు,మార్చి1:** రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పు ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అడవి పందులు పొలాల్లో పడి ధ్వంసం చేసినట్లు రాష్ట్రాన్ని గత ఐదేళ్లలో వైకాపా నేతలు లూటీ చేశారు. గడిచిన ఐదేళ్లు ప్రజలు అనేక బాధలు పడ్డారు.. మా ప్రభుత్వం అప్పు కోసం ప్రయత్నిస్తే.. ఏపీకి రుణాలు ఇచ్చే పరిస్థితి లేదంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. మేము ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తున్నాం.. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నాం.. ఒకటో తేదీనే పెన్షన్లు ఇస్తున్నాం.. ఈ ఏడాది రూ. 3 లక్షల కోట్ల బ్జడెట్ ప్రవేశ పెట్టామని తెలిపారు. ఒక వైపు అప్పులకు వడ్డీ కడుతూనే.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కొనసాగించా ల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా జీడి నెల్లూరు బీసీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. స్వయంగా పెన్షన్లను పంపిణీ చేశారు. దీనిలో భాగంగా కల్లు గీత కార్మికునికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా ఇంత పెద్ద ఎత్తున పెన్షన్లు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం పెన్షన్లను రూ. 3 వేలు చేసింది.. మేము వచ్చి రాగానే పింఛన్లను రూ. 4 వేలకు పెంచామని సీఎం అన్నారు.

లబ్దిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నా నన్నారు. గత ఐదేళ్లలో లేని సంతోషం ప్రజల్లో కనపడుతోంది. నెలకు 8 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. తలసేమియా, డయాలసిస్ రోగులకు నెలకు 10 వేలు ఇస్తున్నాం. నెలకు 2800 కోట్లు, ఏడాదికి 33 వేల కోట్లు ఇస్తున్నాం. జీడీ నెల్లూరులో తల్లిదండ్రులు వదిలేసి వెళ్లిన ఇద్దరు ఆడ పిల్లలను ఆదుకొనేందుకు చర్యలు తీసుకున్నాము. పిల్లల అమ్మమ్మకు ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని ఆదేశించానని అన్నారు. చిన్న పిల్లల పేరుతో 2 లక్ష ల ఫిక్స్ డిపాడిజిట్ చేస్తామని చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వాన్ని మీ అర చేతిలోకి తెచ్చామని సీఎం అన్నారు. 9371 కోట్లు ఖర్చుపెట్టి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నాలుగు నెలల్లో 20 వేల కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులు చేశామని వెల్లడించారు. ఎనిమిది నెలల్లో ఉద్యోగుల రూ. 24 వేల కోట్ల బకాయిలు తీర్చామన్నారు. అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాం. పోలవరం నిర్మాణాలను వేగవంతం చేశాం. రైతులకు రాయితీతో సౌర విద్యుత్ ఉత్పత్తి కి అవకాశం కల్పిస్తాం. కుసుం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూర్య ఘర్ పథకంతో ఉచితంగా కరెంట్ వచ్చే అవకాశం ఉంటుంది. సాంకేతికను ప్రజలు అలవర్చుకోవాలి.

## మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి

# బొలిశెట్టి శివయ్యకు సన్మానం



**చిగురుమామిడి, మార్చి 01**
మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్యకు శనివారం ఘన సన్మానం జరిగింది. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, చిగురుమామిడి మండల మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడు చిట్టంపెల్లి శ్రీనివాస్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శివయ్యను శాలువాతో సన్మానించి గౌరవించారు. ఆయన నూతన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు సంఘానికి శివయ్య విశేష సేవలు అందిసున్నారని,మున్నూరు కాపుల అభివృద్ధికి అయన సేవలు ఎంతగానో దోహదపడుతాయని వారు అభిప్రాయపడ్డారు.

# గోరుకొండలో వైద్య శిబిరం



**చర్ల,మార్చి 01**
చర్ల మండలం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గోరుకొండ గ్రామాల్లోడాక్టర్ దివ్య నయన ఆధ్వర్యంలో వైద్య శిబిరం ను నిర్వహించారు. ఈ వైద్య శిబిరం లో జ్వరం వచ్చిన ఇద్దరికీ రక్త పరీక్ష చేసి, మలేరియా లేదని నిర్ధారణ చేసి చికిత్స చేయడం జరిగినది. 38 మందికి సాధారణ వ్యాధులకు మందులు ఇవ్వడం జరిగినది. గర్భిణీ స్త్రీలకు పరీక్షలు చెయ్యడం జరిగినది. అలాగే ప్రతి నెల గర్భిణీ స్త్రీల పరీక్షలు చేయించుట కొరకు ఆసుపత్రికి రావాలని సురక్షిత కాన్పు కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము సత్యనారాయణపురం కి రావాలి అని చెప్పడం జరిగినది. ఈ వైద్య శిబిరం లో యెన్ సి డి పరీక్షలు చేసారు .ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేసారు. డ్రై డే కార్యక్రమాలు చెయ్యడం జరిగింది. జ్వరాలు వచ్చిన వెంటనే అశ్రద్ధ చెయ్యకుండా ప్రభుత్వ ఆసుపత్రికి కి రావాలని తెలిపారు. దోమల వలన వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించటం జరిగింది . కాచి చల్లార్చిన నీళ్లు త్రాగాలి అని నీటి నిల్వలు లేకుండా చూడాలని దోమతెరలు కట్టుకోవాలి ఎండాకాలంలో వచ్చే ఎండదెబ్బ జాగ్రత్తలు గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్.ఈ.ఓ బాబురావు హెల్త్ అసిస్టెంట్స్ వీరమ్మ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## చర్ల కాంగ్రెస్ సోషల్ మీడియా

# కోఆర్డినేటర్‌గా రుంజా రాజా

**చర్ల, మార్చి 01**



శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్ నందు జరిగిన పార్లమెంట్ టిపిసిసి సోషల్ మీడియా డాష్ బోర్డ్ ట్రైనింగ్ కార్యక్రమంలో భద్రాచలం అసెంబ్లీ చర్ల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా చర్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రూంజా రాజా ని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ మా మన్నె సతీష్ కుమార్,టి పి సి సి రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెట్టం నవీన్, టి పి సి సి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి మరియు మహబూబాద్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇంచార్జ్ అంబాల శివకుమార్ పాల్గొన్నారు. తనని గుర్తించి ఈ అవకాశాన్ని కల్పించిన కాంగ్రెస్ నాయకులకు రూంజా. రాజా కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్తర ప్రదేశ్‌లో జరిగే భారతీయ కాళాకార్ సంఘ్ మూడు రోజులపాటు జరిగే కళా మహోత్సవానికి

# ఆర్టిస్ట్ సాగంటి మంజులకు ఆహ్వానం

**హన్మకొండ, మార్చి 01**



భారతీయ కళాకార్ సంఘ్ (జాతీయ ఆర్టిస్టు సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో ఓర్చ టౌన్ లో ఈ నెల 10,11,12 తేదీలలో మూడు రోజుల పాటు జరిగే కళా మహోత్సవానికి సంఘ్ యొక్క తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి గా నియమితులైన హన్మకొండ వాసి ప్రముఖ ఆర్టిస్ట్, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల కి ఆహ్వానం అందింది. ఈ మేరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి దేశం లోని అన్ని రాష్ట్రాల ఆర్టిస్టులు పాల్గొననున్నారు. ఆర్టిస్టుల సమస్యల మీద సమీక్ష, ఆర్ట్ ఎగ్జిబిషన్, పలు ప్రాంతాల సందర్శన లతో పాటు పలు కార్యక్రమాలు ఉంటాయని ఈ అవకాశం రావడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని మంజుల తెలిపారు.

# ప్రజామోదంగా బడ్జెట్ పద్దు కందుల దుర్గేశ్

**రాజమండ్రి,మార్చి1:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ప్రజామోదంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమండ్రిలో మంత్రి కందుల దుర్గేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ పై ప్రతిపక్షాలు ఏదో విమర్శించాలని తప్ప ఏమీ లేదని పేర్కొన్నారు.. అలాగే, అన్ని రంగాలకు, పథకాలకు బ్జడెట్ లో కేటాయింపులు ఆశోధనకంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. గతంలో పర్యాటక శాఖ మంత్రులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లను దూషించడానికి పని చేశారు అని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఇక, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి నేను కృషి చేస్తున్నాను అని మంత్రి దుర్గేష్ చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక పాలసీ ద్వారా పెట్టుబడులు భారీగా వచ్చే అవకాశం ఉంది.. ఇందు కోసం ప్రాంతాల వారీగా సమ్మిట్ లు పెడుతున్నాం అన్నారు. ఈ నెల నాలుగు, ఐదు, ఆరు తేదీల్లో జర్మనిలో పర్యటక శాఖ సమ్మిట్ ఉంది.. ఆ మీటింగ్ లో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

# విభజనతో అభివృద్ధి వెనక్కి..అప్పుల ముందుకు !





అనకొండలు రాజ్యమేలితే ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనడానికి తెలుగు రాష్ట్రాలను పాలించిన కెసిఆర్, జగన్ అక్రమాలే నిదర్శనం. విభజన వల్ల ప్రజలకు మేలు జరగకపోగా అప్పులను మాత్రం నెత్తిన పెట్టారు. తమ విలాసాల కోసం భవంతులను నిర్మించుకుని, లక్షల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేశారు. విభజన జరిగిన పదేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓ రెండు కుటుంబాలు రాచరికం అనుభవించాయి. తమ హంగూ ఆర్భాటానికి వేలకోట్లు దుర్వినియోగం చేశాయి. వారికి అధికారంతో పాటు, సకల సుఖాలు దక్కాయి. వెరసి ఓ పదివున్నెండు లక్షల కోట్లు దుర్వినియోగం కావడమే గాకుండా మోయలేని అప్పులు సమకూరాయి. కానీ ప్రజల జీవితాల్లో సూదిమొనంత కూడా మార్పు రాలేదు. విభజనకు ముందు తరవాత అన్న అధ్యయనం జరగాల్సి ఉంది. తెలంగాణలో కెసిఆర్ నిర్వాకం వల్ల కాళేశ్వరం,సచివాలయం, ప్రగతి భవన్ నిర్మాణాలతో వేలకోట్లు దుర్వినియోగం చేశారు. ఆయనతో పాటు, వారి అనుయాయుల పొలాలకు నీళ్లు చేరేలా కాళేశ్వరం డిజైన్ చేసుకున్నారు. ఎందరో రైతులను, గ్రామస్తులను తన అవసరాల కోసం రోడ్డున పడేశారు. తన సుఖాల కోసం ప్రగతిభవన్ నిర్మించుకున్నారు. తనకోసం సచివాలయం నిర్మించుకున్నారు. ఎంతో పచ్చదనంతో కొత్తకొత్త భవనాలతో ఉన్న సచివాలయాన్ని నేలమట్టం చేసి, రాచరిక పోకడలను చాటుకున్నారు. మనం కోరుకున్న తెలంగాణ ఇదేనా అన్న చర్చ చేయాలి. ఇలాంటి రాచరిక పోకడలు ఉన్న వారి కారణంగా దేశ సంపద ఎలా దుర్వినియోగం అవుతుందో తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పాలనను ఉదాహరణగా చూడాలి. కొత్తగా ఉద్యోగాలు రాలేదు. కొత్తగా ఉపాధి రాలేదు. కొత్తగా నీళ్లు రాలేదు. పథకాలన్నీ పందేరం చేసేందుకు ఉపయోగించిన ఘనుడు మన కెసిఆర్. అన్నను మించిన తమ్ముడిలా జగన్ కూడా లక్షల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. రాజధాని లేదు. పోలవరం పూర్తి చేయలేదు. రోడ్లు వేయలేదు. కానీ విలాసవంతమైన భవనాలు నిర్మించు కున్నారు. తనో అపర నిజాంలా వ్యవహరించి ప్యాలెస్‌లు కట్టుకున్నారు. తాజాగా బయటపడ్డ విశాఖలోని రుషికొండ ప్యాలెస్ వెనుక మరెన్నో విషయాలు దాగున్నాయి. తన పాలనా కాలంలో రుషికొండను తొలిచేశారు. అటువైపు చీమకూడా వెళ్లకుండా కట్టుబాట్లు పెట్టి, ప్యాలెస్ నిర్మించుకున్నారు. మళ్లీ నేనే సిఎం..విశాఖలోనే ప్రమాణం అని ప్రచారం చేసుకున్న జగన్ ఇంతగా అధికార, దుర్వినియోగం, నిధుల దుర్వినియోగం చేసిన తీరు ఆశ్చర్యం కలిగించక మానదు. ఇలాంటి కట్టడాలు ఇంకా ఉన్నాయా..అన్న అనుమానాలు వస్తున్నాయి. రుషికొండ ప్యాలెస్‌కు ఎంత ఖర్చు చేశారు.. దేనికి ఖర్చు చేశారు అనే విషయాలకు సంబంధించి లెక్కలు బయటకు రావాల్సి ఉంది. దీనిపై సిఎం చంద్రబాబు ఇప్పటికే నివేదిక కోరారు. పూర్తి వివరాలు వచ్చిన తరువాత ప్రజల ముందు బహిర్గతం అవుతాయి. రాష్ట్రాన్ని తన ఇష్టం వచ్చినట్లుగా జగన్ పాలించచారు. గంజాయి, అక్రమ మద్యం పెరిగింది. వీటివల్ల నష్టపోయిన కుటుంబాల గోడును ఏనాడూ పట్టించుకోలేదు. తెలుగు రాష్ట్రాల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం పెరిగింది. రుషికొండపై రాజమహల్ తరహాలో భవనాలను అత్యంత ఖరీదుగా ప్రత్యేకంగా నిర్మించిన తీరుత ఇప్పుడు ప్రపంచాన్ని నివ్వెర పోయేలా చేస్తోంది. ఏడు భవనాల్లో మూడు ప్రత్యేకంగా జగన్ కుటుంబం కోసమే తీర్చిదిద్దారని చెప్పుకుంటున్నారు. అక్కడ ఈ మూడింటికి మాత్రమే సముద్ర తీరంచూసేలా వ్యూ ఉంది. మిగిలిన వాటికి ఎదురుగా బీచ్‌రోడ్డు, గీతం కాలేజీ కనిపిస్తాయి. జగన్ కుటుంబం కోసం నిర్మించిన భవనాల్లో బాల్కనీలోకి వచ్చినా, బాత్‌రూమ్‌లో నుంచైనా కిటికీల నుంచి సముద్రం కనిపించేలా డిజైన్ చేసుకున్నారు. అలాగే మసాజ్ కోసం ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేసుకున్నారు. దానికి 'స్పా రూమ్' అని పేరు పెట్టుకున్నారు. ఇవన్నీ గ్రౌండ్ ప్లస్ వన్ నిర్మాణాలుగా గుర్తించారు. విజయనగర-1 భవనం జగన్, భారతీల కోసం నిర్మించారు. అందులో నాలుగు పడక గదులు ఉన్నాయి. మిగిలిన రెండు భవనాలు చెరో కుమార్తె కోసం ఉద్దేశించినవని చెప్పుకుంటున్నారు. వాటిలో కూడా నాలుగేసి పడక గదులు, విశాలమైన సమావేశ మందిరాలు ఉన్నాయి. ఈ మూడు భవనాలను, మిగిలిన నాలుగింటికి దూరంగా సముద్రానికి అభిముఖంగా నిర్మించారు. వీటికి ప్రత్యేకంగా పెద్దగేటు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు తప్ప ఇంకెవరికీ అటువైపు ప్రవేశం లేకుండా చేశారు. పిడుగులు పడినా చెక్కు చెదరకుండా ఏర్పాట్లు ఉన్నాయి. వీటిలో బాత్‌రూమ్ టబ్ ఒక్కొక్కటి రూ.26 లక్షలని చెబుతున్నారు. ఇంటర్నేషనల్ బ్రాండ్ టోటో కంపెనీకి చెందిన బాత్‌రూమ్ ఫిటింగ్స్ వినియోగించారు. ఇలాంటివన్నీ పర్యాటకుల కోసమేనా?...అని వైసీపీ నేతలను ప్రశ్నిస్తే... సమాధానం చెప్పకుండా అవి ప్రభుత్వ భవనాలే కదా? అంటున్నారు తప్పితే..అంత ఖర్చు ఎందుకు చేశారో చెప్పడం లేదు. విశాఖలో రుషికొండ రాజభవనాన్ని జగన్ ప్రభుత్వ ఆడంబారాలకు నిదర్శనంగా చూడాలి. ఖర్చును వృథా చేసి అడంబరంగా కట్టుకున్న తీరు రాజరకి పోకడలను గుర్తు చేస్తోంది. తాజాగా. రుషికొండ భవనం ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తీరు చూసి ప్రపంచం ముక్కున వేలేసుకుంది. రుషికొండ భవన నిర్మాణంపై ముందునుంచీ దాగుడుమూతలు సాగాయి. మొదట టూరిజం ప్రాజెక్ట్ అన్నారు. తర్వాత ఫైవ్ స్టార్ హోటల్ అన్నారు. ఆ పైన సీఎం క్యాంప్ ఆఫీస్ అన్నారు. ప్రభుత్వ నిర్మాణమైనా, ప్రైవేట్ నిర్మాణమైనా పఎ÷-లాన్ వివరాలను ఆ కట్టడం దగ్గర ప్రదర్శిస్తారు. సెక్యూరిటీ కారణాల వల్ల అలా చేయలేదని ఇప్పుడు సమర్థించు కోవడం విడ్డూరంగా ఉంది. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్ బస చేయడానికి ఐ.ఎన్.ఎస్. డేగ, నేవల్ గెస్ట్ హౌస్ వంటి నిర్దిష్ట విడిది ప్రాంతాలు ఉన్నాయి. వి.వి.ఐ.పి.లు ఉండే భవనాలు కావడం వల్ల రుషికొండ మీద ఏం కడుతున్నామో చెప్పలేక పోయామని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనడం హాస్యాస్పదం. సరైన అనుమతులు లేవని ప్రభుత్వమే నిర్మించిన ప్రజా వేదికను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. మరి గ్రీన్ ట్రిబ్యునల్ మొదలు అనేక అభ్యంతరాలున్న రుషికొండ భవనాన్ని ఏం చెయ్యాలన్నా సవాలక్ష ప్రశ్నలు వస్తున్నాయి. నిజంగా ఇదంతా విభజన పాపం వల్ల , నేతలపై కట్టుబాట్లు లేకపోవడం వల్ల జరిగిన దుర్వినియోగంగా చూడాలి. వెరసి ఎపి రెండు రాష్ట్రాలుగా విడిపోయి, నేతల అవినీతి కారణంగా అప్పులకుప్పగా మారింది. దీనిపై నిజంగానే ప్రత్యేకంగా కమిషన్ వేసి విచారణ చేసి, అవినీతికి పాల్పడి, అప్పులు చేసిన నేతలను బోను ఎక్కించాలి. ఇకముందు ఇలాంటి అకృత్యాలకు పాల్పడకుండా చట్టబద్ద చర్యలకు పూనుకోవాలి.

# ఆదాయం పెరగాలంటే...కిలోబియ్యం పోవాల్సిందే !



తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం గుదిబండగా మారింది. ఆదాయ మార్గాలపై అద్యయనం చేస్తున్న ప్రభుత్వ పెద్దలు ఈ గుదిబండ పథకాన్ని మాత్రం కదిలించడం లేదు. కొత్తగా రేషన్ కార్డులు ఇసతామంటున్న పాలకులు ముందుగా పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించాలి. వారికి మాత్రమే రేషన్ కార్డులు ఇవ్వాలి. కేవలం బియయం కార్డులు మాత్రమే ఇవ్వాలి. ఎపిలో అధికారం చేపట్టిన సిఎం చంద్రబాబు ప్రక్షాళన ఈ దిశగా మొదలు పెడితే మంచిది. ఇబ్బడిముబ్బడిగా పెన్షన్లు, రేషన్ కార్డులు, కిలో రూపాయి బియ్యం పథకాలను సమీక్షించకుంటే గుదిబండగా మారి, ప్రజల ఆదాయాన్ని కొల్లగొడుతాయి. పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆరామారావు కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టారు. దాదాపు 41 ఏళ్ల కిందటి మాట. కానీ ఇప్పుడు అదే బియ్యం ధర 40 నుంచి 50కిచేరింది. కానీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కిలో రూపాయకే బియ్యం ఇస్తున్నారు. ఈ బియ్యాన్ని అమ్ముకోవడం, వ్యాపారంచేసుకోవడం అన్నది జరుగు తోంది. చాలామంది హోటళ్లకు అమ్ముకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై దాదాపు 20రూపాయలకు పైగగానే సబ్సిడీ ఇస్తోంది. ఇలా ఖర్చుతో కూడుకున్న పథకం అమలు చేయడం ఎంతవరకు న్యాయం. ప్రజల డబ్బును ఇలా అధికారికంగా దుర్వినయోగం చేయడం సరికాదు. ఖచ్చితంగా సమీక్షించాల్సిన పథకాల్లో కిలో రూపాయి బియ్యం పథకం ముందు వరసలో ఉంటుంది. చంద్రబాబు మాత్రమే దీనిని తొలుత సమీక్షించి నిర్ణయం తీసుకోగలరు. కొత్తిమీర పది, ఉల్లిగడ్డలు 50కి చేరిన తరుణంలో ఇంకా కిలో రూఆయికే బియ్యం ఇస్తామంటే కుదరదు. ఇది ప్రజలను వంచించడం తప్ప మరోటి కాదు. గతంలో ఇదే పథకాన్ని సమీక్షించి కిలో 5 రూపాయలు చేసిన ఘనత చంద్రబాబుది. ఉమ్మడి ఎపిలో ఆయన దీనిని సమీక్షించి, ప్రజాభిప్రాయంతో 5 రూపాయలకు కిలో బియ్యం చేశారు. కానీ కిరణ్ కుమార్ రెడ్డి సిఎం అయ్యాక దీనిని కిలో రూపాయి బియ్యంగా మార్చి దివాళా పథకంగా చేశారు. ప్రజల డబ్బును దుబారా చేస్తున్న ఈ పథకం విధానాన్ని విధిగా సమీక్షించాలి. పక్కదారి పడుతున్న పథకంపై కన్నేయాల్సిందే. నిరుపేదలకు ఉచిత పథకాలపై సమీక్షించి కుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదు. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకాలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల పరం అవుతోంది. సిబ్బంది కొరత, కొరవడిన తనిఖీలకు ప్రజల అమాయకత్వం జత కలవడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. బియ్యం అక్రమ రవాణా చేయడం నిత్యకృత్యంగా మారినా అరికట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి ప్రేక్షక పాత్రకు పరిమితమవుతున్నారు. రేషన్ దుకాణాల సమయపాలనకు తిలోదకాలు ఇవ్వడం,నిత్యావసర సరకులు వచ్చినా రాలేదని గద్దించడం, కార్డులను డీలర్లు తమ వద్దే ఉంచుకొని బియ్యాన్ని స్వాహా చేస్తూ రాష్ట్రాలను దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అమాయక ప్రజలు చేసేది లేక ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆనాటి ముఖ్యంత్రి ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు బియ్యం అందచేయాలన్న లక్ష్యంతో కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని అమలు చేశారు. ఆనాడది సంచలన నిర్ణయంగా నిలిచింది. ఆ తరవాత చంద్రబాబు సిఎం అయ్యాక దానిని ఐదు రూపాయలకు పెంచారు. దీంతో కొంత దుబారా తగ్గిందనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిక మళ్లీ కిలో రెండు రూపాయలకు చేశారు. ఇలా చేయడం వల్ల కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలు దాగి ఉన్నాయి. దీనిని కిరణ్ కుమార్ రెడ్డి సర్కార్ కిలో రూపాయికే మార్చడం ద్వారా అక్రమాలకు తెరలేపారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల ఏదో ఘనకార్యం చేశామని గొప్పగా ప్రకటించుకున్నారు. రూపాయికి కొత్తిమీర కూడా లభించని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్నికొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో అనేక పథకాలను సమీక్షించాల్సి ఉంది. బియ్యం పథకంపై ఆజమాయిషీ లేకపోవడం వల్ల చౌక బియ్యాన్ని తినడానికి బదులు అమ్ముకోవడానకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి వనరుగా, మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. ఈ బియ్యంతో హోటళ్లలో టిఫిన్లు తయారవు తున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. పాలకుల దూరాలోచన లేని కారణంగా ఈ బియ్యం కేవలం వ్యాపార దృక్పథంతో సాగుతున్నాయి. తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మొత్తాన్ని రైతుల కు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. వేలకోట్లు ఈ పథకం కోసం ఖర్చవుతున్నా మళ్లీ సమీక్ష చేయలేక పోతున్నారు. ఎక్కడ ఓట్లు పోతాయో అన్న అభయం వెన్నాడుతున్నట్లుగా ఉంది. రేషన్ కార్డులు తగ్గించడమంటే పేదవారికి బియ్యం దక్కకుండా అడ్డుకోవడం కాదు. రేషన్ బియ్యం తినే ప్రతిఒక్కరికీ బియ్యం అందిస్తాం అంటూ ప్రజలు కట్టే పన్నులకు పాతరేస్తున్నారు. చౌకధరలకు తీసుకుని బయట అమ్ముకునే వారిని గుర్తించి తొలగించడం లేదు. కార్డులు తగ్గించకున్నా అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వాలనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరలకుండా కఠినంగా చర్య తీసుకోకపోవమే ఆక్షేపణీయం. అందుకే ఆదాయవనరులపై దృష్టి పెట్టేముందు..దీనిని సమీక్షించి దుబారా అరికట్టగలిగితే ఆదాయం కొంతనే చూడవచ్చు.

# ఆరోగ్య ప్రక్రియ మన యోగా !

మానవుల ఆరోగ్యాన్ని,శరీరాన్ని, మనసును అదుపులో పెట్టుకునేలా రూపొందించిన అద్భుత ప్రక్రియ యోగ. ఇది ఎంతో ప్రాచీన కాలం నాటిది. రుషుల సాధనతో యోగా ప్రక్రియను రూపొందించారు. ఇది ప్రపంచానికి భారతదేశం అందించిన మహత్తర ప్రక్రియ. యోగాతో మనిషి శరీరం, మనస్సు, ఆరోగ్యం అదుపులో ఉండగలవు. భారతదేశం చేసిన ప్రయత్నంతో ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగగా దినోత్సవంగా గుర్తించింది. దీంతో యోగాకు ప్రాధాన్యంతో పాటు, అంతర్జాతీ యంగా దీనిని ఆచరించే వారి సంఖ్య పెరిగింది. యోగా అనేది 5వేల సంవత్సరాల నుండి భారతదేశంలో ఉన్న జ్ఞానం యొక్కఅంతర్భాగంగా గుర్తించారు. చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామము, కేవలం కొన్ని శారీరిక కదలికలు ,ఇంకా శ్వాస పక్రియ అని మాత్రమే అనుకుంటారు. నిజానికి మానవుని అనంతమైన మేధాశక్తి , ఆత్మశక్తిల కలయికగా నిరూపితం అయ్యింది. విజ్ఞానశాస్త్ర ప్రకారం యోగా అంటేపరిపూర్ణ జీవనసార విధానం. దీనిలోజ్ఞాన యోగము (తత్వశాస్త్రము ), భక్తి యోగము , రాజ యోగం మరియు కర్మ యోగములు ఉన్నాయి. యోగాసనాలు అంటే రాజయోగ పక్రియలో పైన చెప్పిన యోగాలన్నిటిలో సమతౌల్యాన్ని , ఏకత్వాన్ని తీసుకువస్తాయి. యోగా అనేది ఆరోగ్యకరమైన శక్తిని పుంజుకునే ఆనందకర మైన అనుభూతి. ఇది సులభమైన, కష్టతరమైన శ్వాసపక్రియతో కూడుకున్నటు వంటి పక్రియ. దీనిద్వారా శారీరక , మానసిక సమతౌల్యం ఏర్పడుతుంది. ఇది ఒక బహుముఖ ప్రజ్ఞానాన్నికలిగించే కార్యక్రమం. ఇందులో యోగాసనాలు,శ్వాసపక్రియ , యోగాకి సంబంధించిన జ్ఞానము. ఇంకా ధ్యానము పొందు పరిచబడి ఉంటాయి. యోగా చేస్తున్న వారిలో మానసిక, ఆరోగ్య సమస్యలు ఉండవని నిరూపితం అయ్యింది. నిత్యం యోగా చేసిన వారు ఆనందంగాను, ఉత్సాహంగానూ ఉండడాన్ని గమనించ వచ్చు. యోగాతో మనస్సు, శరీరం అదుపులో ఉంటుందని కూడా నిరూపితం అయ్యింది. ఇది వేల ఏళ్లుగా ఈ ప్రక్రియ సాగుతోంది. అందుకే ఐక్యరాజ్యసమితి మన వినతిని గుర్తించి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించింది. జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం ఆరోజు ఉత్తరార్ధ గోళంలో అత్యధిక పగటి సమయం కావడమే. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపుపొందడంతో అదేరోజును అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. యోగా దినోత్సవం అందుబాటులోకి వచ్చాక దీనిని ఓ కార్యక్రమంగగా కాకుండా నిరంతర ప్రక్రియగా ఆచరించడం మొదల య్యింది. అనేక దేశాలు, దీనిని ఆరోగ్యంలో భాగంగా అమలు చేస్తున్నాయి. ముస్లిం దేశాలు సైతం దీని ప్రాధాన్యాన్ని గుర్తించాయి.దీర్ఘకాలిక రోగాలను సైతం అదుపు చేసే అవకాశం యోగా ద్వారా లభించగలదు. శరీరం సౌష్టవంగా ఉండేందకు కూడా యోగా ఉపయోగపడుతుందిం. ఇది నేర్చుకునే విద్యార్థులకు తమను తాము ఇంటి వద్ద నే చేసుకోవచ్చు. ఇది క్రొతగా నేర్చుకునేవారికి,రోజు సాధన చేసుకునేవారికీ అన్నిరకముల వయసుల వారికి ఉపయోగ పడుతుంది. చేసేవారి జీవన విధానములో ఎన్నో గొప్ప మార్పులు చోటుచేసు కున్నాయి.

# పాఠశాలల్లో యోగాకు ప్రణాళిక

### స్కూళ్లలో కరికులమ్‌లో చేర్చే యత్నాలు

### పిల్లలకు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాయి. ఆట పాటలు, యోగాసనాలతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం నింపేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. క్రీడాంశాల్లో యోగగాను జోడించి అనేక ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ప్రతి ఏటా విద్యాశాఖ ఉపాధ్యాయులకు పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను అందిస్తోంది. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి మారిన పాఠ్యాంశాల ఆధారంగా బోధన తీరు మెరుగపడేలా చర్యలు తీసుకుంటుంది. ఎన్నో ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యా యులకు ఎలాంటి శిక్షణ తరగతులు లేవు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల ఆరోగ్యం, ఇతర అంశాలపై దృష్టిసారించలేక పోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన విద్యాశాఖ ఇటీవల వ్యాయామ ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించింది. యోగా, ఆరోగ్యం, కరాటే, మానసిక అంశాలపై తర్ఫీదునిచ్చారు. విద్యార్థులకు ఆత్మస్థైర్యం పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు కరవయ్యాయి. ప్రార్థన చేసేందుకు స్థలం కొరత పీడిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఏడాదిలో స్వాతంత్య, గణతంత్య వేడుకల సమయంలో తప్ప క్రీడా పోటీల ఊసేలేదు. ఆసక్తి ఉన్నా విద్యార్థుల్లో ప్రతిభ కనుమరుగవుతోంది. అప్పడప్పుడు మండల, జిల్లా స్థాయి పోటీలకు తప్ప రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు కరవైంది. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రాధాన్యం లేక నిరాశకు గురవుతున్నారు. ఇన్నాళ్లుగా ఈ అంశాలకు దూరమైన పిల్లలకు సంపూర్ణత చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మానసిక వికాసం, శరీర దారుఢ్యంతోపాటు మెదడు చురుకుదనంతో ఉండేలా సమగ్ర నిరంతర మూల్యాంకనం విధానంలో భాగంగా వ్యాయామ విద్యను తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. యోగా, ఆత్మరక్షణ కోసం కరాటే, క్రీడలు, ఆర్యోగంతో సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న వ్యాయమ ఉపాధ్యాయులకు గతంలో నాలుగు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగాసనాలు, కరాటే, ఆటలు, ఆర్యోగం తదితర విషయలపై బోధన ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల మేథస్సు ప్రశాంతత కోసం చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు ను చక్కదిద్దుకుంటారు. ఆటలతోపాటు వ్యక్తిగత ఆరోగ్య పాఠాలు బోధించాలని వివరించారు. క్రీడల్లో ఉత్తేజపూరితంగా తర్ఫీదు ఇచ్చేలా శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజు వ్యాయామ, ఆరోగ్య విద్యను అమలు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ప్రతి రోజు ఓ పీరియడ్ కేటాయించాలని నిర్ణయించారు.. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రోజువారీగా నిర్ణయించిన ప్రణాళికను అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని, బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని నిర్ణయించారు. క్రీడలతో పాటు అ÷-లథెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. వీటిపై ఇతర పాఠ్యాంశాల మాదిరిగానే సమ్మెటీవ్-1,2 పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతిభావంతులైన వారిని ప్రోత్సహిస్తూ జాతీయస్థాయిలో పాల్గొనేలా సిద్ధం చేస్తారు. ఇతర దేశాల్లో బాల్య దశలోనే ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్నారు. మన దగ్గర ఆటలాడుకోవాలనే ఆసక్తి ఉన్నా ఆట స్థలం కరవే...ప్రతిభ ఉన్నా శిక్షకుడి సేవలు దూరమే...ఎలాంటి శిక్షణ లేకున్నా ఏకలవ్యులా పలు పోటీల్లో విద్యార్థులు సత్తాచాటుతున్నారు. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ...మరికొన్నిటికి పోస్టుల మంజూరు లేదు...విద్యార్థుల్లో మానసిక పరిపక్వత లోపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు ఆందోళన కల్గిస్తున్నాయి. క్రీడా మైదానాలు లేని చోట సమీపంలో అందుబాటు లో ఉన్న స్థలాలను ఎంపిక చేసుకుని తీసుకోవాలి. సగానికిపైగా ఖాళీలు ఉండటంతో వీటిని భర్తీ చేయాలి. క్రీడాకారుల ప్రయోజనం కోసం ఆట వస్తువులు, ఇతర వసతులు కోసం నిధులను కేటాయించాలి. విద్యాక మిటీ సభ్యులను భాగస్వాములను చేసి ప్రజా విరాళాలతో ముందుకుసాగేలా ప్రతిపాదనలు తయారు చేసుకోవాలి. ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ విద్య అమలు చేస్తున్నప్పటికీ ప్రాథమికస్థాయిలో లేకపోవడం అన్యాయమే. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను పకడ్బందీగా అమలు చేస్తుండగా ప్రైవేటు పాఠశాలల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకమే. పలు పాఠశాలలకు క్రీడా వసతులు లేవు. పాఠశాలల గుర్తింపునకు ముందు కనీస వసతులు ఉంటేనే అనుమతి పత్రం ఇవ్వాలి. నిబంధనలు పాటించకుండానే అనుమతులు ఇవ్వడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రార్థన చేసుకునేందుకూ స్థలం లేకపోవడం గమనార్హం. ప్రైవేటు పాఠశాలల్లో కూడా వ్యాయమ విద్య పక్కాగా అమలు చేస్తే క్రీడా వెలుగులు అందుతాయి.

# ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారం

### పిల్లల చదువు భారం తడిసి మోపెడు

**నిజామాబాద్:** ప్రైవేటు పాఠశాలల తీరుపై విద్యాశాఖ అధికారుల్లో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస వసతులు కరవైనా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఫీజుల విషయంలో ఇప్పటికే విద్యార్థి సంఘాలు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వాటి నియంత్రణ దిశగా కనీస చర్యలకు చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడి ఆవరణలో ఎట్టిపరిస్థితుల్లో విద్యను వ్యాపారం చేసేలా పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దనే నిబంధనను ఉల్లంఘిస్తున్నా..చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతులు సహా ఇతర వ్యవహారాల్లోనూ పర్యవేక్షణ కొనసాగించడం లేదు. కమిషన్లతో వ్యాపారం కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆయా పుస్తక విక్రయ దుకాణాలతో ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నాయి. కొన్ని ప్రైవేటు బడుల్లో ఫీజులుం కొనసాగుతోంది. వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నా నాణ్యమైన విద్య ముసుగులో అక్రమార్జనకు కొన్ని పాఠశాలలు తెరతీస్తున్నాయి. బడుల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దని.. ప్రభుత్వం, న్యాయస్థానం ఆదేశించినా జిల్లాలో ఆ వ్యవహారం బాహాటంగానే సాగుతోంది. కాసుల కక్కుర్తితో బడిలో వ్యాపారం నడుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారు చెప్పిన ఫీజును కాదనలేక.. పుస్తకాలను మరో చోట కొనలేక నానాతంటాలు పడుతున్నారు. ఎల్‌కేజీ విద్యార్థి పుస్తకాలకే రెండువేల వరకు ఖర్చవుతోంది. ఇక కెజీ పెరిగిన కొద్దీ రకరకాల పుస్తకాలు కావాలంటే జేబు గుల్లకాక తప్పడంలేదు. వీటికితోడుగా రాత కోసం మరో 10 నోటు పుస్తకాలను కొనాల్సిందే. బడికి బస్సులోనే పంపాలి. ఇందుకోసం నెలకు రవాణా రుసుం కట్టాలి. పుస్తకాలకు డ్రెస్‌లకు మరో రెండు వేలు, బెల్టు, బ్యాగు, బూట్లు ఇతర నోటు పుస్తకాలకు మరో మూడువేలు వసూల చేస్తున్నారు. పిల్లలుఫలానా షాపులోనే ఇవన్నీ కొనే విధంగా రహస్య ఒప్పందాలు కొందరు కుదుర్చుకున్నట్లు సమాచారం. పుస్తక దుకాణాల వారే అధికంగా అన్ని పాఠశాలలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఒక్కో పాఠశాల నుంచి సుమారు 400 నుంచి 1200 మంది పిల్లలు ఉంటున్నారు. ఇలా వారి సంఖ్యను బట్టి బడులకు కమిషన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలన్నీ అక్కడే కొనాలే నిబంధనను పెడుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారి చెప్పిన ధరలకే తీసుకోవాల్సి వస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాసంస్థలు కోట్ల రూపాయల్లో లావాదేవీలు చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్కో బడిలో ఒక్కో విధమైన ధరల్ని నిర్ణయించారు. తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలతోపాటుగా నోటు పుస్తకాలను అమ్ముతున్నారు. ఏ ఒక్కటి తీసుకోకున్నా ఒప్పుకోవడం లేదు. సట్టణంలో ఒకటి రెండు బడులకు మినహాయిస్తే ఏ ఒక్క చోట విద్యార్థులు ఆడుకునేందుకు మైదానాలు లేవు. పైగా విద్యార్థులకు క్రీడల కోసం కొన్ని చోట్ల ప్రత్యేక ఫీజు వసూలు చేస్తున్నారు. మైదానం సంగతేంటని.. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారంలో ఒక రోజు పట్టణశివారులో ఉన్న మైదానానికి పిల్లలను బస్సులో తీసుకెళ్తామనే సమాధానాలు వినిపిస్తున్నాయి.

# మిర్చితో నష్టం..పత్తితో కలసి వచ్చేనా?


### మరోమారు పత్తివైపు రైతుల మొగ్గు

**ఆదిలాబాద్ :** మిరప పంట సాగు చేసినా అందుకు తగ్గట్లు మార్కెట్ సౌకర్యం లేకపోవడం, రోజురోజుకు ధర తగ్గడం వల్ల మిరప పంట సాగుచేసిన రైతులకు శాపంగా మారింది. పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు అన్నదాతలు పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. దీనికితోడు జిల్లాలో మిరప పంటకు అనువైన నేలలు ఉండటంతో ఎక్కువ మంది రైతులు పత్తికి బదులు మిరప వైపు మొగ్గుచూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పత్తి, వరి పంటల తర్వాత మూడో పంటగా మిరప సాగు చేయడం విశేషం. అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్న చందంగా మారింది మిర్చి రైతుల పరిస్థితి. ప్రభుత్వాల అసమర్థత కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడారు. కనీసం పండించిన పంటను అమ్ముదామంటే మార్కెట్లో కొనేవారు కరవయ్యారు. దిక్కుతోచక పంటను కొందరు స్వయాన తగులబెట్టి తమ కడుపు మంటను వెళ్లగక్కారు. మరికొందరు కూలీ కూడా వెళ్లదని పంటను చేలల్లోనే వదిలేసారు. చేసేది లేక నిస్సహాయంగా ఆగ్రహాన్ని, ఆవేదనను తమలోనే అణచివేసుకున్నారు. దీంతో ప్రస్తుతం మళ్లీ మిర్చివేయాలంటేనే భయపడుతున్నారు. దీంతో మరోమారుపత్తి వేసేందుకు రైతులు సమాయత్తం అయ్యారు. పంటను మార్కెట్‌కు తరలిస్తే ఖర్చులు కూడా వెళ్లక మిరప రైతు కుదేలు అయ్యారు. మొదట తీసిన పంటే పూర్తి స్థాయిలో అమ్మకపోగా.. కనీసం మరో రెండు దఫాలుగా తీయాల్సిన పంట చేలోనే ఉండిపోయింది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. అందుకు తగ్గట్లు ధర లేకపోవడం మిరప రైతులను కుదేలు అయ్యేలా చేసింది.

# నినాదంగానే మిగిలిపోతున్న అభివృద్ధి !







**హైద్రాబాద్ :** విపక్షంలో ఉన్నప్పుడు కనిపించిన అనేకానేకసమస్యలను... అధికారంలో ఉన్నప్పుడు విస్మరిస్తున్నారు. ప్రజలు, రైతులు, నిరుద్యోగులు తదితర సమస్యలు అధికారంలోకి వచ్చాక వారికి కనిపించడం లేదు. ఇందుకు మోడీ కూడా మినహాయింపు కాదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ అనేక రకాలుగా యూపిఏ ప్రభుత్వాన్ని విమర్శించి, మన్మోమన్ సింగ్‌ను మౌనసింగ్‌గా అభివర్ణించిన మోడీ ఇప్పుడు ప్రధాన సమస్యలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికే పదేళ్ల పుణ్యకాలం గడిచిపోయింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం జరుకున్నాం. ఇంకా రైతులు, నిరుద్యోగుల సమస్యలు రెట్టింపు అయ్యాయే తప్ప తగ్గలేదు. మన నాయకులు కూడా నైతికంగా పతనమవుతూ వచ్చారు. అధికారమే పరమావధిగా రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. అధికారం కోసం సమాజాన్ని కులాలు, మతాల పేరిట ముక్కలు చెక్కలు చేశారు. తప్పుడు పనులు చేసే వారు కూడా కులాన్ని రక్షణ కవచంగా వాడుకోవడం మొదలెట్టారు. వజ్రోత్సవాల సందర్భంగా మన పతనాన్ని చూస్తే ఆవేదనే మిగులుతుంది. ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు.నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చించడం లేదు. అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించడం లేదు. మోడీ పార్లమెంటులో కనిపించరు. ప్రజల్లోకి రారు. ప్రజలు తమస సమ్యలను ఎక్కడ చెప్పుకోవాలో తెలియడం లేదు. ప్రజల్లోకి వెళ్లి సమస్యలను ఆరా తీయడం లేదు. ఇలాగే పాలన కొనసాగిస్తే మరో 20 ఏళ్లయినా భారత్ బలపడదు. అత్యాచార ఘటనలు, పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. పన్నులు వసూళ్లతో ప్రజలను పీల్చి పిప్పి చేయడం తప్ప మరో ధ్యాస బిజెపి పాలకులకు కనిపించడం లేదు. ఈ దశలో భారతదేశం స్వాతంత్ర్యోత్సవాలను పురస్కరించుకుని 78 ఏళ్ళు అవుతున్న సందర్భంగా దేశ విదేశాల్లోనూ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఊరూవాడా మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. ప్రజలు తమ దేశభక్తిని మనసారా చాటారు. ఈ స్ఫూర్తిని ఇంకా ముందుకు తీసుకుని పోవాలని ప్రజలు మాత్రమే సంకల్పం ప్రకటించారు. పాలకులు ఇక తమ రాజకీయాలను పక్కన పెట్టి దేశంకోసం శ్రమించాల్సిన సమయమిది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక, ఆర్థిక న్యాయానికి విలువనిచ్చే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు స్వార్థపర రాజకీయశక్తులతో పోరాడేందుకు సమైక్యంగా కృషి చేయాలి. అప్పుడేపోరాట యోధులు సాధించి పెట్టిన స్వాతంత్ర్య లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళ గలుగుతాం. ఆధునిక కాలంలో ఒక స్వతంత్ర దేశం సాధించిన పురోగతిని అంచనా వేయడానికి 78 ఏళ్ల సుదీర్ఘ కాలం సరిగ్గా సరిపోతుంది. మనం సంబరంగా జరుపుకుంటున్న ఈ ఉత్సవాలను పునఃసమీక్షించు కుని ముందుకు సాగాల్సి ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పూర్తయినా ఇంకా దారిద్య్రం పోలేదు. పేదలు పేదలుగా ఉంటున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించాం. ఆర్థికంగా కూడా పురోగమించాం. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన దేశ వార్షిక బడ్జెట్ 250 కోట్లు దాటలేదు. ఇందులో దాదాపు 30 కోట్ల ద్రవ్యలోటు ఉంది. ఇప్పుడు దేశ వార్షిక బడ్జెట్ దాదాపు 30 లక్షల కోట్ల వరకు ఉంది. వార్షిక ఆదాయం 170 కోట్ల వరకు మాత్రమే ఉన్నప్పటికీ నాటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా వాటిని పూర్తి చేశారు. ఇప్పుడు ప్రభుత్వ ఆదాయం ఇబ్బడిముబ్బడి గా పెరిగినప్పటికీ దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుం టున్నాం. ఉపాధి ఉద్యోగ రంగాలను దెబ్బతీస్తున్నాం. దేశం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని చెప్పుకొంటున్న పాలకులే పేదరికం పేరిట ఉచిత పథకాలకు తెర తీస్తున్నారు. మరోవైపు లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలను మాఫీ చేస్తున్నాం. పుడు రాష్ట్రాల్లో గానీ, కేంద్రంలో గానీ అధికారంలో ఉన్నవారెవరూ 1947కి ముందు పుట్టినవాళ్లు కారు. ప్రజా జీవితంలో ఉన్నత ప్రమాణాలు అంటే ఎలా ఉంటాయో చెప్పేవారు కూడా లేరు. ఎవరైనా చెప్పడానికి ప్రయత్నించినా ఎగతాళికి గురవుతున్నారు. అత్యంత దుర్భరమైన దారిద్య్రం నెలకొన్న, వ్యాధులతో కునారిల్లుతున్న, నిరక్షరాస్యులైన ప్రజలతో నిండిన ఒక దేశంలో ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించాలని భారతదేశంలో అధికారంలోకి వచ్చిన కొత్త పాలక వర్గాలు భావించాయి. రెండు శతాబ్దాల పాటు సాగిన వలస పాలనతో దేశం మొత్తంగా కుంగుబాటుకు గురైంది. అభివృద్ధి వెనుకపట్టు పట్టింది. స్వాతంత్ర్యానికి ముందు అర్ధ శతాబ్దంలో వ్యవసాయ జనాభా తలసరి ఆదాయం పూర్తిగా క్షీణించింది. 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం స్వతంత్ర భారతదేశం సాధించిన ముఖ్యమైన విజయం. నయా ఉదారవాద విధానాలకు మారడంతో, మూడు దశాబ్దాల క్రితం వరుసగా వచ్చిన ప్రభుత్వాలు సంపన్నులను మరింత సంపన్నులుగా తయారు చేసే అభివృద్ధి పంథాను పెంచి పోషిస్తూ వచ్చాయి. బూర్జువా సంస్థలకు, వారితో కుమ్మక్కైన – అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడి దారులకు అనుకూలంగా లొంగి వుండేటు వంటి విధానాల రూపకల్పన పెరుగుతూ వచ్చింది. మోడీ ప్రభుత్వం కూడా గత ఎనిమిదేళ్ళ కాలంలో నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేసింది. దీనివల్ల పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారాయి. ప్రజారోగ్య వ్యవస్థ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ ల్లో అభివృద్ధి, విస్తరణకు సంబంధించి వైఫల్యం నెలకొంది. ఇన్నేళ్ల తర్వాత కూడా, ప్రజారోగ్యంపై పెట్టే ఖర్చు జిడిపిలో కేవలం ఒకే ఒక్క శాతంగా వుంది. ప్రపంచంలోనే చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదేనంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా రూపాయి పతనాన్ని అడ్డుకోలేక పోతున్నాం. ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం సఫలీకృతం కాలేదంటూ రాజ్యాంగం తుది ముసాయి దాను ఆమోదించిన సమయంలోనే 1949లో రాజ్యాంగనిర్ణాయక అసెంబ్లీ లో డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. బడా కార్పొరేట్ సొమ్ము రాజకీయ వ్యవస్థను కాలుష్యం చేస్తోంది. రాజ్యాంగం లో పొందు పరచబడిన విలువలు అన్నీ కూడా తీవ్ర దిగ్బంధాన్ని ఎదుర్కొం టున్నాయి. మరింత మెరుగైన జీవితం కావాలన్న ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదు. బతకడమే భారంగా మారేలా విధానాలు ఉన్నాయి. మెరుగైన పాలన కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు సమైక్యంగా వుండేందుకు ప్రయత్నాలు చేయాలి. అప్పుడే స్వాతంత్ర్య ఉద్యమ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళగలుగుతాం. దేశాన్ని వేగంగా ముందుకు తీసుకుని వెళ్లగలం. కార్పోరేట్లకు దోచిపెట్టే దేశ సంపదను అడ్డుకోవాల్సిందే. అప్పుడే ప్రజలకు ఈ దేశ ఆస్తులపై హక్కు లభిస్తుంది. అందరికీ ఆహారం, కూడు, గుడ్డా, నివాసం వంటి లక్ష్యాలను చేరుకోవాలి. ఉద్యోగం లేదా ఉపాధి అన్నది హక్కుగా రావాలి. ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న డబ్బును దుబారా చేయకుండా నిరోధించాలి. పాలకులు తమ జేబులోంచి ఇస్తున్నట్లుగా చేస్తున్న పందేరాలకు అడ్డుకట్ట వేయాలి. అభివృద్ధి పనులకే సొమ్మును వినియోగించాలి. అప్పుడే దేశ మనుగడ సాగిస్తుంది.

# నియంతృత్వంపై తిరుగుబాటు !

**హైద్రాబాద్ :** శ్రీలంక తరవాత బంగ్లాదేశ్..ఈ రెండు దేశాలు ప్రపంచానికి ఓ పాఠం చెప్పాయి. నేతల నియంతృత్వ ధోరణలు..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని తీరును ప్రపంచానికి తెలియచేశాయి. చరిత్ర తిరగేస్తే..నియంతలకు స్థానం లేదని ఎప్పుడూ నిరూపిస్తూనే ఉంది. బంగ్లా ప్రధాని షేక్ హసీనా నియతృత్వ పోకడలు ఆమెనే గద్దె దించాయి. దేశ విముక్తి పోరాటంలో పాల్గొన్న వారికి రిజర్వేషన్ల పేరుతో తన పార్టీ వారికి లబ్ధి చేకూర్చే విధంగా చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గుర్తించకుండా మొండిగా, నిరంకుశంగా నిర్ణయాలు తీసుకున్నారు. బంగ్లా సుప్రీంకోర్టు రిజర్వేషన్ల కోటాను తగ్గించినా ప్రజల్లో ఆగ్రహం చల్లారలేదు. దీనికితోడు నేతు విలాసాలకు అలవాటు పడుతున్నా రు. ప్రజల సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ఇది ప్రజల్లో ఆగ్రహానికి కారణం అవుతోంది. అదే బంగ్లాదేశ్‌లో తిరుగు బాటుకు బీజం వేసింది. గత కొన్ని వారాలుగా బంగ్లాదేశ్‌లో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పొరుగుదేశాలు, స్నేహితులు గమనిస్తున్నారు. బంగ్లాదేశ్ ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసన షేక్ హసీనా గతంలో సంక్షోభాలను ఎదుర్కొన్నట్లుగానే ఈ సమస్యను కూడా పరిష్కరించగలరా అని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఎందుకంటే పరిస్థితులు దిగజారుతున్నా పట్టించుకోకుండా ముందుకు వెళ్లారు. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బతుకుజీవుడా అంటే దేశం విడిచి పెట్టా పారిపోవాల్సి వచ్చింది. గతంలో శ్రీలంక ప్రధాని కూడా ఇలాగే పారిపోయారు. స్వేచ్ఛ, నిష్పక్షపాతమైన, విశ్వసనీ యమైన ఎన్నికల ద్వారా 2009లో షేకహేసీనా అధికారం చేపట్టారు. అయితే ఆ తర్వాత 2014, 2018 మరియు 2024లో ఎన్నికలు వివాదాస్పద మైనప్పటికీ.. అధికారాన్ని చేపట్టారు. తన తండ్రి షేక్ ముజ్బీర్ రహమాన్ ప్రతిష్టను అడ్డం పెట్టుకుని ఆమె రాజ్యమేలారు. అయితే దేశంలో అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి. 15 ఏళ్ల సుదీర్ఘపాలనను ముగిస్తూ సోమవారం ఆమె ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఉద్యోగాల్లో కోటాను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ప్రారంభమైన విద్యార్థుల నిరసనలు వేగంగా దేశవ్యాప్త ఆందోళనలుగా మారాయి. స్వదేశంలో విదేశాలలో షేక్ హసీనా సాధించిన ఆర్థికాభి వృద్ధిని కప్పిపుచ్చుతూ, ఆమె నిరంకుశత్వం, అవినీతి, బంధుప్రీతిపై అంసతృప్తిని బహిర్గతం చేశాయి. ఓవైపు దేశంలో ప్రజాస్వామ్య విలువలు, పౌరహక్కులను హరించివేస్తూ, మరోవైపు ఆర్థిక పురోగతి సాధించినంత మాత్రాన ఆ నేత ప్రజాదరణను పొందలేరని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రిజర్వేషన్ల కోటాను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనలు, వివాదాస్పద రాజకీయ పరిణామాలుగా మారాయి. అయితే ఈ నిరసనలను అణచివేసేందుకు ఆమె సైన్యాన్ని రంగంలోకి దింపారు. దీనిపై ప్రజాగ్రహం పెల్లుబికింది. కర్ఫ్యూ, షూట్ ఎట్ సైట్ ఆదేశాలు, ఇంటర్నెట్‌పై నిషేధం ఉద్యమాలను మరింత ఉధృతం చేశాయి. ప్రదర్శనకారులను 'రజాకార్లు' అని హసీనా పేర్కొనడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ ఉద్యమాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, సామాజిక సంస్థలు సహా సమాజం లోని విభిన్న వర్గాలు మద్దతు ప్ర కటించాయి. తమ డిమాండ్లు నెరవేరేంతవరకు ప్రధానితో చర్చలకు విద్యార్థులు నిరాకరించారు. ప్రజాస్వామ్య విలువలు, పౌరహక్కులను తుంగలో తొక్కి కేవలం ఆర్థికాభివృద్ధికి మాత్రమే ప్రాధాన్యత నిచ్చే నేతలకు షేక్ హసీనా పతనం ఉదాహరణగా నిలిచింది. ఆమె తండ్రి జైలు శిక్ష అనుభవించినప్పటికీ దేశం విడిచి పారిపోలేదు. హసీనా నిష్క్రమణ బంగ్లాదేశ్ రాజకీయాల్లో గణనీయమైన మార్పును సూచిస్తుంది. హసీనా తన పదవికాలంలో లిఖించదగిన ఆర్థికాభివృద్ధి ని సాధించారు. ప్రపంచం లోనే అత్యంత పేదరిక దేశంగా ఉన్న బంగ్లాదేశ్ ..ఆమె హయాంలో ఆ ప్రాంతంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థ గా రూపాంతరం చెందింది. పొరుగునే ఉన్న భారతదేశాన్ని కూడా అధిగమిం చింది. దశాబ్ద కాలంలో దేశ తలసరి ఆదాయం మూడింతలైంది. గడిచిన 20 ఏళ్లలో దేశంలో 25 మిలియన్లకు పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. హసీనా ప్రభుత్వం దేశీయ నిధులు, రుణాలు అభివృద్ధి నిధుల సాయంతో గంగానదిపై 2.9 బిలియన్ డాలర్ల పద్మ వంతెనవంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను చేపట్టారు. అయితే ఈ ఆర్థికాభివృద్ధి గణనీమైన ఖర్చుతో కూడుకుంది. దీంతో 2014, 2018 మరియు 2024లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు తక్కువ ఓటింగ్, హింస, ప్రతిపక్ష పార్టీల బహిష్కరణల మధ్య జరిగాయి. భయం,అణచివేత వాతావరణాన్ని సృష్టించి, నియంత్రణను కొనసాగించడానికి హసీనా ప్రభుత్వం పూర్తి సైన్యాన్ని వినియోగించింది. 2018లో అమలు చేసిన డిజిటల్ భద్రతా చట్టం విమర్శకుల గొంతుకను అణిచివేసేందుకు, ముఖ్యంగా ఆన్‌లైన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి ప్రభుత్వానికి, అధికార పార్టీ కార్యకర్తలకు



శక్తివంతమైన ఆయుధంగా మారింది. పత్రికా స్వేచ్ఛ దెబ్బతినింది. హసీనా తన అధికార స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతో పౌర హక్కులు, క్రమపద్ధతిలో అణచివేసారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ప్రజలమధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి. బ్యాంకు మోసాలు పెరిగాయి. రుణ ఎగవేతదారుల జాబితా పెరిగింది. సిఎల్‌సి పవర్, వెస్టర్న్ మెరైన్ షిప్‌యార్డ్ రెమెక్స్ ఫుట్‌వేర్ వంటి కంపెనీలు దీవాలతీసిన జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. 965 కోట్ల నుండి 1,649 కోట్ల బంగ్లాదేశ్ టాకాల వరకు మొండి బకాయిలు పెరిగాయి. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, ప్రబలమైన అవినీతి, మొత్తం ఆర్థిక పురోగతి ఉన్నప్పటికీ ప్రజల్లో అసంతృప్తికి ఆజ్యం పోసింది. నియంతలకు ఇది గుణపాఠం కావాలి. ఒంటెద్దు పోకడలతో తీసుకునే నిర్ణయాలు ఎప్పటికైనా ప్రజల్లో తిరుగుబాటుకు కారణమవుతాయి. ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాదని తీసుకునే నిర్ణయాలు నిలబడవనడానికి బంగ్లాదేశం ప్రత్యక్ష ఉదాహరణ.

# నిగ్రహం కోల్పోతున్న నేతలు !

**హైద్రాబాద్ :** విగ్రహాల సంగతి ఎలా ఉన్నా..నేతలకు నిగ్రహం ఉండాలి. మాట్లాడేప్పుడు నిగ్రహంతో మాట్లాడాలి. ఏదిపడితే అది మాట్లాడడం సరికాదు. భాషను పరిమితి మేరకు ఉపయోగించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడు కొంత నిగ్రహంగా మాట్లాడాలి. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం భాషను ఇష్టానుసారం ఉపయోగిస్తున్నారు. వాడరాని పదాలన్నీ వాడేస్తున్నారు. సరే ఎన్నికల ప్రసంగం కాబట్టి వదిలేద్దామని అంతా అనుకుంటారు. కానీ అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా నేతలు తమ మాటల్లో తప్పులు, బూతులు, ఇతరత్రా వాడకూడని పదాలు దొర్లకుండా చూసుకోవాలి. ఎదుటివారి మీద ఎంతగా కోపం ఉన్నా..అందుకు అనుగుణంగానే భాషను ఉపయోగించాలి. ఈ విషయంలో దివంగత వాజ్‌పేయ్ ప్రసంగాలు ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఎప్పుడూ పరుషంగా మాట్లాడిన సందర్భాలు లేవు. విమర్శలను కూడా సుతిమెత్తగా చేసేవారు. ఒకవేళ ఎవరైనా తనపై విరుచుకు పడ్డా..ఆయన అంతకు మించిన సంయమనంతో సమాధానం చెప్పేవారు. ఒకవేళ పరుషపదజాలంతో ఎవరైనా దూషిస్తే..మీకు ఇది ఉచితం కాదని సున్నితంగా హెచ్చరిక చేసేవారు. మొన్నటి ఎన్నికల సమయంలో ఎపి సిఎంగా ఉన్న జగన్, ఆయన అనుచరులు కూడా బూతులు మాట్లాడారు. తాము పదవుల్లో ఉన్నామన్న జ్ఞానం లేకుండా మాట్లాడారు. ఇలాంటివి ప్రజలు గుర్తిస్తారు. అలాగే హర్షించరని కూడా గుర్తించాలి. ఇప్పుడు తెలంగాణలో విగ్రహాల గొడవ నడుస్తోంది. గతంలో కూడా ఇలాంటిదే నడిచింది. పాలకులకు విగ్రహాల మీద ఉన్న శ్రద్ధ.. ప్రజల సమస్యలపైన లేదు. తెలంగాణ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. ఇంకా వాటిని కాంగ్రెస్ గుర్తించనే లేదు. వాటిపైన దృష్టిని కాస్తా ఇప్పుడు విగ్రహాల మీదకు మరల్చారు. ఎదుటి వారితో సై అంటే సై అనేలా మాటల తూటాలు పేలుతున్నారు. తాజాగా తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం వ్యవహారం ఇప్పుడు దుమారానికి కారణమయ్యింది. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలను కున్నామని బిఆర్ఎస్ వాదిస్తోంది. కానీ అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. నిజానికి తెలంగాణ కోసం పోరాడిన, అమరులైన వారు ఎందరో ఉన్నారు. వారెవ్వరూ విగ్రహాలు పెట్టించుకునేంత స్థాయికి రాలేదు. ఎందుకంటే నేతలు వారి త్యాగాలను గుర్తించిన సందర్భాలు లేవు. కనీసం ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారిని కూడా గుర్తించలేదు. ఇదే సందర్భంలో ఇప్పుడు రాజీవ్ విగ్రహం పెట్టాల్సిన అవసరం లేదు. అయితే స్వామి భక్తి చాటుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఉంటుంది. విగ్రహాలు పెట్టడం లేదా పథకాలకు పేర్లు పెట్టడం ద్వారా కాంగ్రెస్ పెద్దలను ఎప్పుడూ కొలిచే పద్దతి ఒకటి ఉంది. కాంగ్రెస్‌లో ఇలాంటి పనులు చేస్తుండాలి. లేకపోతే అధిష్ఠానం కోపానికి గురికాక తప్పదు. కాంగ్రెస్‌లో నెహ్రూ వారసులను స్మరిస్తూ పోవాలి. రేవంత్ రెడ్డి కూడా ఇలా చేయాల్సిందే. చేయకుండా ఉండలేరు కూడా. అందుకే తెరపైకి రాజీవ్ విగ్రహం వచ్చి చేరింది. గతంలో వైఎస్ కూడా ఇలాగే చేశారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఎపిలో రాజధానిగా ఉన్న హైదరాద్ నెక్లెస్ రోడ్డును అందంగా తీర్చి దిద్దారు. పార్కులు కట్టారు. ఇలా ప్రసాద్ ఐ మాక్స్ పక్కన చక్కని సర్కిల్ ఏర్పాటు చేసి, పూలవనంగా తీర్చి దిద్దారు. వైఎస్ సిఎం అయ్యాక అక్కడ ఇందిరాగాంధీ విగ్రహం పెట్టారు. ఇప్పుడు అక్కడ ఆ విగ్రహం ఉంది. విమానాశ్రయానికి రాజీవ్ పేరు పెట్టారు. క్రికెట్ స్టేడియానికి కూడా రాజీవ్ పేరు పెట్టారు. ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే స్వామిభక్తి చాటుకునేందుకు ఇలాంటి పనులన్నీ చేస్తూ పోవాలి. ఈ క్రమంలోనే ఇప్పుడు రేవంత్ వంతు వచ్చింది. అందుకే సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహం పెట్టాలని తనవంతుగా భక్తిని చాటుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ నిర్ణయాన్ని సహజంగానే బిఆర్ఎస్ వ్యతిరేకించింది. తాము మళ్లీ అధికారంలోకి రాగానే విగ్రహాన్ని తొలగిస్తామని, రాజీవ్ పేరు ఉన్న విమానాశ్రయానికి లోకల్ లీడర్ల పేరు పెడతామని కెటిఆర్ ఘాటుగానే హెచ్చరించారు. రాజీవ్‌కు తెలంగాణకు సంబంధమేమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రాజీవ్ జయంతి సభ వేదుకగా ఘాటు విమర్శలు చేశారు. రాజీవ్ విగ్రహం పెడితే తొలగిస్తామని కొందరు మాట్లాడుతున్నారు, 'చేతనైనే ఆ విగ్రహాన్ని టచ్ చేయండి.. అంతు చూస్తాం' అని సిఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. అధికారం పోయినా బిఆర్ఎస్ నాయకుల్లో కొందరికి అహంకారం తగ్గడం లేదని కూడా మండిపడ్డారు. పనిలోపనిగా సచివాలయం ఎదుట కెసిఆర్ విగ్రహాన్ని పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీరు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని కూడా బిఆర్ఎస్‌ను ప్రశ్నించారు. పదేళ్లలో ఏనాడూ విగ్రహం పెట్టాలన్న ఆలోచన రాని వాళ్లకు ఈరోజు రాజీవ్ విగ్రహాన్ని పెడితే ప్రశ్నించే నైతిక హక్కు లేదని అన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం కూడా పెడతామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఈ విగ్రహాన్ని సచివాలయం లోపలే పెడతామని కూడా స్పష్టం చేశారు. రాజీవ్ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తాం అంటూ..కొంచెం పరుష పదజాలంతోనే విమర్శలు చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తామని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం సామాజిక బహిష్కరణ చేస్తుందని హెచ్చరించారు. రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మంగళవారం ప్రారంభించాలని ముందుగా నిర్ణయం తీసుకున్నా మని, కానీ, ఇంకా కొన్ని పనులు మిగిలి ఉండటం మూలంగా దానిని వాయిదా వేసుకున్నామని తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహం అమరవీరుల జ్యోతి పక్కన ఉండటం సముచితం అనికూడా సమర్థించుకున్నారు. అలాగే రాజీవ్ దేశానికి చేసిన సేవల గురించి కూడా ప్రస్తావించారు. చివాలయం ముందు దొంగలకు, తాగుబోతులకు స్థానం లేదని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి విమర్శలు కూడా చేశారు. ఇదే సందర్భంలో పలు విమర్శలు కూడా చేశారు. ఎన్నికల సమయంలో ఇలాంటి భాష వాడితే తప్పులేదు. కానీ ఇప్పుడు ఇలాంటి భాష అవసరం లేదు. అలాగే రాజీవ్ విగ్రహం కూడా అవసరం లేదు. సచివాలయం ముందు ఇంకెవరిదైనా... లేకపోతే ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారి విగ్రహం పెట్టివుంటే హుందాగా ఉండేది. తెలంగాణ ఆకాంక్షలకు అనుగుణంగగా ఉండేది. రాజీవ్‌కు ఇప్పుడు కొత్తగా ఇవ్వాల్సిన గౌరవం ఏమీ లేదు. ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కింది. అదే సందర్భంలో సిఎంగా ఉన్న రేవంత్ రెడ్డి నిగ్రహంతో ఉండాలి. పరుషంగా మాట్లాడడం వల్ల సిఎం హుందాతనాన్ని కోల్పోతారు. ఇదికూడా గమనించాల్సి ఉంది.

# పాలకుల తీరుపై చైతన్యం కావాలి !

ఒక్కసారి అధికారం చేపడితే మరోమారు దానిని కాపాడుకుని ఓట్లు పొందదమెలా అన్న సూత్రం..అన్నీ రాజకీయ పార్టీలు అవలంబిస్తున్నాయి. ఇందుకు బిజెపి భిన్నంగా ఏమీ లేదు. ప్రాంతీయ పార్టీల తీరులోనే బిజెపి కూడా ఆలోచిస్తోంది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి మరోమారు కేంద్రంలో పగ్గాలు దక్కించుకోవాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఎన్‌డిఎలో కొత్త మిత్రులను చేర్చుకోవాలని ఉబలాట పడుతోంది. అలాగే పదేళ్ళ అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమితో గద్దెనెక్కాలని చూస్తోంది సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నా ..కలసివచ్చే ప్రాంతీయ పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతోంది. కూటమిలోని ప్రాంతీయ పార్టీల డిమాండ్లకు తలొగ్గి పనిచేస్తోంది. ఇకపోతే గత ఐదేళ్లుగా ఎపిలో చేతికి ఎముకే లేదన్న చందంగా ఖజానాను ఊడ్చిపెట్టిన జగన్ ఇప్పుడు మరోమారు అధికారం కోసం ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. నిజానికి రాష్ట్రం అభివృద్ధి జరిగివుంటే ప్రజలు అడక్కుండానే ఓట్లేస్తారు. కేవలం డబ్బులు పంచడమే పాలన అన్న చందంగా జగన్ పాలన సాగింది. దీంతో ఎపి కూడా అప్పులకుప్పగా మారింది. తెలంగాణలె నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ ఊదరగొట్టి ప్రజలను వంచించిన కెసిఆర్‌ను, ఆయన పార్టీని ప్రజలు మొన్నటి ఎన్నికల్లో దించేసారు. ఇప్పుడు ఎంపి ఎన్నికల్లో నాలుగైదు సీట్లు సంపాదిస్తే తప్ప ప్రజలు ఆదరించరు. నాయకులు కలసి ఉండరు. అందుకే కెసిఆర్ ఊతకర్ర పట్టుకుని అడుగులు వేస్తున్నారు. రాజకీయ నాయకుల సరికొత్త రాజకీయాల కారణంగా ప్రజల సమస్యలు పక్కకు పోతున్నాయి. రాజకీయనేతలు..వారి సమస్యలు ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. రాజకీయాల్లో కక్షసాధింపు వ్యవహారాలు మిన్నంటాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అయినా.. ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో అయినా కక్షసాధింపు రాజకీయాలు సాగుతున్నాయి. తమ ఆలోచనలకు అనుగుణంగా సాగడం..ప్రజల గురించి పట్టించుకోక పోవడం.. ప్రశ్నించిన వారిని కేసులు పెట్టి వేధించడం పరిపాటిగా మారింది. ఎపిలో అయితే దాడులు, కేసులు, హత్యలు నిత్యకృత్యంగా మారాయి. తాజాగా వివేకానంద కేసులతో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరి తండ్రిపై దాడి జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. నేతల్లో నిజాయితీ లోపించిందన్నది నూటికినూరుపాళ్లు నిజం. నిజానికి అవినీతి కావచ్చు, అక్రమాలు కావచ్చు... అందరినీ ఒకే గాటన కట్టే పాలన రావాలి. రాజకీయ లబ్ది కోసం చేసే ప్రయత్నాలను ప్రజలు ఎప్పుడూ హర్షించరని గుర్తించాలి. బెయిల్‌పై ఉన్న జగన్ సిఎం గద్దెనెక్కినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలి. ఇలా అనేకానేక కేసులను పక్కన పెట్టారు. బ్యాంకులను దోచుకున్న వారు ఎందరో దర్జాగా తిరుగుతున్నారు. అందుకే తమైదన రీతిలో పాలనలో రాటుదేలిన పాలకులు ప్రజా ఉద్యమాలకు పెద్దగా జంకడం లేదు. వాటిని కఠినంగా అణచివేసే విధానాలు బాగా వంటబట్టించుకున్నారు. తమ విధానాలతో కార్పోరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చే లక్ష్యంతో పాలనా వ్యవహారాలను నడుపుతున్నారు. రాష్ట్రాల్లో కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారు. వారికి పనులు అప్పగిం చడం..అందులో లాభాలు పొందడం అలవాటు చేసుకున్నారు. కాళేశ్వరం అవినీతిలో ఇదే జరిగింది. కార్పోరేట్ సంస్థలు విదులుస్తున్న డబ్బులతో అధికారంలోకి రావడ.. వారి కోసం ప్రభుత్వ పరంగా చేయాల్సని పనులు చక్కబెట్టడం రివాజు గా మారింది. ప్రాంతీయ పార్టీలైనా, దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్నానని బీరాలు పలికే బిజెపి అయినా.. కార్పోరేట్లకు దాసోహం అంటోంది. ఎన్నికలకు ముందు ప్రజలను మచ్చిక చేసుకోవడం.. డబ్బులు పంచడం...అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచే పనులు చేయడం దేశంలో అలవాటుగా మారింది. దీనికి ఘనమైన ప్రజాస్వామ్య ముసుగు వేస్తున్నారు. అమరావతి రాజధానిని కొనసాగించాలని రైతులు ఉద్యమిస్తున్నా సిఎం జగన్ పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు భర్తీ చేయండనో లేదా ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని తెలంగాణలో చేస్తున్న ఆందోళనలను గులాబీ బాస్ కెసిఆర్ ఖాతరు చేయలేదు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో అయినా ఏ ప్రభుత్వం ఉన్నా.. ప్రజాందోళనలను పట్టించుకోక పోవడం అన్నది ఓ విధానంగా మారింది. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా..తమకు అనుకూల మైన విధానాలను అవలంబిస్తూ ప్రజా సంక్షేమం అన్న ముసుగు కప్పి అధికారం చెలాయిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలు అయినా,జాతీయ పార్టీలు అయినా, కమ్యూనిస్టులు అయినా భారతగడ్డపై ప్రజల కోసం పాటుపడే పార్టీలులేవని తేలిపోయింది. మనపాలకులు బ్రిటిషర్ల కన్నా దారుణమైన అణచివేత విధానాలను అలవర్చుకున్నారు. వారి కన్నా కొంచెం కనికరముండేదేమో.. అభివృద్ధి పట్ల వారికున్న చిత్తశుద్ధి నేటి పాలకులకు లేకపోవడం విచారకరం. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలనే సంకల్పం వైసీపీ ప్రభుత్వానికి ఏ కోశాన కూడా లేదు. విశాఖ రైల్వేజోన్ గాలికి పోయింది. ప్రత్యేక హోదా ఊసే లేదు. అయినా ప్రజలకు ఆ స్పృహ కూడా లేదు. ఉన్నా పోరాడే శక్తి లేదు. పోరాడినా పోయేవి ప్రాణాలే తప్ప మరోటి కాదని పాలకులు తేల్చేశారు. ఆందోళనలను పట్టించుకోవడం లేదు. అందుకు అమరావతి, రైతు ఉద్యమం నిదర్శనంగా చూడాలి. ప్రజాందోళనలను పట్టించుకోక పోవడం అన్నది తెలంగాణలో కెసిఆర్ రాకతో మొదలయ్యిందనే చెప్పాలి. ప్రజాందోళనలు పట్టించుకోకపోవడం, ఖాతరు చేయకపోవడం అన్నది అలవాటుగా చేసుకున్నారు. ఎన్నికలప్పుడు ప్రజలు గొర్రెల్లాగా ఓట్లు వేస్తారని కూడా ప్రగాఢమైన నమ్మకం తో ఉన్నారు. ప్రజల ఆందోళనలతో ప్రభుత్వాలను నిలదీ యడం సాధ్యం కాదని కూడా ప్రజలు గుర్తించా లి. ఓటు వేసే సమయంలో పడ్డ కక్కుర్తి కారణంగా ప్రజలు మోసపోతున్నామని గుర్తించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. నిజాయితీ కలిగిన నేతలను గుర్తించాలి. అందుకు ఓటర్లు ముందుగా చైతన్యం కావాలి.

# ఉచిత పథకాలపై ప్రజలే నిలదీయాలి !



అధికారం కోసం పాలకులు ప్రజలను ఓటు బ్యాంకుగా చేసుకుని పథక రచన చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పథకాలను రూపొందిస్తున్నారు. సంక్షేమం అన్న ముసుగు తగిలించి దేశ, రాష్ట్ర ఖజానాలను గుల్ల చేస్తున్నారు. లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు. ఇలాంటి దుబారా పథకాలను నిలవరించాలి. ప్రజలు కూడా నిలదీయాలి. తమ చేతికి ఎముక లేదన్నట్లుగా నగదు జమ చేస్తున్నారు. ఏపిలో అయితే బటన్ నొక్కుడు..నగదు జమచేయడం నిత్యకృత్యంగా మారింది. తెలంగాణలో కూడా గత ప్రభుత్వం దళితబంధు, రైతుబంధు వంటి పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టింది. అధికారం పోయాక ఇప్పుడు అవే పథకాలు అమలు చేయాలంటూ ప్రజలను రెచ్చగొడుతోంది. ఇది అభివృద్ధి, సంక్షేమం ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పథకాలపై ప్రజలే నిలదీసేలా చైతన్యవంతులు కావాలి. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదీసే రోజులు రావాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే..పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారం లోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాల హామీలను గుప్పిస్తున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలతో దేశ,రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు చేస్తున్నారు. దీనికి కాంగ్రెస్, బిజెపిలతో పాటు ప్రాంతీయ పార్టీల నేతలంతా బరి తెగిస్తున్నారు. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్భాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. 75 ఏళ్లు దాటినా ఇంకా పేదల పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇలా నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ఉండడం లేదు. ఉపాధి, ఉద్యోగావకాశాలను బలోపేతం చేసే చర్యలు చేయడం లేదు. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మే స్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యంలాంటి పథకాలన్నీ దండగమారివే అయినా కొనసాగి స్తున్నారు. గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ మార్పులకు నాంది ప్రస్తావన కావాలి. పేద ప్రజలకు తాము అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్ధిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికలవేళ చేస్తున్న వాగ్దానాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెటును మించి ఉంటున్నా యని, ఇలాంటి జనాకర్షక హామీలను గుప్పించడం తీవ్రమైన అంశమని గుర్తించాలి. గతంలో సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి అభిప్రాయమే వెలిబుచ్చింది. [illegible] ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో నిలదీయాలి. తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వానికి అవకాశం లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ఎలా అన్నదే ప్రస్తుతం ఉన్న సమస్య. ఎన్నికలకు ముందు ప్రజానిధులతో ఉచిత తాయిలాలు ప్రకటిస్తూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల ఎన్నికల గుర్తును స్తంభింపజేయాలని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల ముందు మరోమారు ఈ సమస్య చర్చ కావాలి. ఉచితాలపై ప్రజలే నిలదీయాలి. మనకెందుకు లే అని అనుకుంటే మనలను నిండా ముంచుతారు. అందుకు తెలంగాణాలో కెసిఆర్ ఏలుబడే చక్కటి ఉదాహరణ. ఏపిలో జగన్ పాలన కూడా అందుకు ఉదాహరణలే. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న తీరును ప్రజలు చైతన్యవంతులు ఎక్కడిక్కడ నిలదీయాలి. ఈ ఎన్నికల్లోపే ఇది చేయగలమా? వచ్చే ఎన్నికల వరకైనా చేయగలమా? అన్నది ఆలోచించాలి. ఉచిత హామీలకు అయ్యే ఖర్చు సాధారణ బడ్జెటును మించిపోతోందని గతంలో సుప్రీం సిజె గా పనిచేసిన జస్టిస్ ఎన్వీ రమణ చేసిన వ్యాఖ్యలు మననం చేసుకోవాలి. ఓటర్ల నుంచి రాజకీయ లబ్ధి పొందడం కోసం అనుసరిస్తున్న జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని కూడా అప్పట్లో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అంటూ...మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఎన్నికల సంఘానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా తనకుతాను నియమావళిని నిర్దేశించుకుని రాజకీయ పార్టీలను కట్టడి చేయాల్సి ఉంది. అధికారం కోసం... అధికార వనరులపై పెత్తనం కోసం రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలుగా చెప్పుకోవాలి. ఏపిలో నిరంతరాయంగా డబ్బుల పంపిణీ కార్యక్రమం మనకు కళ్లకు కనపడుతోంది. జగన్ తనతాత ముత్తాతలు సంపాదించిన ఆస్తి నుంచి పంచి పెడుతున్నట్లుగా ఏపిలో బొక్కసం ఖాళీ చేస్తున్నారు. కెసిఆర్ కూడా అప్పులతో ఆస్తులు సృష్టించానని చెప్పి తెలంగాణను అప్పుల కుప్పగా తయారు చేశారు. ఈ అప్పులు తీర్చడానికి వేలకోట్లు వడ్డీలకే చెల్లించాల్సి రావడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి నేతలను నమ్మితే మనలను మనం అంగట్లో అమ్ముకోవడం తప్ప మరోటి కాదు. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారం లోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదను హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడీతో సహా కెసిఆర్, జగన్, మమత బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సిఎంలంతా ఇందుకు అతీతులు కాదు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడు కోవాలన్న ఆత్రంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. విద్య,వైద్యం అందకుండా పోతోంది. రవాణా మార్గాలు నేటికీ అభివృద్ధి జరగడం లేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా కొత్తకొత్త ఉచిత పథకాలు వచ్చి చేరుతున్నాయి. ఖర్చుల భారం పెరగ డంతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసేస్తున్నారు. అదేమంటే అభివృద్ధికి అప్పులు తప్పవంటున్నారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న ఉచిత పథకాల వ్యాప్తిని చక్కదిద్దేందుకు చర్చించాలి. రాజకీయ పార్టీలను నిలదీయాలి. లేకుంటే వారు మనలను అప్పులకు బాధ్యులుగా చేయగల సమర్థులు.

## మసకబారుతున్న సిబిఐ సమర్థత

**కేసులను తేల్చడంలో నిర్లక్ష్యం**

**ఐదేళ్లయినా కొలిక్కిరాని వివేకా హత్యకేసు**

**కడప:** సిబిఐ చేపడుతున్న కేసుల్లో ఎన్ని నిజాలు నిర్ధారణ అయ్యాయో తెలియడం లేదు. ఎన్ని కేసులు బయటకు వచ్చాయో తెలియడం లేదు. ఇటీవలి కాలంలో కొన్ని కేసులు మాత్రం కేవలం బెదిరింపులకే పరిమితం అవుతున్నాయి. లిక్కర్ కేసులో నిజాలు రాబట్టలేకపోయారు. అంతెందుకు ఐదేళ్లయినా వైఎస్ వివేకాను హత్య చేసిన వారెవరో తేల్చలేదు. నిర్ధారించలేదు. సరికదా కేసును కొలిక్కి తీసుకుని రాలేదు. ఈ కేసులో ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న వారంతా అమయకులని సిఎం జగన్,సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. సొంత చిన్నాన్న హత్యకేసును కొలిక్కి తేవాలన్న దక్షత కూడా లేకుండా పోయింది. నిజానికి అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం సిఐడిని ఉపయోగించి అనేకానేక కేసులను తవ్వుతూ..అనుమానం ఉన్నవారినల్లా బొక్కలో తోస్తోంది. కానీ వివేకానంద రెడ్డి హత్య కేసులో మాత్రం మిన్నకుంటోంది. ఇక్కడే అందరికీ అనుమానాలు వస్తున్నాయి. సొంత చిన్నాన్న హత్య కేసును ఛేదించలేని చేవ చచ్చిన పాలకుడిగా జగన్ ప్రజల ముందు నిలిచాడు. మానాన్నను చంపినవాళ్లను ఇంకెప్పుడు పట్టుకుంటారని దారుణ హత్యకు గురైన వై.ఎస్. వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి అడిగిన సూటి ప్రశ్నకు నేటికీ సమాధానం దొరకలేదు. సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని స్వయంగా ఆమె ఆవేదన వ్యక్తంచేయడం కూడా జగన్ వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ఈ కేసును హైదరాబాద్‌కు బదలాయించిన తరవాతనే కొంత కదలిక వస్తోంది. అయినా సిబిఐ కూడా దీనిని తేల్చలేక పోయింది. వివేకా హత్యను ఎవరో కానీ చాలా తెలివిగా చేశారని అనిపిస్తోంది. ఎవరికీ చిక్కకుండా ఉంటున్న చిక్కడు దొరకడు ఎవడో సిబిఐ కూడా పట్టుకోలేక పోతున్నది. అంటే పక్కా ప్రణాళికతోనే చేశారని అనుకోవాలి. ఆనవాళ్లు లేకుండా..అనుమానాలు రాకుండా...విచారణలో దొరక్కుండా హత్యను చాలా పక్కగా చేశారని అర్థం అవుతోంది. సిబిఐ కూడా ఈ విషయంలో కూపీలాగ లేకపోతున్నది. మరోవైపు సిబిఐ విచారణలో భాగంగా అవినాశ్ రెడ్డిని విచారించడం తో వైసిపి ఎందుకనో ఉలిక్కిపడుతోంది. అవినాశ్ రెడ్డి అమాయకుడని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. రాజకీయంగా అడ్డు తొలగించుకునేందుకే వివేకాను హత్య చేశారన్న ప్రాథమిక అంచనా అంటూ ప్రచారం సాగుతోంది. ఇది నిజమా కాదా అన్నది సిబిఐ దర్యాప్తులో బట్టబయలు కానుంది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో సిఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, అవినాశ్ రెడ్డిలకు మాత్రం కేసును త్వరగా తేల్చి నిందితులను పట్టుకోవాలన్న పట్టుదల ఎక్కడా కానరావడం లేదు. పులివెందులలో తమ బంధువులు కాకుండా బయటి వ్యక్తులు వచ్చి హత్య చేసే అవకాశమే లేదని కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిపై తనకు అనుమానం ఉందని డాక్టర్ సునీత.. గతంలోనే చెప్పారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఎటూ తేల్చకపోవడంతో సిబిఐ పనితీరుపైనా అనుమానాలు పెరుగు తున్నాయి. నిజానికి వివేకా పట్ల గౌరవం ఉండివుంటే ఈ కేసులో సిఎం జగన్ సీరియస్‌గానే స్పందించి ఉండేవారు. డాక్టర్ సునీత ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం చెప్పవలసి వస్తుందనే మౌనంగా ఉంటున్నారా అన్నది కూడా అర్థం కావడం లేదు. కోడికత్తి కేసు కూడా ఇలాగా నీరుగారి పోతోంది. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వివేకా హత్య కేసును ఛేదిస్తారని అంతా భావించారు. కానీ నీరుగార్చే ప్రయత్నాలను ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చేశారన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. ఎందుకంటే చంద్రబాబు హయాంలో హత్య కేసును దర్యాప్తు చేయడానికి నియమితులైన అధికారులను జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బదిలీ చేశారు. వారిలో కొందరికి పోస్టింగులు కూడా ఇవ్వలేదు. హత్య కేసును నీరుగారుస్తున్నారన్న అనుమానం రావడంతో వివేకా సతీమణి హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త హత్య కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆమె న్యాయస్థానాన్ని వేడుకున్నారు. సీబీఐ దర్యాప్తు విషయంలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తు కోసం హైకోర్టులో పిటిషన్ వేసిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక సీబీఐ దర్యాప్తు అవసరం లేదని ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలు చేయడం జరిగింది. దీంతో కేసును త్వరితగతిన ఛేదిస్తారని అంతా భావించారు. కానీ అలాంటిదేమీ లేకుండా పోయింది. సొంత బాబాయ్‌ని దారుణంగా చంపినవారిని పట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఆధీనంలోని పోలీస్ శాఖ ఎందుకు విఫలం అయ్యిందనేదానికి సమాధానం లేదు. అలాగే హత్య ఎవరు చేశారో..ఎందుకు చేశారో పక్కన పెడితే జగన్‌కు ఇందులో ఆసక్తి లేకుండా పోయిందన్నది వాస్తవం. అందువల్ల ఆయన ఈ కేసును పెద్దగా పట్టించుకోవడం లేదు. వైఎస్ షర్మిల కూడా విచారణ జరగాలని కోరుకుంటున్నారు. దోషులు పట్టుబడాల్సి ఉందంటున్నారు. కానీ కుటుంబంలో ఎక్కడా వివేకానంద మర్డర్‌పై సీరియస్‌గా మద్దతు దక్కడం లేదు. ఈ హత్య కేసులో సిబిఐ విచారణ ద్వారా నిజాలు వస్తాయని భావించినా..సిబిఐ కూడా తేల్చలేకపోయింది.

# దేశ హితం కోసమే ఉమ్మడి పౌరస్మృతి !

ఉమ్మడి పౌరస్మృతి అనగానే రాజకీయపార్టీలు, మత ఛాందసవాదులు గొంతు చించుకోవడం అలవాటు చేసుకున్నారు. ప్రజలందరి రక్తం ఒక్కటే అంటున్న కమ్యూనిస్టులు సైతం ద్వంద్వ నీతిని అవలంబి స్తున్నారు. దురాచారాలను అణచివేసే క్రమంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్న భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతి ఓ ఆవశ్యకతగా గుర్తించాలి. గతంలో ఎన్నో దురాచారాలను మనం రూపు మాపుకున్నాం. బాల్య వివాహాలను రద్దు చేశాం. సతీసహగమనాన్ని రద్దు చేశాం. అలాగే అనేక మార్పులకు ప్రపంచం లోనవు తున్న వేళ ప్రజలకు చట్టం అన్నది ఒకే రకంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి పౌరస్మృతి అంటే మతపరమైన అచారాలు, సంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగం పరిధిలో ఉన్న పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయడం. ఈ దేశంలో పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, పిల్లలను దత్తత తీసుకోవడం, జీవన భృతి లాంటి విషయాలకు సంబంధించి చట్టాలు అందరికీ ఒకేలా లేవు. పౌరులు ఆచరించే మతం, విశ్వాసాల ఆధారంగా వేర్వేరుగా ఉంది. అయితే మతంతో సంబంధం లేకుండా, లింగ భేదాల్లేకుండా భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తింపజేయడమే యూనిఫాం సివిల్ కోడ్. ఈ డిమాండ్ దేశానికి స్వాతంత్ర్యం÷–ర వచ్చిన నాటి నుంచే ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 కూడా ఇదే చెబుతోంది. దేశ పౌరులకు యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకొచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశిక సూత్రాల రూపంలో రాజ్యాంగం సూచిస్తోంది. ఇప్పటి వరకు దేశంలో ప్రజాచట్టాలకు భిన్నంగా మతపరమైన చట్టాలున్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. అయితే ఉమ్మడి పౌరస్మృతిలో ఎవరికి వాళ్లుగా అమలు చేసుకునే చట్టాలు చెల్లవు. దాంతో చాలా కాలంగా దేశంలో మైనారిటీ అయిన ముస్లింలు యూనిఫావ్ సివిల్ కోడ్‌ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఉమ్మడి పౌరస్మృతి అంశంపై చర్చ మొదలయ్యింది. 2019లో ట్రిపుల్ తలాక్‌ని నేరంగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. యూనిఫామ్ సివిల్ కోడ్ వచ్చే దాకా దేశంలో లింగ సమానత్వం సాధ్యం కాదనే వాదనలున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి వల్ల దేశంలో సమానత్వం లభిస్తుంది. కొత్త సమస్యలు పుట్టుకొస్తాయని చెబుతున్న వారంతా కేవలం ఓటు బ్యాంక్ రాజకీయ ప్రయోజనాలు ఆశించేవారుగానే చూడాలి. పౌరులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించేందుకు, అనుసరించేందుకు, వ్యాప్తి చేసేందుకు వీలుంది. దీనిని ఎవరూ కాదనడం లేదు. చట్టం విషయంలోనే మతాల ఆధారంగా ఉండరాదన్నది ఆకాంక్ష. అయితే భిన్న మతాలు, నమ్మకాలున్న భారత్ లాంటి పెద్ద దేశాల్లో ఉమ్మడి సివిల్ కోడ్స్ ద్వారా అందరినీ ఏకం చేయడమనేది ఎంతో కష్టమైన విషయం అన్న వాదన తెస్తున్నారు కొందరు.

హిందువులైనా, ముస్లింలైనా వాళ్లలో వాళ్లకు అనేక భిన్నమైన నమ్మకాలు, విశ్వాసాలు ఉంటాయి. అవి వేరు..చట్టాలు వేరని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మిందువుల్లోనూ భిన్న ఆచారాలు, సంప్రదాయాలు పాటించే వాళ్లున్నారు. ముస్లింలలోనూ షరియా చట్టాలను పాటించని వాళ్లున్నారు. బోరా ముస్లింలు ఆస్తుల వారసత్వం విషయంలో హిందువుల చట్టాలను అనుసరిస్తుంటారు. ఆస్తుల వారసత్వం విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా చట్టాలున్నాయి. ఇక క్రైస్తవులు మెజారిటీగా ఉండే నాగాలాండ్, మిజోరం లాంటి రాష్ట్రాలు తమకంటూ ప్రత్యేకమైన సివిల్ చట్టాలను రూపొందించుకున్నాయి. వాటికి ఆధారం వారి సంప్రదాయాలే గానీ మతం కాదు. గోవాలో 1867 నాటి కామన్ సివిల్ కోడ్ అమల్లో ఉంది. కానీ క్యాథలిక్స్, ఇతర మతస్థులకు భిన్నమైన నియమాలున్నాయి. భారత్‌లో పౌర స్మృతులు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. హిందువుల్లో కొడుకులతో సమానంగా కూతుళ్లకు వారసత్వ ఆస్తిలో వాటా పొందేలా 2005లో చట్టాలను సవరించారు. కానీ దీని కంటే ముందే పలు రాష్ట్రాలు మహిళలకు వారసత్వ ఆస్తిలో వాటా హక్కును కల్పిస్తూ చట్టాలు చేశాయి. ఇలా రాష్ట్రానికో చట్టం, మతానికో చట్టం,ప్రాంతానికో చట్టం ఉండడం వల్ల గందరగోళంగా ఉంది. దీనిని తొలగిస్తే తప్ప దేశంలో ఏకీకరణ సాధ్యం కాదు. ప్రజల్లో ఐక్యత రాదు. ఉమ్మడి పౌరస్మృతి తమ మతంపై, సంస్కృతిపై దాడి అని ముస్లింలు సహా మిగతా మైనారిటీ వర్గాలు చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందకంటే మతం ఆధారంగా చట్టాలు చేస్తూ పోతే ఇప్పటికే దేశం కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజింపబడింది. మతం లాంటి వ్యక్తిగత విషయాల్లో ప్రభుత్వ జోక్యం చేసుకోవాలని ప్రభుత్వం కూడా భావించడం లేదు. గడిచిన 40 ఏళ్లలో భిన్న తీర్పుల్లో భాగంగా దేశ సమైక్యత కోసం యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకు రావాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు సూచిస్తూ వచ్చింది. డెబ్బయి అయిదేండ్ల స్వాతంత్ర్యంలో ఆర్థిక అసమానతలు అంతరించకపోగా పెరిగాయి. సామాజిక అసమానతలు అలానే ఉన్నాయి! స్త్రీలను ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నారు. వారికి గౌరవం దక్కడం లేదు. ఉండటానికి కూడు, గుడ్డ, నీడ సమకూర్చనేలేదు. ఉమ్మడి పౌరస్మృతి అనగానే మతపరమైన అంశమని, అదీ మన ప్రత్యర్థి మతాన్ని నియంత్రించేదన్న ప్రచారం వాడుకలోకి తెచ్చారు. కానీ ఇది అన్ని మతాలకూ, అందరు ప్రజలకూ సంబంధించినది. అందుకనే చాలా జాగ్రత్తగా ఆలోచన చేయాలి. అందరూ సమానంగా వ్యవహరించటానికి మన రాజ్యాంగమూ అందరికీ అన్ని హక్కులనూ కల్పిస్తున్నది. అలాంటప్పుడు చట్టాలు అందరికీ ఒకేలా కాకుండా కొందరికి మరోలా ఉండడం వల్ల సమాజంలో అసమానతలు ప్రబలుతాయి. మా చట్టం మాకు చెల్లదని ధిక్కరించే సంస్కృతి వస్తుంది. దీనిని అధిగమించి ప్రజలంతా ఒక్కటే..అందరికీ ఒకటే చట్టం అన్న భావన ఉంటే సమానభావం అలవడుతుంది. అందుకు ఉమ్మడి పౌరస్మృతి అవసరమే.

## స్థూలకాయంతో గుండెపై ప్రభావం

**ఆహారపు అలవాట్లు మార్చుకోవాల్సిందే**



**న్యూఢిల్లీ :** స్థూలకాయాన్ని వ్యాధిగా పరిగణించాలి. దీని ప్రభావం గుండెపై ఉంటుంది. గుండెపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. గుండె ఆరోగ్యం దెబ్బ తింటే శ్వాస వ్యవస్థ పాడై, శ్వాస పీల్చుకోవడంలో అనేక ఇబ్బందులు పడతారు. గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల ధమనుల్లో ఇబ్బందులు ఏర్పడతాయి. స్థూలకాయం వలన శరీరం బరువు పెరగడంతో కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడతారు. బరువులు ఎత్తినప్పుడు కీళ్లలో నొప్పి మొదలవుతుంది. శరీర బరువు మరింత పెరిగితే, అప్పుడు కీళ్ళపై భారం పడుతోంది. కీళ్లు, పాదాల ఆరోగ్యం చెడిపోకుండా మొదటి నుంచి బరువు అదుపులో ఉంచుకోవాలి. శరీర కొవ్వును ఖచ్చితంగా కొలవడం చాలా కష్టం. బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ) ఆరోగ్యకరమైన బరువును నిర్ణయించడానికి ఒక ప్రసిద్ధమైన మార్గం. భారతదేశంలో బి.ఎం.ఐ 23 కంటే ఎక్కువ ఉంటే, అప్పుడు అధిక బరువుగా పరిగణిస్తారు. అయితే బి.ఎం.ఐ స్థాయి 30 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు ఆ పరిస్థితిని ఊబకాయం అంటారు. ఈ స్థూలకాయాన్ని తేలికగా తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారు. వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరిస్తారు. శరీరంలోని ముఖ్యమైన అవయవాలు కిడ్నీ, కాలేయంలో కొవ్వు పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కొవ్వు ఒక రకమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ కారణంగా కిడ్నీ, కాలేయం పని తీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ అవయవాలు సరిగా పనిచేయలేవు. కొవ్వు పట్టిన కాలేయానికి తగిన చికిత్స చేయకపోతే కాలేయం విఫలమై ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఊబకాయం ఉన్నవారిలో తక్కువ స్పెర్మ్ ఉత్పత్తి అవుతుంది. పెరిగిన శరీరం. చక్కెర అధికంగా ఉత్పత్తి చేస్తూ మధుమేహం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందుకే పిల్లల్ని సాధ్యమైనంతవరకు ఆటల వైపు దృష్టి మళ్లించాలి. పెద్దవాళ్లువ్యాయామం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచిస్తున్నారు.

## వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

**జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న వైద్యారోగ్యశాఖ**



**విశాఖపట్టణం:** యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాటులో ఉండే ఆర్‌ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

## కోతుల బెడదతో ప్రజల ఆందోళన

**వరంగల్:** కోతుల బెడద నివారించేందుకు అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచాలని, కోతులను అడవులకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. కోతులు పట్టేవారిని ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పిస్తే గ్రామాల్లో బెడద ఉండదని అంటున్నారు. అలాగే పంటపొలాలకు కూడా నష్టం ఉండదని అంటున్నారు. అయితే కోతులకు అడవుల్లో ఆవాలసాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి గ్రామాల్లో కోతులకు ఆవాసం లేకుండా చేయాలి. అడవుల్లో నేరేడు, సీతాఫలం, వెలగ, రేగు, మారేడు వంటి పండ్ల మొక్కలు నాటాలనిని చెప్పారు. ఇదిలావుంటే అడవుల్లో కోతులకు అనుకూల వాతావరణం కల్పించి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అంటున్నారు. ఏరియాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పెంచుతున్నట్లు గతంలో చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయితే అవేవీ సాధ్యం కాలేదు. ఇదంతా ప్రచారానికి పరిమితం అయ్యింది. ఇప్పటికే అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలు పని చేస్తున్నాయని, అటవీ నర్సరీలు ఉన్న గ్రామ పంచాయతీలు మినహాయించి మిగతా పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కొక్క నర్సరీకి జనాభా, ఇళ్ల సంఖ్య ఆధారంగా 25 వేల నుంచి లక్ష మొక్కలు పెంపకానికి లక్ష్యాలను నిర్దేశిరచినట్లు వివరించారు. అటవీ శాఖకు 40 లక్షలు, గ్రామ పంచాయితీల నుంచి 98 లక్షలు చొప్పున హరితహారం కార్యక్రమానికి మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల్లో 25 శాతం అటవీ పండ్ల మొక్కల పెంపకాన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హరితహారం ద్వారా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. కానీ కోతుల బెడద నివారణకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.



# శ్రామిక శక్తిని క్యాష్ చేసుకుంటున్న పారిశ్రామికవేత్తలు



**న్యూఢిల్లీ :** ఏటేటా కార్మిక దినోత్సవాలు జరుపుకుంటూ,,మేడే ఉత్సవాలు నిర్వహిస్తున్నా కార్మిక రంగం మాత్రం పురోగతి సాధించడం లేదు. కార్మికుల శ్రమశక్తితో ఎదుగుతున్న వారు వారిని పట్టించుకోవడం లేదు. గతం కన్నా మిన్నగా శ్రమదోపిడీ ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కానవస్తోంది. యాంత్రికయుగం రాక ముందు మనిషి గంటలకొద్దీ పనిచేసేవాడు. అదొక బానిస బతుకు. మనిషి తన విజ్ఞాన పరిశోధనల మూలంగా యంత్రాలను సృష్టించుకున్నాడు. యాంత్రిక యుగంలో క్యాపిటలిజం ఏవిధంగా పెరిగిందో అదే స్థాయిలో సామాజిక స్పృహ, చైతన్యం కూడా పెరిగాయి. అందువల్లనే పనిగంటల పోరాటం వచ్చింది. కానీ భారతదేశంలో చికాగో కంటే ముందే, కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటివరకు ఆ రైల్వే కార్మికులు 10 గంటలు పనిచేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలకవర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పనిచేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు. 1923లో మొదటిసారి భారతదేశంలో 'మే డే'ను పాటించడం జరిగింది. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటినుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటినుండి 'మే డే'ను పాటించడం జరుగుతుంది. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ఈనాడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో విద్యావంతులైన యువత ఈనాడు శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఈనాడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవ ర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలి స్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలులో లేవు. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమి రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. ఆ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైన పీడక వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.


# ప్రాంతీయ పార్టీల మనుగడపై బిజెపి దెబ్బ

### ఇడి, సిబిఐ వేధింపులతో దెబ్బతీసే యత్నం



**న్యూఢిల్లీ :** ప్రాంతీయ పార్టీల నేతలను భయపటెటడం ద్వారా బిజెపి దేశంలో బలమైన రాజకీయ పార్టీగా తిరుగులేకుండా చేసుకోవడం కోసం ఎత్తులు వేస్తోంది. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే మరింతగా వేదింపులు తప్పవన్న బయం కూడా ఉంది. దీంతో ప్రాంతీయ పార్టీలకు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్ ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రాంతీయ పార్టీల్లో అధికారంలో ఉన్న వైసీపీ రెండోసారి ఎన్నికల్లోనే సంకట పరిస్థితిలో పడింది. తెలుగుదేశంతో రాజకీయంగా పోరాడే బదులు ఎన్నికల సమయంలో కేసులు మోపడమే వైసీపీ అత్మరక్షణలో పడిందనడానికి నిదర్శనం. నిజానికి అరవింద్ కేజీవ్రాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు. గుజరాత్, గోవాలో కాంగ్రెస్ ఓట్లను చీల్చారు, తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను సిఎం పదవి వీడేలా చేసింది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల తర్వాత ఎన్ని ప్రాంతీయ పార్టీలు ఉంటాయో, ఎన్ని మిగిలిపోతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

# ప్రచారంలో..అందరూ జాదూగాళ్లే !



సిద్దాంతాలు పక్కకు పోయాయి. సమస్యల ప్రస్తావన లేదు. ఎదుటివారిని బురిడీ కొట్టించడం.. బురదజల్లడం, ఓట్లను లాగడం వంటి విద్యల్లో రాజకీయ నేతలు ఆరితేరారు. రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారడంతో అబద్దాలు ప్రచారం చేయడం..ఫేక్ వీడియోలు విడుదల చేయడం ఎన్నికల్లో సర్వసాధారణం అయ్యింది. ఓ మూడు నెలలు కష్టపడితే ఐదేళ్లు అధికారం వెలగబెట్టవచ్చు. ప్రజలను నిత్యం మోసం చేస్తూ ఉండవచ్చు. అందినకాడికి దోచుకోవచ్చు. ఇందుకు ఎవరూ అతీతులు కారు. అంతా ఒకే తాను ముక్కలు. ఇందులో ఒకరికి ఒకరు పోటీ పడుతున్న తీరు భారత ప్రజాస్వామ్యంలో వేళ్లూనుకుపోయింది. ప్రజలు పేదలుగా ఉండిపోవాలి. అడుక్కుతినే స్థితి నుంచి దాటి రావద్దు. ఉచిత బియ్యం, పెన్షన్లు, ఇళ్ల పందేరం, డబ్బుల పందేరం వంటివి చూపి ఓట్లు కొల్లగొట్టడం అలవాటు చేసుకున్నారు. దేశంలో కీలకమైన సమస్యలను పరిష్కరించే సత్తా నేతల్లో కానరావడం లేదు. సాగు,తాగునీటి సమస్యలను పరిష్కరించే ఉపాయాలు నేతల్లో లేవు. వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లవచ్చో..అన్న లోచనలు అస్సలు లేవు. పన్నులు పెంచడం, పందేరం చేయడంలో నేతలు పోటీ పడుతున్నారు. దీనికోసం మనమంతా ఓట్లు వేస్తున్నామని గుర్తించడం లేదు. ఎన్నికలలో ప్రజలను నమ్మించేందుకు అన్ని పార్టీలు కూడా మితిమీరిన వాగ్దానాలు చేయటం చూస్తున్నాం. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. పరస్పర ఆరోపణలు చేసుకోవటం హద్దులు దాటింది. కొత్తగా వీడియోలు మార్ఫింగ్ చేయడం..చెప్పని డైలాగులు చొప్పించడం వంటివి కూడా చేస్తూ ఎదుటి వారిని ప్రజల్లో బద్నాం చేయడంలో నిష్ణాతులు అవుతున్నారు. ఈసారి చూస్తున్నంతగా అబద్దాలు, పరస్పర దూషణలు గతంలో ఎన్నడూ లేవు. తిట్టుకోవడంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారు. సభ్య సమాజం ఒకటి ఉందన్న విషయం మరిచిపోయారు. సోషల్ మీడియా ముఖ్యంగా టీవీలు, యూట్యూబుల్లో ఈ పైత్యం పెరిగింది. రాజకీయ పార్టీల మధ్య పోటీ అన్నది పోయి..వ్యక్తుల మధ్య దూషణల పోటీలాగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. మేనిఫెస్టోలను ప్రకటించినపుడు అలవిగాని హామీలు అన్నీ ఇందులో చోటు చేసుకుంటున్నాయి. కలిపి నోట్లో ముద్ద పెట్టడమే తరువాయి అన్నచందంగా హేల జాబితా తయారయ్యింది. ఇక విషయం ఏదైనా ప్రజల వద్దకు వెళ్లి విషప్రచారాలు చేసుకోవడంలో నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, చివరకు ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతగా పతనం అయ్యిందో తాజా ఎన్నికల ప్రచారం చూస్తే తెలుస్తుంది. తమ పాలనా కాలంలో చేసిన మంచిపట్ల ప్రజలకు విశ్వాసం కల్పించలేక పోతున్నారు. అందుకు కారణం.. సమస్యలను పరిష్కరించే సత్తా ప్రదర్శించలేక పోవడమే. అయినప్పటికీ అధికారం కోసం నానా గడ్డీ కరుస్తున్నారు. ప్రజలను మరోమారు వంచించాలంటే అబద్దాలే అవసరం అని గుర్తిస్తున్నారు. అబద్దాలతో, ప్రత్యర్థులపైన ఆరోపణలతో ఏదో ఒక విధంగా మెప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. తమ వైఫల్యాలను, బలహీనతలను ప్రజల దృష్టిలో మరుగునపడేట్లు చేయడం కోసం ఎదుటి పక్షంపై ఎంతకైనా తెగిస్తున్నారు. బురదజల్లుతున్నారు. ఇలా ప్రజల దృష్టిని పక్క దారి పట్టించేందుకు అవసరమైన టక్కుటమార, గజకర్ణ,గోకర్ణ విద్యలన్నీ ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, దూషణలతో హంగామా సృష్టించడంలో రాటుదేలారు. ఇలాంటి ప్రచారాలతో వ్యక్తులు స్థాయి, సంస్కృతి, సంస్కారం, నాగరికత, ప్రజాస్వామిక విలువలు పతనమవుతుండటం చూస్తున్నాం. అధికారం ద్వారా సంపదను పోగుచేసుకోవడం లక్ష్యంగా రాజకీయం సాగడం వల్ల అధికారం కోసం ఇలా నానాగడ్డీ కరుస్తున్నారు. మనకు స్వాతంత్రం లభించినప్పటి నుంచి పాలించిన పార్టీలు గాని, తర్వాత ఉనికిలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, కులపార్టీలు, వేర్వేరు సిద్దాంతాల పార్టీల గాని క్రమంగా తమ పరిపాలనలో విఫలమవుతూ వచ్చాయి. సిద్దాంతాలకు దూరమవుతూ వచ్చాయి. ఆర్థిక సంస్కరణలు వ్యక్తులు, నాయకులు, పార్టీలు సంస్థల ప్రాపంచిక దృక్పథాన్ని గణనీయంగా ప్రభావితం చేయసాగింది. అధికారంలో ఉంటే సుఖాలు అనుభవించవచ్చు. అప్పనంగా సంపాదించవచ్చు. అన్న ఏకైక లక్ష్యం కోసం రాజకీయ పార్టీలు ప్రజలను సమిధలుగా చేస్తున్న తీరు ప్రతి ఎన్నికల్లోనూ చూస్తున్నాం. ప్రజలు మంచి అనుకున్న వారిని నమ్మి గద్దెనెక్కించినా వారు కూడా అలాగే తయరావుతున్నారు. తెలంగాణలో ఉద్యమం చ ఏసిన పార్టీనే గద్దెనెక్కిస్తే ఎంతగా భ్రష్టుపట్టించిందో చూశాం. ఎపిలో అయితే బటన్ నొక్కుడే అభివృద్ది అని కొత్త తరహా రాజకీయం నెరిపారు. ఇలా ఎవరిని నమ్మాలి. కేంద్రంలో మోడీని నమ్మితే ఆదానీ, అంబానీలు రాజ్యమేలుతున్నారు. ప్రజల నడ్డి విరిచేలా పన్నులు వేస్తూ..బతకడం అన్నది భారంగా చేశారు. అంతకు ముందు పదేళ్ల కాంగ్రెస్ పాలనలో అవినీతి ఊడలు విశ్వవ్యాప్తం అయ్యాయి. అయినా ఇవే పార్టీలు మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నాయి.దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా నేటికీ ఇదే దుస్తితి కొనసాగుతున్నది. చివరకు వామపక్షాల ఏలుబడిలో వరుసగా 34 సంవత్సరాలు బెంగాల్ ఎలా తయారయ్యిందో చూశాం. అందరూ రాజకీయాధికార సాధన, ధన సంపాదనలనే ఏకైక ధ్యేయంగా మార్చి, అబద్దాలు, ఆరోపణలు దూషణలు చేసుకోవటం కారణంగానే భారత ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రతి ఎన్నికల్లో ఓడిపోతున్నారు. ఈ సువిశాల దేశంలోని అన్ని ప్రాంతాలను, అన్ని వర్గాల ప్రజలను రాజకీయ పార్టీలు బలిపశువులను చేస్తున్నారు. ఎన్నకల ప్రచారాలు శృతిమించటం, గతంలో ఎన్నడూలేని స్థాయిలో ఆరోపణలు, దూషణలు , డబ్బులు వెదజల్లడం వంటి చర్యల కారణంగా మన వ్యవస్థ దెబ్బతింటూనే ఉంది.

# ఎవరి కోసం పార్లమెంట్ ?



గత కొన్నేళ్లుగా పార్లమెంటులో చర్చ అన్న అంశం లేకుండా పోయింది. కేవలం రచ్చ మాత్రమే సాగు తోంది. ఇరు పక్షాలు ఇదే కోరుకుంటున్నాయన్న అనుమానాలు కలుగుతున్నాయి. చర్చచేస్తే డొల్లతనం బయట పడుతుందేమో అన్న భయం అధికారపక్షానికి ఉండివుంటుంది. చర్చలో పసలేకుంటే ఎలా అన్న భయం విపక్షాల్లో ఉన్నట్లుగా ఉంది. అందుకు ఇరుపక్షాలు చర్చకు దూరంగా ఉంటున్నాయి. ఫలానా సెక్షన్ కిందే చర్చించాలని పప్రతిక్షం పట్టు పడుతుంటే..కాదుకాదు..ఫలాన సెక్షన్ కిందే చర్చిస్తామని అధికారపక్షం చెబుతోంది. మొత్తంగా మండుతున్న మణిపూర్ వ్యవహారం పార్లమెంటులో మాత్రం అంటుకోవడం లేదు. ఎందుకంటే చర్చజరిగితే ఏదైనా నిగ్గు తేలేది. సమస్యపై చర్చించడం ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయాలన్న పట్టుదల విపక్షాల్లో కానరావడం లేదు. అంతుకు మించి..రాజకీయంగా లబ్దిపోందాలన్న ఆకాంక్షలో విపక్ష సభ్యులు ఉన్నారు. దాదాపు వారం రోజులు కావస్తున్నా..ఆందోళనల వరదలో సమస్యలు కొట్టుకుపోయా యి. అందులో మణిపూర్ ఘటన కూడా ఉంది. గత పార్లమెంట్, శీతాకా సమావేశాలను తీసుకుంటే ఇలాగే సాగింది. విపక్షం పట్టుబట్టడం..అధికార పక్షం తోసిపుచ్చడం అన్న ఆనవాయితీ కొనసాగుతోంది. ఎన్నాళ్లిలా పార్లమెంట్ సమయాన్ని వృధా చేస్తారా అన్నది చూడాలి. బలహీనమైన విపక్షం అన్న కారణంగా అధికార పక్షం తలొగ్గడం లేదు. ఈ పద్దతి కాదులే అని మోదీ సర్కారుపై విశ్వాసపరీక్షకు విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ రకంగా అయినా చర్చించాలన్న ఉద్దేశ్యం ఉంటే మంచిదే. అలా కాకుండా ఏదో సర్కార్‌ను ఇరుకున పెట్టాలన్న దురుద్దేశ్యం ఉంటే ప్రజలు మాత్రం క్షమించరు. పార్లమెంటును ఉపయోగించుకోలేని విపక్షం అని ఇప్పటికే చర్చ జరుగుతోంది. మొత్తంగా విపక్షాల నోటీసులకు స్పందించిన స్పీకర్ ఓంబిర్లా...పార్టీలతో చర్చించి తేదీని ప్రకటిస్తానన్నారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంటు ముందు ఉంచి చర్చించి, సర్కార్‌ను నిలదీయడంలో ఇప్పటికే విపక్షాలు విఫలం అయ్యాయి. మణిపూర్ సంక్షోభంపై మాట మాట్లాడని మోదీ ప్రభుత్వంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి కానీ ఏకాభిప్రాయం సాధిస్తాయా అన్నది చూడాలి. మోదీ ప్రభుత్వంపై ఇది రెండో అవిశ్వాస తీర్మానం కావడం గమనార్హం. మొత్తంగా ఆత్మవిశ్వాసంతో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అవిశ్వాస తీర్మానం ఎదుర్కోనున్నది. రూల్ 198 కింద కాంగ్రెస్ లోక్‌సభాపక్ష ఉప నేత, ఎంపీ గౌరవ్ గొగోయ్ తీర్మానం ప్రవేశపెట్టగా నిబంధనల ప్రకారం 50 మందికి పైగా సభ్యులు మద్దతు తెలిపారు. దీనిపై 10 రోజుల్లోగా చర్చించాల్సి ఉంటుంది. మణిపూర్ అ÷-లలర్లపై ప్రధాని మోదీ నోరు మెదపడం లేదన్న సాకుతలో విపక్షాలు అవిశ్వాస తీర్మాన అస్త్రాన్ని ప్రయోగించాయి. ఈ విధంగానైనా సభలో ప్రభుత్వ తీరును ఎండగట్టే అవకాశం వస్తుందన్న వ్యూహంతో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఉంటాయి. ఓవైపు మణిపూర్ లో హింసాకాండ, మహిళలపై అఘాయి త్యాలు చోటుచేసుకుంటుంటే.. ప్రధాని మోదీ మౌనంగా ఉండ టాన్ని ప్రతిపక్ష నేతలు తప్పుబడుతున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై దాదాపు వారం కావస్తున్నా మణిపూర్‌తో పాటు ఇతర సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రాకుండా, ఉభయ సభలను వాయిదాల పర్వంలో నడిపిస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని పార్లమెంట్ వేదికగా ఎండగట్టేందుకు విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం ఎదుర్కోవడం ఇది రెండోసారి. 2018, జూలై 20న ప్రతిపక్షాలు మొదటిసారి అవిశ్వాసం పెట్టాయి. అయితే లోక్‌సభలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ ఉండటంతో అది వీగిపోయింది. ప్రసుత్తం 543 మంది సభ్యులు గల లోక్‌సభలో ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 330 మంది ఎంపీలు ఉన్నారు. కాంగ్రెస్‌తో కూడిన విపక్ష కూటమికి 140 మంది ఎంపీల మద్దతు ఉన్నది. ఈ రెండు గ్రూపుల్లో లేని ఇతర పార్టీలకు 60 మంది ఎంపీలు ఉన్నారు. దేశ చరిత్రలో కేంద్ర ప్రభుత్వంపై 27 సార్లు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టారు. తాజా అవిశ్వాస తీర్మానం 28వది అవుతుంది. సభలో బలాన్ని నిరూపించుకొనే క్రమంలో 'విశ్వాస తీర్మానం'పై జరిగిన ఓటింగ్‌లో ఓడిపోయి.. 1990లో వీపీ సింగ్, 1997లో హెచ్‌డీ దేవెగౌడ, 1999లో ఏబీ వాజపేయీ ప్రభుత్వాలు కూలిపోయాయి. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అత్యధికంగా 15 సార్లు అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్నారు. 1979లో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరుగకుండా ప్రధాని మొరార్జీ దేశాయ్ రాజీనామా చేశారు. మరోవైపు అధికార పక్షం విపక్షాల తీరును పెద్దా పట్టించుకోవడం లేదు. మణిపూర్‌పై చర్చ చేపట్టాలని నినాదాలు చేస్తున్న క్రమంలో సభ వాయిదా పడుతూనే ఉంది. ఏదో ఓ రకంగా..ఏదో సెక్షన్ కింద చర్చించాలన్న పట్టుదల విపక్షాల్లో కానరావడం లేదు. ఇదే అదనుగా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం అరు బిల్లులను ప్రవేశపెట్టింది. వాటిల్లో అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును ఆమోదించుకుంది. మణిపూర్‌తో పాటు ఇతర సమస్యలపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు విపక్ష ఇండియా కూటమి ఎంపీలు హాజరయ్యారు. మొత్తంగా సభలు ప్రజలతో సంబంధం లేని సంస్థలుగా మారాయి. పార్లమెంట్ సమయం వృధా అవుతున్న అధికార, విపక్షాలకు పట్టింపు లేకుండా పోతోంది. వచ్చే ఎన్నికల నాటికి ఇలాగే ఉంటుంది. వర్షాకాల సమావేశాలు కూడా గత వర్షాకాల, శీతాకా సమావేశాల్లోలాగే వృధా కావడం చూస్తాం. బాగా నిలదీసామని విపక్షం అనుకుంటే విపక్షానికి ఎక్కడా లొంగలేదని అధికార పక్షం సంతోషంగా ఉంటుంది. పార్లమెంట్‌కు ఎన్నుకున్న ప్రతినిధులకు బాధ్యత లేకుండా పోతోందని అనుకోవడానికి ఇంతక న్నా నిదర్శనం అక్కర్లేదు.

# ఖాతాదారులపై ఛార్జీల దాడి

### మొండి బకాయిలపై నిర్లక్ష్యం

### బ్యాంకుల తీరుతో సామాన్యులపై భారం

**ముంబయి :** దేశంలో బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వారి విషయంలో ఎలాంటి చర్యలు కానరావడం లేదు. కొందరు దేశం విడిచి పారిపోయారు. వారు ఇప్పట్లో తిరిగి వస్తారని కానీ, ఎగవేసిన రుణాలను చెల్లిస్తారన్న ఆశలు మాత్రం కానరావడం లేదు. గత పదేళు _గా ఇది చూస్తూనే ఉన్నాం. నల్లధనం తీసుకురాలేదు. ఎగవేతదారులను పట్టి తేలేక పోయాం. ఇకపోతే కాలక్రమేణా బ్యాంకులు సామాన్యులకు దూరం అవుతున్నాయి. రకరకాల ఛార్జీలతో ఖాతాదారులను వేధిస్తున్నారు. ఎటిఎం మొదలు ఎలాంటి పనికైనా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించక పోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. కొత్త నిధులు లభిస్తేనే రుణాల మంజూరులో వృద్ధికి దోహదం చేయనుంది. బ్యాంకుల తీరు కారణంగా బ్యాంకుల్లో డబ్బు దాచుకునేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఖాతాదారులకు అండగా ఉండాల్సిన బ్యాంకులు పనితీరు రానురాను వారినుంచి ముక్కుపిండి ఏ రూపంలో డబ్బులు వసూలు చేయాలో అన్న రీతిలో ఉంటున్నాయి.ఇకపోతే మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. పెద్దనోట్ల రద్దు తరవాత ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండిబకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించిన ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండిబకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాబై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్తితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. 2017 మార్చి 31 నాటికి బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి.

## మేడిపండు చందంగా

# చిత్రపరిశ్రమ !

**హైదరాబాద్ :**




చిత్ర పరిశ్రమ..అది దేశంలో ఏభాషలో అయినా కావచ్చు..ఆడవాళ్లను లొంగదీసుకోకుండా నడిచిన దాఖలాలు లేవు. చిత్రపరిశ్రమలోకి ఉత్సాహంగా వచ్చిన మగువలను మృగాళ్లు ..వదలడం లేదు. అక్కడ విలువలు మృగ్యం. మగ పెత్తనమే ఎక్కువ. ఆడవాళ్లంటే నీచాతినీచంగా వ్యవహరిస్తున్న ఘటనలు ఎన్నో చూశాం. ఓ రకంగా సమాజంలో మగసామ్రాజ్యం ఎక్కడైనా ఉందంటే అది చిత్ర పరిశ్రమ అని చెప్పక తప్పదు. ఇలీవల మాలీవుడ్ అంటే..మళయాలంలో కాస్ట్‌కౌచింగ్ దుమారం రేపింది. కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక తర్వాత ఒక్కసారిగా అగ్నిపర్వతం బద్దలయ్యింది. అక్కడ జరుగుతున్న దారుణాలు బయటపడ్డాయి. నీతి వాక్యాలు వల్లచించే వారి బండారం బయటపడింది. అమ్మ కమిటీకి మోహన్ లాల్ రాజీనామా చేశారు. వాడుకోవడం ...వదిలేయడం చిత్రపరిశ్రమలో షరామామూలు అన్న ప్రచారం ఉండనే ఉంది. ఈ క్రమంలో వివిధ సినీ కమిటీల బాధ్యులు లైంగిక వేధింపుల, దాడుల ఆరోపణలని ఎదుర్కొని రాజీనామా చేశారు. కొంతమందిపై కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ చిత్ర పరిశ్రమలోని స్త్రీల పని పరిస్థితులు బాగుచెయ్యటానికి అనేక కొత్త సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వం విధిలేని పరిస్థితిలో కార్యాచరణకు పూనుకుంది. ఇదే క్రమంలో నటీమణులు ఒక్కొక్కరుగా తమకు జరిగిన అనుభవాలను, బాధలను బయటపెడుతున్నారు. నిజానికి ఆడవాళ్లు ధైర్యం చేసి చిత్రపరిశ్రమలోకి రాకుంటే...విర్రవీగుతున్న మగాళ్లు ఏమవుతారు. ఆడవేశాలు కూడా వారే వేసుకుంటారా అన్నది ఆలోచన చేయాలి. స్త్రీలు భీష్మించుకుని చిత్రరంగంలోకి రాకుంటే ..డ్రామా కంపెనీల్లాగా చిత్రపరిశరమ దుర్గతిని ఎదుర్కోక తప్పదు. నీతి వాక్యాలు వల్లిచే హీరోలు, నిర్మాతలు, దర్శకులు దీనిపై ఆలోచన చేయాలి. చిత్రపరిశ్రమను ఆదర్శం గా నిలపడానికి కృషి చేయాలి. పని స్థలాల్లో స్త్రీల లైంగిక వేధింపుల గురించి తెలుగు సమాజాల్లో జరుగుతున్న చర్చ దేశంలో ఇతర చోట్ల జరుగుతున్న చర్చలకి పూర్తి వ్యతిరేకంగా ఉంది. బెంగాల్‌లో ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఘటన తర్వాత ఆ రాష్ట్రంలో హింసా సంస్కృతి గురించే కాకుండా, పని స్థలాల్లో లైంగిక వేధింపులు, దాడుల్ని సమర్థించే సంస్కృతి గురించి అందరూ మాట్లాడుతున్నారు. వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎంతోమంది వాదిస్తున్నారు. అయితే ఎన్ని ఘటనలు జరుగుతున్న..కుక్కతోక వంకర అన్న చందంగా మన దగ్గర మాత్రం ఇలాంటి చర్చలు జరగటం లేదు. పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితుల గురించి అస్సలు ఎవ్వరూ మాట్లాడటంట్లేదు. వారిని తోటివారుగా గౌరవించడం లేదు. ఇలా తమిళనాడు, బాలీవుడ్, ఒక్కటేమిటి అన్ని భాషల్లోనూ చిత్రపరిశ్రమలోకి రావాలనుకున్న...వచ్చిన మహిళలు వివక్షను, వేధింపులను ఎదుర్కొంటున్నారు. నిజానికి పనిప్రదేశాల్లో అన్ని చోట్లా ఇదే దుస్థితి ఉంది. కాకపోతే చిత్రపరిశ్రమలో కాస్తా ఎక్కువగా ఉంటుందని చర్చించుకోవాల్సి వస్తోంది. తెలుగు సినిమా పరిశ్రమలో పేరున్న డాన్స్ మాస్టర్ జానీ మీద అతని అసిస్టెంట్ దాఖలు చేసిన లైంగిక వేధింపులు, దాడికి సంబంధించిన ఫిర్యాదు గురించిన చర్చ ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో వందలాది మందిని కదిలించింది. అయ్యో జానీ మాస్టార్ అంటూ నీతులు వల్లిస్తున్నారు. ఆ అమ్మాయి సొంతంగా బతుకీడుద్దామనుకుంటున్న తరుణంలో కూడా వేధింపులకు పాల్పడ్డ జానీ తీరును ఖచ్చితంగా ఎండగట్టాల్సిందే. ఆమె ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడే ..ఎందుకు ఫిర్యాదు చేసింది..ఇన్నాళ్లూ ఇష్టంతోనే అతడితో ఉంది కదా? ఆమెను ఎవరు వాడుకుంటున్నారు. అతని పట్ల అసూయతోనే ఈ ఫిర్యాదు చేయించారు అంటూ నస పెడుతున్న వారు నిజాలు ఆలోచన చేయాలి. ఇటువంటి వాదనలతో నిజాలను పక్కదారి పట్టించలేరు. సోషల్ మీడియా ఇదే వాస్తవమన్న అభిప్రాయాన్ని కలుగచేస్తోంది. తెలుగు సినిమా పెద్దలు కూడా నేరం రుజువయితేనే అతని మీద చర్యలు తీసుకోవాలి అంటూ ఆయనకి పరోక్షంగా మద్దతు కూడగడుతున్నారు. జానీ మాస్టర్ అలా చేయడని కొందరు వంతపాడుతున్నారు. ఎవరు ఎలాంటి వారన్నది ఇలా ఆరోపణలు యటకు వచ్చినప్పుడే కదా తెలిసేది. 2018లో శ్రీరెడ్డి, ఇతర కళాకారులు తెలుగు సినీ పరిశ్రమలోని పురుషాధిపత్య సంస్కృతినీ, లైంగిక దాడీనీ తమ నిరసనల ద్వారా అందరి ముందుకీ తెచ్చారు. అప్పుడు ఆమెను వెక్కిరించినవారు, ఈసడించుకున్న వారే ఎక్కువ. డ్రగ్స్‌తో పట్టుబడ్డప్పుడు కూడా ఇలాగే వాదిస్తున్నారు. కానీ నిజాలను ఒపపుకోరు. తమకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని బతుకుతున్నారు. దాని జోలకి ఎవరూ రావద్దని వారు కోరుకుంటున్నారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఉన్న పరిస్థితి ప్రకారం కొత్తవాళ్ళకి పని చేసే అవకాశం రావాలన్నా, లేక అసోసియేషన్ కార్డు పొందాలన్నా కోఆర్డినేటర్లపైనా, పైనున్న మగ మాస్టార్లపైనా ఆధార పడాలి. వారికి లొంగి ఉంటేనే అసలు పనిచేసే అవకాశాలు వస్తాయి. పరిశ్రమ వారి మాటే వింటుంది. అందుకే జానీమాస్టర్ లాంటి వారు దీనిని అలుసుగా తీసుకుని లొంగగదీసుకుంటున్నారని అర్థం అవుతోంది.తనకంటే 20ఏళ్ళు చిన్నదైన అమ్మాయి, అదీ మైనారిటీ తీరని వయసులో ఉన్న అమ్మాయి పట్ల ఓ మాస్టర్ వ్యవహరించిన తీరుపైన చర్చించాలి. పరిశ్రమలో నిలబడడానికి వచ్చిన జూనియర్‌ను ప్రోత్సహించాల్సింది పోయి..బ్లాక్‌మెయిల్ చేసి కామవాంఛ తీర్చుకునే దగుల్బాజీలను ఎండగట్టాల్సిందే. సినిమా పరిశ్రమలో అత్యధిక శాతం తనకి మద్దతు ఇవ్వదని, వ్యతిరేకంగా మాట్లాడతారని తెలిసి కూడా ఆమె ఫిర్యాదుకు వచ్చిందంటే జానీ మాస్టర్ ఆమెను ఎంత తీవ్రంగా నియంత్రిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఆమెతో పాటు పని చేసే డాన్సర్లు, ఇతర సంఘాల్లో ఉండే అనేక మంది స్త్రీలు, ఇంకా చెప్పాలంటే పరిశ్రమలో దాదాపు అందరు స్త్రీలు కూడా ఇటువంటి పరిస్థితిలోనే ఉన్నారని మనం అనుకోవచ్చు. వాళ్ళు చెయ్యలేని ధైర్యం ఆమె చేసినందుకు అభినందించాలి. మాలీవుడ్ లాగా టాలీవుడ్‌లోనూ జస్టిస్ హేమ కమిటీ లాంటిది రావాలేమో. అలాంటి పరిస్థితి తెచ్చుకునే దాకా తెలుగు పరిశ్రమ రాకుండా ఉంటే మంచిది. పరిశ్రమలో ఉన్న సినీ దిగ్గజాలు ఈ దుస్థితిపై చర్చించాలి. పరిశ్రమ గౌరవాన్ని కాపాడాలి. తమకు చెడ్డపేరు రాకుండా చూసుకోవాలి. నిజానికి చెప్పాలంటే ఇలాంటి దుస్థితి అన్ని పరిశ్రమల్లో ఉంది. ఎక్కడ ఉన్నా దానిని ఎదరించాల్సిందే. నిలదీయాల్సిందే. సమర్థించే వారిని నిగ్గదీయాల్సిందే. అప్పుడే భయం అన్నది పుట్టుకుని వస్తుంది.

## డీలిమిటేషన్ అన్యాయాలపై

# చర్చ మొదలవ్వాలి !

**హైదరాబాద్ :**



దేశ జనాభాకు అనుగుణంగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు ఎప్పుడో పెరగాల్సి ఉంది. కానీ ఈ సీట్లు పెరగడం లేదు. సరికదా కేంద్రంలో పాలన చేసిన పార్టీలన్నీ కాలయాపన చేస్తూ వచ్చాయి. సీట్లు పెరిగితే తమకు ఎక్కడ ముప్పు వస్తుందో అన్న ఆలోచనలో పాలక పార్టీలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన కత్తి మీద సాములాంటిది. ఇది ఎన్నో కీలక రాజకీయ పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంది. దీనికితోడు జనాభా కూడా పాపం పెరిగినట్లు పెరుగుతోంది. జనాభా కంట్రోల్ చేయడంలో కొన్ని రాష్ట్రాలు బాగా కృషి చేస్తుంటే..బీహార్, బెంగాల్ వంటి రాష్ట్రాలు అస్సలు పట్టించుకోవడం లేదు. అంతెందుకు గణాంకాల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. దక్షిణాదిలో జనాభా నియంత్రణ కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. ఈ క్రమంలో అక్కడ డీలిమిటేషన్ జరిగితే అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఇతర రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో కృషి చేస్తున్న తమకు అన్యాయం జరిగేలా ఉందని ఇటీవల తెలంగాణ మంత్రి కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాకుండా దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పంపిణీలో అన్యాయం జరుగుతుందని కూడా అన్నారు. నిజంగానే ఇది ఆలోచించాల్సిన విషయం. కేరళ లాంటి రాష్ట్రాలు అక్షరాస్యత,జనాభా నియంత్రణలో ముందున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే దేశ జనాభా 140 కోట్లకు చేరినందున వారికి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య కూడా పెరగాలని కోరుకుంటున్నారు. అందుకే జనాభా ప్రాతిపదికన విభజించి 846 నియోజకవర్గాలు చేయాలన్న ఆలోచన ఉంది. అలా చేస్తే.. ఒక్క యూపీకే 143 లోక్ సభ సీట్లు వస్తాయి. మొత్తం దక్షిణాదికి 160 వరకూలోక్ సభ సీట్లు ఉంటాయి. అంటే... మొత్తం దక్షిణాది అంతాకూడా యూపీతో పోటీపడదన్న మాట. దీంతో పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోవడం ఖాయం అన్న ఆందోళన మరోవైపు వెన్నాడుతోంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్వి భజనకు జనాభాను ప్రాతిపదికగా తీసుకోకూడదని డిమాండ్ చేస్తున్నాయి. దేశంలో జనాభాను నియంత్రిం చడంలోనే కాకుండా మానవ అభివృద్ధి సూచికల్లో కూడా దక్షిణాది రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. జనాభా లెక్కల ఆధారంగా చేసే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కత్తి దక్షిణాది రాష్ట్రాలపై వేలాడుతోంది. మహిళా రిజర్వేషన్‌బిల్లు ఆమోదించిన తరువాత జరిగే తొలి జనగణన తరువాత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి.. మహిళా రిజర్వేషన్‌లను అమలు జరుపుతామని లోక్‌సభలో కేంద్రం ప్రకటించింది. దీంతో.. మళ్లీ నియోజక వర్గాల పునర్విభజన అంశం తెరమీదకు వచ్చింది. జనాభానే ప్రాతిపదికగా తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని ఇప్పటికే అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఎంపీ స్థానాలకు 1971 నాటి జనగణన ప్రాతిపదిక. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు ప్రస్తుతం 129 లోక్‌సభ స్థానాలున్నాయి. జనాభా లెక్కలు తీసిన తర్వాత పునర్విభజనలో వీటి సంఖ్య 103కు పడిపోతుంది. ఉత్తరాదిలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుతం ఈ నాలుగు రాష్ట్రాల్లోని లోక్‌సభ స్థానాల సంఖ్య 174 కాగా పునర్విభజనతో వీటి సంఖ్య ఏకంగా 204 స్థానాలకు చేరుకుంటుంది. పశ్చిమబెంగాల్, ఒడిషా కూడా భారీగా నష్టపోతాయి. ప్రసుతం ఈ రెండు రాష్ట్రాలకు కలిపి 42 లోక్‌సభ స్థానాలుంటే.. కొత్తగా జరిగే పునర్విభజన తరువాత వాటి సంఖ్య 34కు పడిపోయే అవకాశం ఉంది. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు జరిపినందుకు దక్షిణాది రాష్ట్రాలు దారుణంగా నష్టపోతుండగా.. జనాభా నియంత్రణలో పూర్తిగా విఫల మై.. జనభా విస్ఫోటంతో నానా అవస్థలు పడుతున్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం లబ్ధి పొందడం దారుణం కాకా మరోటి కాదు. ఇదే విషయాన్ని కెటిఆర్ లెక్కలతో సహా విరించి..జరుగబోతున్న నష్టాన్ని ప్రజల ముందుంచారు. దక్షిణాది రాష్ట్రాల నేతలు కూడా ఇదే విషయంపై మండిపడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకూడదని ఈ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ కూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజ నలో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని హామీ ఇవ్వాలంటూ తమిళనాడు సిఎం స్టాలిన్ ప్రధాని మోడీని డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకు వచ్చిన సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన తరవాత అమలు చేయడం అని అందులో షరతు పెట్టింది. దీంతో ఈ నియోజకవర్గాల పునర్విభజన తెరపైకి వచ్చింది. ఇదే జరిగితే దక్షిణాది పరిస్థితి ఏమిటన్నదానిపై చర్చలు ప్రారంభమయ్యాయి. దేశంలో జనాభా పెరిగిపోతోందని జనాభా నియంత్రణను మన ప్రభుత్వాలు చేపట్టాయి. జనాభాను నియంత్రించిన వారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రజలు చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఫలితంగా దక్షిణాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గింది. అభివృద్ధిలో ముందుకు వెళ్లింది. కానీ ఉత్తరాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గలేదు... అక్కడి ప్రజలు జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు జనాభా ప్రకారం డీలిమిటేషన్ జరిగితే.. నష్టపోయేది దక్షిణాది. లాభపడేది ఉత్తరాది. ఈ అన్యాయన్ని ఎలా సరిచేస్తారన్నదే ఇప్పుడు దేశం ముందున్న ప్రశ్న.

# పరస్పర విమర్శలకే నేతల ప్రాధాన్యం

**హైదరాబాద్ :**

ఎన్నికల్లో అన్ని అంశాలు పక్కకు పోతున్నాయి. దూషణల పర్వం విపరీతంగా ముందుకు పోతోంది. ఎంత ఎక్కువగా దూషిస్తే అంతగా పాపులారిటీ అన్న పంథాలో పార్టీలు, వాటి నేతలుముందుకు సాగుతున్నారు. రాజకీయాల్లో ఇలాంటి అవాంఛనీయ వ్యవహారాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రధాని మోడీ సైతం ఇదే పంథాలు సాగుతున్నారు. ఎపిలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పరస్పర దూషణలు చేసుకోవడంతోనే ప్రచారాన్ని హైటెల్ చేస్తున్నారు. తెలంగాణలో కూడా ఇదే తరహా పరిస్థితి ఉంది. అధికార కాంగ్రెస్, విపక్ష బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు పదేపదే విమర్శలతో కాలం గడుపుతున్నారు. సవాళ్లు విసరుతున్నారు. నిజానికి ప్రజలకు ఇవన్నీ అవసరం లేదు. ఏం చేస్తారో చెప్పాలి. ఏం చేశామో చెప్పాలి. ఎపినే తీసుకుంటే..రాష్ట్ర విభజన తరువాత 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం మిగిలిన అంశాలను విస్మరించి కేవలం రాజధాని భూముల సమీకరణ, సింగపూర్ నమూనా తదితర అంశాలకే పరిమితమైంది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఆలోచనలు చేయలేదు. 2019-2024 మధ్య పాలించిన వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం 'బటన్ నొక్కుడు' పరిమితమై మిగిలిన అన్ని అంశాలను నిర్లక్ష్యం చేసింది. మౌలిక వసతులలో భాగంగా కనీసం రోడ్ల నిర్మాణం కూడ చేయలేదు. టిడిపి-జనసేన కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో అభివృద్ధికి అవసరమైన అంశాలను తాము విస్మరించిన తీరును ప్రజలు గుర్తించకుండా ఉండటానికే ఎన్నికల ప్రచారంలో పరస్పర దూషణలు, వ్యక్తిగత దూషణలు చేసుకుంటున్నాయి. అభివృద్ధి అంశాలను ప్రస్తావించకుండా కేవలం సంక్షేమ అంశాలకే పరిమితమైనారు. అభివృద్ధి- సంక్షేమాన్ని సమతుల్యం చేయాలనే ఉద్దేశం మూడు ప్రాంతీయ పార్టీలకు లేకపోగా, మూడు పార్టీలు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి అంటకాగటంపైనే దృష్టి సారించారు. మోడీ ముందు మోకరిల్లే రాజీకాయలకు పరిమితం అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన విధానాలు ప్రకటించలేక పోతున్నారు. మూడు ప్రాంతీయ పార్టీలు విస్మరించిన అంశాలపై వాటిని నిలదీయాల్సిన అవసరముంది.సాధారణంగా ప్రాంతీయ పార్టీలు ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షల నుంచి ఉద్భవించి, తమ రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం పోటీ పడతాయి. తెలుగుదేశం పార్టీ 1982లో 'ఆంధ్రుల ఆత్మగౌరవం' నినాదంతో ఏర్పడింది. ఉమ్మడి ఎపిలో పార్టీ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జీవితాంతం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన అందించారు. కానీ పదవీచ్యుడుతు కావడంతో ఆయన ప్రతిభ పోయింది. చంద్రబాబు హయాంలో కొంత అభివృద్ధి సాగింది. కానీ జగన్ పాలనలో విడివడ్డ ఎపి అప్పులకుప్పగా మారింది. తెలంగాణలో కెసిఆర్ అభివృద్ధి ముసుగేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసింది. 1980వ దశకంలో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వానగల కేందప్రభుత్వ ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ఎన్.టి.రామారావు, జ్యోతిబసు, రామకృష్ణ హెగ్డే, మొదలగు నాయకులు సమావేశాలు జరిపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో మార్పు తెచ్చి, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా సర్కారియా కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. మోడీ అధికారంలోకి వచ్చాక నీతి ఆయోగ్ ఏర్పాటు చేశారు. ప్రణాళికా సంఘాన్ని తొలగించారు. కానీ రాష్ట్రాలకు చేయూతనిచ్చి అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇకపోతే తాజా ఎన్నికల్లో కూడా అభివృద్ధి నినాదం వెనక్కి పోయింది. మూడు ప్రాంతీయ పార్టీల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను విస్మరించాయి. గత పదేళ్లుగా ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణం మొదలగు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, పోరాడి హక్కులను సాధించుకోవడానికి బదులు కేంద్రానికి సాగిలబడ్డాయి. భావితరాలకు అన్యాయం చేసేవిధంగా మూడు ప్రాంతీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో ఈ అంశాలు కనిపించలేదు. ప్రత్యేక హోదా గురించి మూడు ప్రాంతీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలలో చేర్చలేదు.ప్రత్యేక హోదా వలన రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలు, పన్ను రాయితీలు లభించి పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. ప్రత్యేక హోదా కోసం గత దశాబ్ద కాలంలో అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ వాటిని అణచివేయడానికే ప్రయత్నించారు. ఒక్కసారి కూడా ప్రత్యేక హోదాపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించటానికి ప్రయత్నించలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలలో ప్రత్యేక హోదాను విస్మరించటం శోచనీయం.త దశాబ్ద కాలంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదు. మూడు ప్రాంతీయ పార్టీలకు పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనపై స్పష్టమైన దృక్పథం లేదు. రాష్ట్రంలో ఐ.టి రంగం, ఫార్మా రంగం, టెక్స్‌టైల్స్, వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. విశాఖపట్నంతో పాటు తిరుపతి, అనంతపురం, ప్రకాశం జిల్లాలో దొనకొండ, గన్నవరం తదితర ప్రాంతాలను పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖలలో ఖాళీగా వున్న ఉద్యోగాలతో పాటు, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధి కల్పించాలి. పెద్ద సంఖ్యలో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులరైజేషన్‌తో ఉద్యోగ భద్రత కల్పించాలి. అనేక రాష్ట్రాలలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో సిపిఎస్ రద్దు గురించి 2014-19 మధ్య తెలుగుదేశం, 2019-2024 మధ్య వైఎస్ఆర్ ప్రభుత్వం మాట తప్పాయి. ఇప్పుడు ఎన్నికల మ్యానిఫెస్టోలలో సిపిఎస్ గురించి చర్చిస్తామని చెప్పారు తప్పితే రద్దు చేస్తామని మూడు పార్టీలూ పేర్కొనలేదు. ఇక తెలంగాణలో ఇదే పరిస్తితి నెలకొంది. పరస్పర విమర్శలు చేసుకోవడంతోనే కాలం గడిపేస్తున్నారు. ఈ క్రమంలోప్రజలే దీనిని గుర్తించి ఓటేయాలి. చైతన్యం ప్రదర్శించాలి.

## పడగొట్టిన ప్రజాస్వామ్యం..

# తొడగొడుతోంది !



చాలాకాలం తరవాత అంటే...పదేళ్ల తరవాత పార్లమెంటులో ప్రజాస్వామ్యం కనిపిస్తోంది. గతంలో లాగా ప్రధాని మోడీ కాలర్ ఎగరేసే పరిస్థితి లేదు. పూర్తిస్థాయి మెజార్టీ లేకపోవడంతో..చిన్నచూపు చూసిన నేతల ముందు మోకరిల్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అలాగే విపక్షం కూడా బలంగా ఉంది.దేశ ప్రజాస్వామ్యంలో ఇదో మార్పుగా చూడాలి. అందుకే పార్లమెంటులో చర్చలకు అవకాశం వస్తోంది. విపక్ష సభ్యులు స్వేచ్ఛగా తమ గళాన్ని వినిపిస్తున్నారు. స్పీకర్ ఓం బిర్లా కూడా విపక్ష సభ్యులకు గౌరవం ఇచ్చి వారిని చర్చలో పాల్గొనేలా చేస్తున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంలో భాగంగా విపక్షనేత రాహుల్, సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ యాదవ్ తదితరులు పార్లమెంటులో నిర్భయంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందులో తప్పులు తీసేస్తే..నిజాలు కూడా చాలా ఉన్నాయి. వారి విమర్శలను సూచనలుగా తీసుకుంటే ప్రజలకు మేలు కలుగుతుందని మోడీ గుర్తించాలి. పార్లమెంటులో ఈ పరిణామం ఇక బిజెపిలో కూడా రావాల్సి ఉంది. ఎందుకంటే బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. ఏ అంశంపైనా, తీసుకునే నిర్ణయంపైనా పార్టీలో చర్చించిన దాఖలాలు లేవు. గత పదేళ్లుగా నిరంకుశ విధానాలు సాగాయి. దేశం ఎటు పోతుందో ..ఏ నిర్ణయం తీసుకుంటున్నారో కూడా తెలియదు. ఎంతో హుందాగా, దేశం కోసం వాజ్‌పేయ్, అద్వానీ లాంటి వారు భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేసి,ప్రజల్లో కొత్త ఆశలను నింపారు. బిజెపిని ప్రజాస్వామ్య పార్టీగా, దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీగా తీర్చిదిద్దారు. కానీ వారి ఆశలు అడియాశలు అయ్యాయి. పెద్దలంతా తెరమరుగయ్యారు. పాతతరం నేతలకు ప్రవేశం లేకుండా చేశారు. ఒక క్రమపద్ధతిలో వారిని తప్పించారు. పార్టీలోనూ,పార్లమెంట్ లోనూ సీనియర్లు అన్న వాసన లేకుండా చేశారు. ఇప్పుడు పార్టీలో ఇద్దరి పెత్తనమే సాగుతోంది. అందుకే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడ్డది. చాయ్‌వాలాగా చెప్పుకుంటున్న మోడీ అధికారం చేపట్టిన తరవాత చేస్తున్న విన్యాసాలతో భారత ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. గత యూపిఎ ప్రభుత్వాన్ని గద్దె దింప, మోడీని అందలం ఎక్కించినందకు పదేళ్లుగా నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా గ్యాస్ ధరలు, జిఎస్టీ వాతలు చాలు.. ఈ దేశ ప్రజలు ఎంతగా దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారో చెప్పడానికి. ఇకపోతే నిరుద్యోగం ఎలాగూ పెరిగింది. ఉద్యోగ కల్పన లేదు. చివరకు ఆర్మీలో కూడా అగ్నివీర్ పథకం పేరుతో నాలుగేళ్ల సర్వీస్‌తో ఉద్యోగాల భర్తీ మొదల య్యింది. ఇంతకన్నా దారుణం ఉంటుందా అన్నద ఇచూడాలి. ఇకపోతే ఉద్యోగాల భర్తీ అన్నదే మర్చి పోయారు. సంస్థలను తెగనమ్మేయడం, బ్యాంకులను ముంచినోళ్లు దేశం దాటివెళ్లినా..చూస్తూ ఉండడం చూస్తున్నాం. ప్రజలు మామూలు బట్టలు కూడా కట్టుకోలేని దుస్థితిలో ఉంటే మోడీ మాత్రం ఖరీదైన సూట్లు వేస్తుంటారు. కట్టిన బట్ట మళ్లీ కట్టకుండా రంగురంగుల ఖరీదైన బట్టలు వేస్తున్నారు. చాయ్ అమ్మిన వ్యక్తి ఇంతగా ఎదిగనందుకు భారతీయ ప్రజలు ఆనందించాల్సిందే. అలా అందరూ ఎదిగితేనే మనదేశ జిడిపి, ఆర్థిక వ్యవస్థ బాగా ఎదిగినట్లుగా మోడీ ఎప్పుడు గుర్తిస్తారో చూడాలి. ఈ క్రమంలో పదేళ్ల కాలం గిర్రున తిరిగింది. అయోధ్య, 370 ఆర్టికల్ పేరు చెప్పి ఓట్లు అడిగినా ప్రజలు నమ్మలేదు. మోడీ పాలనలో నిజాయితీ లేదని గుర్తించారు. అందుకే అయోధ్యలోనూ ఓడించారు. ఇవన్నీ సత్యాలు. ఈ సత్యాలు మాట్లాడితే మోడీకి కోపం వస్తుంది. గత పదేళ్లలో విపక్షం గట్టిగా లేకపోవడం వల్ల వారిని గెంటివేసి పాలన చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. భారత ప్రజాస్వామ్యం గొప్పదనం ఇప్పుడు కనిపిస్తోంది. గడచిన పదేళ్లలో నరేంద్ర మోడీ నాయకత్వాన కేంద్ర ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపే అవకాశం వచ్చింది. రాష్ట్రపతి ప్రసంగంలో కనిపించిన అతిశయాలను ఎండగట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వ విధానాలను వెల్లడించాల్సిన రాష్ట్రపతి ప్రసంగం సొంత డబ్బా కొట్టుకునేలాపాత చింతకాయ పచ్చడిలా సాగింది. నీట్ దోషులను శిక్షిస్తామనడం తప్ప కొత్త విషయమేమీ చెప్పలేదు. పేపర్ లీక్ దోషుల్లో ఇసుమంత భయం కూడా లేకుండా పాలన సాగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు ప్రధానమైనవిగా భావించిన అధిక ధరలు, పెరిగిన నిరుద్యోగం వంటి సమస్యలను వాటికి పరిష్కారాలను లేదా కనీస ఉపశమనం కల్పించడం గురించైనా ప్రస్తావించలేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న వైనాన్ని పదేపదే విమర్శిస్తున్నా వాటిగురించి ప్రస్తావించ కుండా ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పలు చెప్పారు. ఎన్నికల్లో ముఖ్యంగా చర్చనీయాంశమైన అగ్నిపథ్ ఊసే ఎత్తలేదు. ముఖ్యమైన ఎలాంటి చర్చ లేకుండా గిలెటెన్ చేయడం, సభలో హోంమంత్రి వివరణ ఇవ్వాలని కోరినందుకు 140 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం వంటివన్నీ ఇక గతంలో చూశాం. గత పదేళ్లుగా దేశంలో మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్న సంగతి వదిలేసి 1975 ఎమర్జెన్సీ గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఎలాంటి చర్చ లేకుండా ఆమోదింపజేసుకున్న అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్ చట్టం ఇంకా ఆచరణకు రాకపోయినా మహిళా సాధికారతకు ఎంతగానో కృషి జరిగిందని చెప్పుకోవడం దారుణం. వ్యవసాయ చట్టాలను తేవడం, వదిలించుకోవడం కూడా జరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీలను తుంగలో తొక్కారు. అందుకే ప్రజలు గడచిన రెండు సాధారణ ఎన్నికలకు భిన్నంగా బిజెపికి సొంతంగా మెజార్టీని ఇవ్వలేదు. అయినా మోడీ-అమిత్ షా ద్వయం గతంలో మాదిరిగానే పాలన సాగించా లని ప్రయత్నిస్తున్నారు. అందుకే బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్మొహమాటంగా అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్ధాలను వ్యాపింపజేయడం హిందూధర్మం కాదని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో రాహుల్‌గాంధీ విపక్ష నేత హోదా లో తొలిసారిగా మాట్లాడారు. నిజంగా గతంలో ఇలా మాట్లాడే అవకాశం ఎవరికీ లేదు. ఇప్పుడు విపక్ష సభ్యులు మాట్లాడే అవకాశం తెచ్చుకున్నారు. అధికార కూటమితో తలపడేంతగా విపక్ష బలం పెరిగింది. రాహుల్, అఖిలేశ్ యాదవ్ల్ ప్రసంగంలో పచ్చి నిజాలు ఉన్నాయి. ప్రజలు ఆకలిబాధలు లెక్కలేయాని అఖిలేశ్ చేసిన వ్యాఖ్యలు దేశంలోని పరిస్థితులకు అద్దం పట్టింది. జిడిపి లెక్కలు, దేశం ఆర్థికంగా ఐదో స్థానంలో ఉందన్న లెక్కలు అబద్ధాలని తేల్చేశారు. మొత్తంగా ప్రజాస్వామ్యం తలెత్తుకుంది. అందుకు పార్లమెంటులో సాగుతున్న ప్రసంగాలే నిదర్శనంగా చూడాలి.

# డిజిటల్ అరెస్టులు..పారాహుషార్..!

డిజిటల్ అరెస్ట్..ఇప్పుడీ భయం ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనాను మించి భూతంలా వెన్నాడుతోంది. అనేకులు మోసపోతున్నారు. బెదరించి..బ్లాక్ మెయిల్ చేయడం ద్వారా ఖాతాలను కొల్లగొట్టేస్తున్నారు. ఇలాంటి ఫేక కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసం చేస్తున్నాడని గుర్తించి పోలీసులను అప్రమత్తం చేయాలి. ఓ రకంగా ఇలాంటి కాల్స్ వస్తే తిరస్కరించడమే మేలు. డిజిటల్ అరెస్ట్‌ల క్రమంలో భారత్ అప్రమత్తం అయ్యింది. బాధితులు హేతుబద్ధంగా ఆలోచించే వ్యవధి ఇవ్వరాదనే సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు, తక్షణం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు వంటి మాటలతో భయపెట్టాలని చూస్తున్నారు. దేశీయంగా ప్రభుత్వ ఏజెన్సీలు అధికారిక లావాదేవీలకు వాట్సప్ లేదా స్కైప్ వంటి వేదికలను ఉపయో గించవు. ఎవరైనా ఫోన్‌కాల్ లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించి.. మీ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్నామని చెబితే బెంబేలు పడిపోకుండా అవతలి వ్యక్తులతో మాట్లాడి వారి గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. మోసగాళ్లు మిమ్మల్ని మభ్యపెట్టి బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తారు. ఇటువంటి సందర్భాల్లో మన భయం వారి పని సులువు చేస్తున్నదనే విషయాన్ని గుర్తించాలి. చట్టబద్ధమైన ఏజెన్సీలు ఏవీ తక్షణం డబ్బు పంపాలని ఒత్తిడి తీసుకురావు. సైబర్ నేరాలకు స్పందించే ముందు ఒక క్షణం ప్రశాంతంగా ఆలోచించాలి. తెలియని నంబర్లకు ఫోను ద్వారా, వీడియోకాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం, ఆర్థికపరమైన వివరాలు ఇవ్వరాదు. పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే మరింత జాగ్రత్తగా, ఎప్పటికప్పుడు ఇటువంటి పరిణామాలు తెలుసుకొంటూ ఉండటం అవసరం. ఒక్కోసారి చట్టబద్ధమైన సంస్థల లోగోలు కూడా మోసగాళ్లు వాడుతుంటారు. లాటరీ తగిలిందనే సందేశాలు వచ్చినపుడు గుడ్డిగా నమ్మడం, దురాశకు పోవడం చేస్తే సులువుగా దోచేస్తారు. వైద్య చికిత్సల కోసమని, ఫేక్ ఛారిటీ అప్పీళ్లతో భావోద్వేగాలను బలహీనతగా వాడుకునే కుంభకోణాలు, చట్టబద్ధమైన హైరింగ్ పోర్టల్స్ లేదా సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఉపాధి పోస్టులు పెట్టి నిరుద్యోగులను మోసగించే వైనాలు కూడా ఉంటున్నాయి. వినియోగదారులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం ఆసరాగా చేసుకొని వైరస్ గురించి హెచ్చరించడం ద్వారా రహస్యంగా కంప్యూటర్‌ను యాక్సెస్ చేసి సున్నితమైన వ్యక్తిగత సమాచారం అపహరిస్తారు. త్వరగా డబ్బు సంపాదించాలనే బలహీనతను ఆసరాగా చేసుకొని పెట్టుబడి కుంభకోణాలు, ఫేక్ ఆన్‌లైన్ స్టోర్లతో క్యాష్ ఆన్ డెలివరీ మోసాలు కూడా పెరుగుతున్నాయి. పొరపాటున మన ఖాతాకు పంపిన డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరడం.. ఓటీపీలు అడగటం.. డ్రగ్స్ పార్శిళ్లు వచ్చాయనే బెదిరింపులు, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వజూపటం వంటి ఎత్తుగడల్లో సైబర్ నేరగాళ్లు నైపుణ్యం సాధించారు. దేశంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో దజనుకు పైగా సూచనలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ సీఈఆర్‌టీ-ఐఎన్' కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఆఫ్ ఇండియా అత్యవసర పబ్లిక్ అడ్వయిజరీని జారీ చేసింది. భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం 'మన్ కీ బాత్'లో సైబర్ నేరాల గురించి ప్రజలను హెచ్చరించారు. అసలు 'డిజిటల్ అరెస్టు' అన్నదే పెద్ద ఆన్‌లైన్ కుంభకోణమని సీఈఆర్‌టీ-ఐఎన్ తెలిపింది. నిజానికి వారు ప్రదర్శించే ఒత్తిడి వ్యూహాలకు లొంగరాదని సీఈఆర్‌టీ-ఐఎన్ తన అడ్వయిజరీలో ప్రజలను కోరింది.'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ. 1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటిమోసపూరిత కాల్స్..బెదిరింపులపై ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలి. ప్రజలు ఒక్క క్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చు. నిజానికి డిజిటల్ మోసాలపై ఆందోళన చెందవద్దు. అప్రమత్తతతో ఉంటే చాలని గుర్తించాలి. నిజానికి మోసగాళ్లు ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి, ఆ తర్వాత భయపెడతారు. మనకే ఆశ్చర్యం కలిగించేలా మీ సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత తమ ఆహార్యంతో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామనే భ్రమ కల్పిస్తారు. వారెంతగా మిమ్మల్ని భయపెడతారంటే.. మనకుకు ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇప్పటికిప్పుడు తాము చెప్పినట్లు చేయకపోతే అరెస్టు తప్పదని మానసిక ఒత్తిడి తెస్తారు. దీంతో కొందరు భయంతో కష్టార్జితం మొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారు. అందుకే అప్రమత్తంగగా ఉండాలి. ఒకవేళ నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే బెదిరిపోవద్దు. వీలైతే స్క్రీన్‌షాట్ తీసి, కాల్‌ను రికార్డు చేయాలి. డిజిటల్ అరెస్టు అనేది మన చట్టాల్లో లేదు. అది ముమ్మాటికీ మోసం, వంచన, అబద్ధం. ఇలాంటి పనులు చేస్తున్నవారు సమాజానికి శత్రువులు అనే గుర్తించాలి. కాల్ చేసిన వారి గురించి అస్సుల పట్టించుకోవద్దు. ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగగవద్ద. సాధ్యమైనంత వరకు కాల్స్ కట్ చేయాలి. బెదిరింపులకు పాల్పడే వారిని గుర్తించి ఫిర్యాదు చేయాలి. అంతేగాకుండా మన తోటివారితో చర్చించాలి.

# సత్వర న్యాయం.. చట్టాల లక్ష్యం కావాలి !



బాధితులకు న్యాయం చేయడంతో పాటు..సత్వర న్యాయం మన చట్టాల లక్ష్యం కావాలి. పాలకులు వారి అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటున్న చట్టాలను కూడా చర్చించాలి. చట్టం ఎవరికైనా ఒక్కటే అన్న భావన ప్రజల్లో రావాలి. రాజకీయ నాయకులు చట్టాల నుంచి తప్పించుకోకుండా కఠిన చర్యలు తీసు కోవాలి. ఆ మేరకు చట్టాల అమలులో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి. ఉదాహరణకు అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పుడు పనులకు సంబంధించి విచారణలు వేగవంత కావాలి. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను పూర్తిగా సంస్కరించి భారతదేశానికి అనుగుణంగా చట్టాల రూపకల్పన జరగాలి. ఐపిసి, సిఆర్‌పిసిల స్థానంలో కొత్తగా తీసుకుని వచ్చిన చట్టాలను స్వాగతించాల్సిందే. ఓ రకంగా చెప్పాలంటే భారత న్యాయ వ్యవస్థలో నూతన అధ్యాయానికి తెరలేచింది. మన దేశంలో బ్రిటిష్ వలస పాలన నుంచి కొనసాగుతున్న భారత శిక్షా స్మృతి(ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధార చట్టం కనుమరుగు కానున్నాయి. వాటి స్థానంలో గతేడాది పార్లమెంటు ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్‌ఏ) ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు, ఎస్సెమ్మెస్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ లాంటి అత్యాధునిక పద్ధతులు కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థలోకి వచ్చాయి.. వీటిని తేవడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, భారతీయుల కోసం భారతీయులు ఈ చట్టాలను రూపొందించారు. దీంతో ఇక వలస పాలన నాటి నేర న్యాయచట్టాలు శాశ్వతంగా కనుమరుగుకానున్నాయి. కొత్త చట్టాల ఆత్మ, శరీరం, స్ఫూర్తి అంతా భారతీయమేనని తెలిపారు. ఈ కొత్త చట్టాల ప్రకారం.. క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా కచ్చితంగా తీర్పు వెలువడాలి. ఇందుకు అనుగుణంగా ఖచ్చితంగా పనిచేయాల్సి ఉంటుంది. తొలి విచారణ జరిగిన 60 రోజుల్లోపు అభియోగాలు నమోదు చేయాలి. వ్యవస్థీకృత నేరాలను, ఉగ్ర చర్యలను కొత్త చట్టాల్లో స్పష్టంగా నిర్వచించారు. రాజద్రోహం అనే పదాన్ని తొలగించారు. అయితే దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు భంగం కలిగించే చర్యలను శిక్షార్హం చేశారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కోసం కొత్త అధ్యాయాన్ని చేర్చారు. కొత్త చట్టాల ప్రకారం.. చిన్నారులపై సామూహిక అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష లేదా యావజ్జీవశిక్ష పడనుంది. రద్దయిన ఐపీఎస్‌లో కొన్ని సెక్షన్లు సంక్లిష్టంగా ఉండేవి. ఏ నేరం ఏ సెక్షన్ కిందకు వస్తుందన్న విషయంలో కాస్త గందరగోళం ఉండేది. వాటిని ప్రస్తుతం సరళతరం చేశారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)లో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో ఆ సంఖ్యను 358కి కుదించారు. ఐపీసీలోని 6 నుంచి 52 సెక్షన్ల మధ్య ఉన్న పలు నిర్వచనా లను ఒక సెక్షన్ కిందకు తెచ్చారు. 18 సెక్షన్లను ఇప్పటికే రద్దు చేశారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడం, చిన్నారులపై సామూహిక అత్యాచారం, మూకదాడి తదితర నేరాలకు ఐపీసీలో ప్రత్యేకంగా సెక్షన్లు లేవు. దీంతో గందరగోళం ఏర్పడేది. భారతీయ న్యాయ సంహితలో ఆ లోటును పూడ్చారు. ఇందుకు సంబంధించి చట్టాలను రూపొందించారు. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు మరింత పకడ్బందీగా జరగడానికి వీలుగా తీవ్రమైన నేరాల్లో సాక్ష్యాల సేకరణకు ఫోరెన్సిక్ నిపుణులు సంఘటన స్థలాన్ని సందర్శించడాన్ని తప్పనిసరి చేశారు. దాదాపు 150 ఏళ్లుగా అమలులో ఉన్నచట్టాలకు పాతరేయడం ఓ మంచి పరిణామంగా చేయాలి. ఇందుకు అనుగుణంగా పోలీసులు, న్యాయస్థానాలను కూడ ఆసన్నద్ధం చేయాలి. ఇప్పటికే అనేక దశలుగా పోలీస్‌లకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. కంప్యూటర్ వ్యవస్థలో అవసరమైన మార్పులు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా దర్యాప్తు, న్యాయవిచారణ చేసేందుకు కొత్త చట్టాలు ఊతమిస్తాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. 14 రోజుల్లోగా దర్యాప్తు చేపట్టి కేసును కొలిక్కి తేవాలన్న ప్రాథమిక లక్ష్యం ఇందులో కనిపిస్తోంది. మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి బాధితురాలి వాంగ్మూలా న్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేని పక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి. బాధితులత ోపాటు నిందితులు కూడా ఎఫ్ఐఆర్ నకళ్లను ఉచితంగా పొందే వీలుంటుంది. వీటితోపాటు పోలీస్ రిపోర్టు, ఛార్జిషీటు, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లోగా పొందవచ్చని కొత్త చట్టం పేర్కొంటోంది. ఇదే క్రమంలో కేసు విచారణలో అనవసర జాప్యాన్ని నివారించడానికి, సకాలంలో న్యాయం అందేలా చేయడానికి, న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి.సాక్షుల భద్రతను వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకుని, సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పని సరిగా అమలు చేయాల్సి ఉంటుంది. అత్యాచార నేరాల కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీస్‌లు నమోదు చేయాల్సి ఉంటుంది. మహిళలు, దివ్యాంగులు,దీర్ఘకాల వ్యాధిగ్రస్తులతో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసు వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు తాము నివాసం ఉన్న చోటే పోలీస్‌ల సాయం పొందవచ్చు. స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్థులకు సమాజ సేవచేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి. ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల ఆస్తులు, నేరం ద్వారా సంక్రమించిన సొమ్ముతో వారు కొన్న స్థిర, చరాస్తులనూ జప్తు చేసే అధికారం పోలీస్‌లకు ఉంటుంది. సాక్షుల వాంగ్మూలాలు, ఆడియో, వీడియో సాక్షాలన్నింటినీ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన డిజి లాకర్‌లో భద్ర పరుస్తారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్) ద్వారా ఇప్పటికే దేశ వ్యాప్తంగా అన్నిపోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేసినందున , సాక్షాలను ఆన్‌లైన్ ద్వారా పంపుతారు.



## తల్లికాబోతున్న కియారా అడ్వాణీ

హీరోయిన్ కియారా అడ్వాణీ, నటుడు సిద్ధార్థ్ మల్హోత్ర దంపతులు గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు పరోక్షంగా వెల్లడించారు. బేబీ సాక్స్‌ను చేతుల్లో పట్టుకున్న ఫొటోను ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. "మా జీవితానికి సంబంధించిన అద్భుతమైన బహుమతి త్వరలో రానుంది" అని ఇంస్టాగ్రామ్ వేదిక పోస్ట్ చేశారు. దీనికి బేబీ ఎమోజీని జత చేశారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ స్టార్ కపుల్‌కు అభినందనలు తెలుపుతున్నారు. రకుల్, కరీనా కపూర్, నేహా ధూపియా, ఏక్తా కపూర్ కియారా దంపతులకి శుభాకాంక్షలు తెలిపారు. 'షేర్షా' సినిమా కోసం తొలిసారి వీరిద్దరూ కలిసి నటించారు. ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే స్నేహం ఏర్పడింది. కొంతకాలానికే అది ప్రేమగా మారడంతో కుటుంబ సభ్యుల సమక్షంలో 2023 ఫిబ్రవరి 7న పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత కూడా వీరిద్దరూ సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. కియారా అడ్వాణీ నటించిన 'గేమ్ ఛేంజర్' సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

## బన్నీతో దిల్‌రాజ్ సినిమా



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో విడదీయరాని బంధం ఉంది. తొలి చిత్రం 'గంగోత్రి' తర్వాత అల్లు అర్జున్ తో 'ఆర్య' మూవీని నిర్మించి మంచి విజయాన్ని కట్టబెట్టాడు దిల్ రాజు. ఆ తర్వాత దిల్ రాజు బ్యానర్ లో 'పరుగు, ఎవడు, డి.జె. దువ్వాడ జగన్నాథమ్' చిత్రాలను బన్నీ చేశాడు. అప్పట్లోనే అల్లు అర్జున్ హీరోగా 'ఐకాన్ : కనబడుట లేదు' అనే సినిమా నిర్మించబోతున్నట్టు దిల్ రాజు ప్రకటించాడు. దానిని శ్రీరామ్ వేణు డైరెక్ట్ చేస్తారనీ అన్నారు. కానీ ఎందుకో అది మాత్రం పట్టాలెక్కలేదు. ఇటీవల విడుదలైన 'పుష్ప-2'తో బన్నీ ఇమేజ్ అమాంతంగా పెరిగిపోయింది. ఈ సినిమా వరల్డ్ వైడ్ రూ. 1871 కోట్ల గ్రాస్ ను వసూలు చేసింది. అల్లు అర్జున్ తదుపరి చిత్రాలపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే... తాజాగా అల్లు అర్జున్... దిల్ రాజు బ్యానర్ లో సినిమా చేయడానికి పచ్చజెండా ఊపాడని తెలుస్తోంది. ఇది 'ఐకాన్' మూవీనేనా... లేక పోతే వేరే కథను తీసుకుంటారా అనేది తెలియాల్సి ఉంది. అసలు ఇప్పుడున్న కమిట్ మెంట్స్ మధ్యలో దిల్ రాజుకు బన్నీ డేట్స్ ఇవ్వడమే పెద్ద విషయం అనీ అంటున్నారు. ఈ యేడాది దిల్ రాజు నిర్మించిన రెండు సినిమాలు 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదల కాగా, మొదటి సినిమా నిర్మాతగా దిల్ రాజుకు చుక్కలు చూపించింది. రెండో సినిమా ఘన విజయం సా ధించి, దిల్ రాజు ప్రొడక్షన్ హౌస్ కు కొత్త ఊపిరిలూదింది. ఇలాంటి పరిస్థితుల్లో అల్లు అర్జున్... దిల్ రాజుకు డేట్స్ ఇవ్వడమంటే గ్రేట్ అని సినిమా వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇదిలా ఉంటే... 'పుష్ప-2' రేంజ్ మామూలుగా లేదనే విషయం మరోసారి ప్రూవ్ అయ్యింది. అమెరికన్ పాపులర్ షో 'ఎన్.బి.ఎ.' గేమ్ లో ఛీర్ లీడర్స్ ఏకంగా 'పుష్ప -2'లోని వస్తున్నాయ్ పీలింగ్స్ పాటకు స్టెప్పులేసి అలరించారు. దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయింది. ఇండియన్ సినిమా ఒకటి గ్లోబల్ స్టేజ్ లో ఏ పొజిషన్ కు చేరుకుందో చెప్పడనికి ఇదో గొప్ప ఉదాహరణ. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ ఎవరితో సినిమా చేసినా... అది సంచలనం అవుతుందనడంలో సందేహం లేదు.

### ప్రభాస్‌తో రెండు గంటలు

## సినిమా కష్టం..?

ప్రభాస్‌తో సింగిల్ సినిమా చేయలేకపోతున్నారా మన దర్శకులు..? రెబల్ స్టార్‌తో రెండున్నర గంటల



సినిమా చేయడం అంత కష్టమా..? ప్రభాస్ డేట్స్ ఇస్తే చాలు.. కనీసం రెండు పార్ట్స్ ఉన్న సినిమానైనా చేయాలంటూ ముందుగానే బ్లైండ్‌గా ఫిక్స్ అయిపోతున్నారా..? అసలేం జరుగుతుంది..? మరి ఇప్పుడే సినిమా 2 పార్ట్స్‌గా రాబోతుంది..? ప్రభాస్‌తో పెద్ద స్పాన్ ఉన్న సినిమాలే కాదు.. పెద్ద కథలు కూడా రాసుకుంటున్నారు మన దర్శకులు. కనీసం 5 గంటల సినిమా ప్లాన్ చేసుకుంటున్నారు. బడ్జెట్ వర్కవుట్ అవుతుంది కదా అని.. ప్రతీ సినిమాను 2 భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే బాహుబలి 2 పార్ట్స్‌గా వచ్చింది.. కల్కి 2, సలార్ 2 సెట్స్‌పైకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రభాస్ సినిమాలకు తక్కువలో తక్కువ 300 నుంచి 500 కోట్ల వరకు బడ్జెట్ పెడుతున్నారు నిర్మాతలు. అంత వర్కవుట్ అవ్వాలంటే 2 పార్ట్స్ ఉండాల్సిందే అంటున్నారు దర్శకులు. ప్రస్తుతం రాజా సాబ్, హను రాఘవపూడి ఫౌజీ సినిమాలను ఒకేసారి పూర్తి చేస్తున్నారు ప్రభాస్. ఇందులో రాజా సాబ్ 2 పార్ట్స్ సినిమాగా ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. వరసగా సీరియస్ సినిమాలు చేస్తున్న ప్రభాస్.. మారుతితో తక్కువ బడ్జెట్‌లో సరదా సినిమా చేయాలని రాజా సాబ్ షురూ చేసారు. కానీ రానురాను ఇది కూడా భారీ బడ్జెట్ అయిపోయింది. దీనికోసం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. దీనికి సైతం మారుతి సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారంటూ టాక్ వినిపిస్తుందిప్పుడు. ఆల్రెడీ కల్కి, సలార్ సీక్వెల్స్ ఎప్పుడొస్తాయో క్లారిటీ లేదు.. ముందైతే స్పిరిట్ పూర్తి చేయాలని చూస్తున్నారు ప్రభాస్. అంతలోనే రాజా సాబ్ సీక్వెల్ కూడా అంటే కాస్త కష్టమే. అయినా ప్రతీ సినిమాను 2 పార్ట్స్‌గా చేయడమనే ఆలోచన మంచిది కాదనే వాదన కూడా వినిపిస్తుందిప్పుడు. మరి దీనిపై ప్రభాస్ దర్శక నిర్మాతలు ఏం ఆలోచిస్తారో చూడాలి.

## వాణిజ్య ప్రకటనలను తెచ్చిన కష్టాలు

### కాజల్, తమన్నాలను విచారించనున్న పోలీసులు

కాసులకు ఆశపడి స్టార్స్ చేసే కొన్ని ప్రకటనలు వారికి ఊహించని కష్టాలను కొని తెచ్చిపెడతాయి. ఇప్పటికే పలువురు హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా ఇలాంటి సమస్యలలో చిక్కుకున్నారు. తాము ప్రచారం చేసే ప్రొడక్ట్‌తో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో ముందు ఊహించుకోకుండా వీరు ఆయా ప్రకటనల్లో పాల్గొనడమే ఇందుకు కారణం. నిజానికి బ్రాండ్ అంబాసిడర్ గా అంగీకార పత్రాన్ని సమర్పించేప్పుడే ఆ ప్రొడక్ట్ లేదా ప్రాజెక్ట్ వల్ల వినియోగదారులు నష్టపోతే తమకు సంబంధం లేదనే క్లాజ్ ను చేర్చికానీ కొందరు సైన్ చేయడం లేదు. కానీ అంతలోతుగా వివరాలను అధ్యయనం చేయకుండా చాలామంది హీరోయిన్లు రెమ్యూనరేషన్ కు ప్రాధాన్యం ఇచ్చి... వాణిజ్య ప్రకటనలు చేసేసి ఆపైన ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఆ జాబితాలోకి కాజల్ అగర్వాల్, తమన్నా భాటియా పేర్లు కూడా చేరాయి. పుదుచ్చేరికి చెందిన ఓ సంస్థ క్రిప్టో కరెన్సీ లో పెట్టుబడులు పెడితే అధిక లాభం పొందవచ్చంటూ కొందరిని తన బుట్టలో వేసుకుంది. దాదాపు పదిమంది ఈ సంస్థలో 2.40 కోట్లను మదుపు చేశారు. అయితే ఆ తర్వాత తాము మోసపోయామంటూ ఘొల్లుమంటున్నారు. ఈ విషయమై లాస్ పేట్టైకు చెందిన అశోకన్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంబంధిత వ్యక్తులను పోలీసులు విచారించడం మొదలు పెట్టారు. ఈ సంస్థ 2022లో కోయంబత్తూరులో కార్యాలయం ప్రారంభించినప్పుడు అతిథిగా తమన్నా హాజరైంది. అలానే ఆ తర్వాత మహాబలిపురంలోని ఓ స్టార్ హెూటల్ లో జరిగిన ప్రోగ్రామ్ కు కాజల్ వెళ్ళింది. ఇంతేకాకుండా ముంబైలోని ఒక ఓడలో భారీ పార్టీని సదరు సంస్థ నిర్వహించి, అక్కడ కూడా వేలాది మంది నుండి బోలెడంత డబ్బును సేకరించింది. ఇప్పటికే ఈ సంస్థకు చెందిన నితీశ్ జెయిన్, అరవింద్ కుమార్ అనే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇందులో భాగంగా సంస్థ కార్యక్రమాలలో పాల్గొన్న కాజల్, తమన్నాలనూ కూడా విచారించాలని పోలీసులు భావిస్తున్నారట. తమ సమయాన్ని లక్షల రూపాయల్లోకి మార్చేసుకుని, సొమ్ము చేసుకుంటున్న కథానాయికులు... ఇప్పుడు పోలీసుల విచారణ కోసం సమయం కేటాయించాల్సిన రావడం చిత్రమే.



Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656